www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి 09, సంచిక: 76 | శుక్రవారం | 13-02-2026 | ఖమ్మం

Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

PRAJAPAKSHAM ★★★★



జంతర్‌మంతర్ వద్ద కార్మికసంఘాల బహిరంగ సభలో అమర్‌జీత్ కౌర్..

## సార్వత్రిక సమ్మెలో 30 కోట్ల మంది

## అన్ని సమ్మెలను మించి

# గ్రాండ్ సక్సెస్

**ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వ నిరంకుశ కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలపై వెల్లువెత్తిన నిరసనలు**

● దేశంలో 600కు పైగా జిల్లాల్లో సమ్మె ● సంఘటిత, అసంఘటిత, ప్రభుత్వరంగాల కార్మికులు భాగస్వామ్యం ● పారిశ్రామిక, గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలూ మద్దతు ● అనేక రాష్ట్రాల్లో బంద్‌ను తలపించిన పరిస్థితి ● రోడ్డెక్కని బస్సులు, రవాణాపై తీవ్ర ప్రభావం ● బ్యాంకింగ్, ఎల్ఐసి, టెలికాం సేవలకు అంతరాయం ● పలుచోట్ల రైల్ రోకో, గనులు, పోర్టులపై ప్రభావం ● ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ బహిరంగసభ ● పార్లమెంట్ ప్రాంగణంలో ఎంపిల సంఘీభావం

02


హైదరాబాద్‌లో కార్మిక సంఘాల భారీ ప్రదర్శన

దేశవ్యాప్తంగా కార్మికలోకం కదం తొక్కింది. వారికి దేశానికి అన్నం పెట్టే రైతన్న భుజం కలిపాడు. కేంద్ర విధానాలతో బతుకే భారంగా అన్ని వర్గాల ప్రజలు అడుగులు వేసారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నిరంకుశ లేబర్ కోడ్‌లు, విత్తన, విద్యుత్ సవరణ చట్టం రద్దుచేయాలని, మహాత్మాగాంధీ నరేగా పునరుద్ధరించాలని, రైతుల నడ్డివిరిచే అమెరికా ఒప్పందం వద్దని, ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేయాలని, బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డిఐల నిర్ణయం ఉపసహరించాలనే డిమాండ్లపై నినాదాలను హోరెత్తించారు. రాష్ట్రాలలో జాతీయ సార్వత్రిక సమ్మె దిగ్విజయమైంది. ఒకవైపు సమ్మె జరుగుతున్న రోజే.. కావాలని కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లోని పారిశ్రామిక సంబంధాల కోడ్‌ను సవరిస్తూ లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టింది. తలిచిందొకటి, జరిగిందొకటి లాగా.. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రాతినిధ్యం వహిస్తున్న వివిధ పార్టీలకు చెందిన విపక్ష పార్టీల ఎంపిలు నాలుగు కోడ్‌లను రద్దు చేయాల్సిందేనంటూ పట్టుబట్టారు. కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టులా వారు కార్మికులకు అండగా తమ గొంతును పార్లమెంటులో ప్రతిధ్వనించారు.

సమ్మె వార్తలు లోపలి పేజీల్లో...


తిరుచ్చిలో రైల్ రోకో..



బెంగళూరు టౌన్‌హాల్ ఎదుట కార్మిక సంఘాల నిరసన


గుజరాత్‌లో..



సమ్మెకు మద్దతుగా పార్లమెంట్ ప్రాంగణంలో ఎంపిల సంఘీభావం


సిమ్లాలో ఆపిల్ రైతుల ప్రదర్శన..



నాగ్‌పూర్‌లో..



డిఫెన్స్ ఉద్యోగుల సంఘీభావం



ప.బెంగాల్‌లో హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ ఎదుట...

## రైలు మార్గాలు మంజూరు చేయండి

**కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి**



ప్రజాపక్షం/హైదరాబాద్

మూసీ పునరుజ్జీవం, రైలు మార్గాల మంజూరు, విమానాశ్రయాల పనులు వేగవంతమే చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరుసగా భేటీ అయ్యారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు, భూబదలాయింపులు, నిధుల మంజూరును కోరుతూనేరాష్ట్ర ప్రభుత్వపరంగా ఇవ్వనున్న మద్దతు, భూ కేటాయింపులను కేంద్ర మంత్రులకు సిఎం వారికి వివరించారు. కేంద్ర మంత్రులతో జరిగిన సమావేశాలలో కాంగ్రెస్ ఎంపిలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీ కృష్ణ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ కె.ఎస్.శ్రీనివాసరాజు, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

**మూసీ కోసం 100 ఎకరాలు బదలాయించండి**

ఈసీ, మూసీ నదుల సంగమ స్థలంలో ప్రపంచ స్థాయి విద్యా సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ కేంద్రంగా నిర్మించనున్నామని, ఫిబ్రవరి నెలాఖరులో చేసే గాంధీ సరోవర్ ప్రాజెక్టు

తరువాయి 2లో

## ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త ఆరోగ్య పథకం

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగులకు 15 రోజుల్లో నూతన ఆరోగ్య పథకాన్ని ప్రారంభించాలని ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ సమావేశం నిర్ణయించింది. సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అధ్యక్షతన ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ గురువారం సమావేశం జరిగింది. ఇందులో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సి.వీ ఆనంద్, మహేశ్ దత్ ఎక్కా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు లతోపాటు పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డ్ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ కె.రామకృష్ణరావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతిపాదించిన నూతన హెల్త్ స్కీమ్ ఒక ముందడుగు అని అన్నారు. ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన హెల్త్ స్కీమ్ కు ఉద్యోగుల తరపున మూల వేతనం నుంచి 1.5 శాతాన్ని, ప్రభుత్వం తరపున 1.5 శాతం కేటాయించాలన్న ప్రతిపాదనను సమావేశంలో ఆమోదించారని తద్వారా ప్రతి ఏటా రూ. 528 కోట్లు జమ అవుతాయని తెలిపారు.

## ఫలితాలు నేడే

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం జరిగిన 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల ఫలితాలు శుక్రవారం వెలువడనున్నాయి. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమల్లో ఉండనుంది. ఫలితాలపై రాజకీయ పార్టీలు ప్రజలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.




దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా హైదరాబాద్‌లో జరిగిన ప్రదర్శనలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి. నర్సింహ, ఇతర వామపక్ష నేతలు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలో జరిగిన కార్మికుల ధర్నాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.



03



## కిమ్ కూతురికే రాజకీయ వారసత్వం

**సియోల్ :** ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ తన కుమార్తె కిమ్ జుఏను తదుపరి రాజకీయ వారసురాలిగా ఎంపిక చేశారని దక్షిణకొరియా గూఢచారివర్గాలు గురువారం ఆ దేశ చట్టసభ సభ్యులకు తెలియజేశాయి. ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిగే పార్టీ కాంగ్రెస్ ఈనెలాఖరులోనే నిర్వహించనున్నారు. ఈ పార్టీ కాంగ్రెస్‌లో ఆమె ఎలాంటి పాత్ర నిర్వహిస్తారు? కార్యాచరణ ప్రకటనలు ఏమిటి? అనే విషయాలపై కూడా గట్టి నిఘా వేసినట్లు దక్షిణ కొరియా జాతీయ ఇంటిలిజెన్స్ సర్వీస్ చట్టసభ సభ్యులకు తెలియజేసింది. చాలాసార్లు కిమ్ వెంట అనేక కార్యక్రమాల్లో ఆయన కుమార్తె ఇప్పటికే బహిరంగంగా కనిపించారు.

ఇటీవలి నెలల్లో ఆ ఫొటోలు ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయ్యాయి కూడా. ఐతే ఆమె పూర్తి వివరాలు, సమాచారం ప్రపంచానికి తెలిసింది చాలా తక్కువే. ఇటీవల బీజింగ్ పర్యటన సందర్భంగా ఆమె తండ్రివెంట వెళ్ళిన ఫొటోలు పలుచోట్ల కనిపించాయి. గతంలో ఆమె కొరియన్ పీపుల్స్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలలో కూడా పాల్గొన్నారు. తండ్రివెంట ఉంటూ ఆమె దేశ కార్యకలాపాలలో శిక్షణ పొందుతున్నారు.

# అర్జెంటీనాలో సమ్మె–పనిహక్కులపై ఉక్కుపాదం

### పార్లమెంటు ఎదుట వేలాదిమంది నిరసన ప్రదర్శన

### కార్మికులు – భద్రతాసిబ్బంది మధ్య ఘర్షణ, అరెస్టులు



**బ్యూనోస్‌ఐర్స్ :** అర్జెంటీనాలో కార్మికులు వేలాదిమంది దేశ రాజధాని బ్యూనోస్ ఐర్స్‌లో నిరసన ప్రదర్శన చేశారు. కార్మికహక్కులను కాపాడుకోవడంకోసమే తాము వీధుల్లోకి వచ్చినట్లు జనరల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ లేబర్, కార్మిక సంఘాల కూటమి ఒక ప్రకటనలో తెలియజేసింది. సమ్మె చేసే హక్కును కాలరాసి, ఉద్యోగ అవకాశాలను దెబ్బతీసే కార్మిక సంస్కరణల బిల్లును వ్యతిరేకిస్తూ వివిధ కార్మిక సంఘాలు, ప్రజలు వేలాదిమంది నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు కార్మిక సంఘాలను నియంత్రించి వారికి ఇచ్చే వేతనాలను తమకు అనుకూలంగా సవరించుకోవడానికి వీలు కలుగుతుంది. కార్మికులు ఈ బిల్లును వ్యతిరేకించడంతో ఘర్షణలు చెలరేగాయి. అనేకమందిని పోలీసులు అరెస్టు చేశారు. కార్మికులు పార్లమెంటు కాంగ్రెస్ భవనం ఎదుట ప్రదర్శన చేస్తున్నాగానీ పాలకులు లెక్కచేయకుండా కార్మిక సంస్కరణ బిల్లుపై చర్చను ముందుకు తీసుకువెళ్ళారు. కార్మికులు పార్లమెంటు భవనం వద్దకు చేరుకోగానే పోలీసులు వారిని చెల్లాచెదురు చేసేందుకు శక్తిమంతమైన నీటిగొట్టాలను ప్రయోగించారు. వారిపై టియర్‌గ్యాస్, రబ్బర్ బుల్లెట్లు ప్రయోగించారు. దీంతో కార్మికులు పోలీసులను ప్రతిఘటించారు. తమ హక్కులను కాలరాసేందుకు, కార్మిక సంఘాలను బలహీనపరచేందుకే ఈ సంస్కరణల బిల్లు తీసుకువచ్చారని కార్మికులు నినాదాలు చేశారు. కార్మిక సంఘాలకు ఉన్న హక్కులను హరించి, కార్మికులను సులభంగా పని నుండి తొలగించడం, రక్షణలేకుండా నియామకాలు చేసుకోవడానికి వీలుగా లేబర్ మార్కెట్‌ను పారిశ్రామికవేత్తలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఈ కార్మిక సంస్కరణల బిల్లును పార్లమెంటులో అధ్యక్షురాలు జేవియర్ మిలే ప్రవేశపెట్టారు. స్వేచ్ఛామార్కెట్ వ్యవస్థను అమలు చేయాలంటే ఈ సంస్కరణలు అనివార్యంగా చేపట్టాల్సిందేనని మిలే పార్లమెంటు సెనేట్‌లో చర్చ సందర్భంగా వాదించారు. వామపక్షాలు, సోషలిస్టులకు చెందిన కార్మిక సంఘాలు ఈ నిరసన ప్రదర్శనలో కీలకపాత్ర వహిస్తున్నాయి. 2023 ఎన్నికల్లో అధ్యక్షురాలుగా గెలిచిన జేవియర్ మిలే పాలనలో ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ పురోగతి మందగించింది.

# యావత్ ప్రపంచం దృష్టి బంగ్లాదేశ్‌పైనే

### ముగిసిన పోలింగ్ – నేడు ఫలితాలు



**ఢాకా:** బంగ్లాదేశ్‌ను మలుపుతిప్పే 13వ సార్వత్రిక ఎన్నికలలో గురువారం ప్రజలు జోరుగా పోలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. దేశంలో అక్కడక్కడ హింసాత్మక ఘటనలు, అక్రమాలు జరిగాయని రాజకీయపార్టీలు ఆరోపించాయి. ఉదయం 7.30గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4.30 గంటలకు ముగిసింది. పోలి ంగ్ ముగిసిన తర్వాత లెక్కింపు ప్రక్రియ మొదలైంది. ఈ కార్యక్రమాన్ని మీడియా లైవ్ టెలికాస్ట్ చేస్తోంది. యూరప్ సహా 45 దేశాల ప్రతినిధులు ఈ ఎన్నికల్లో అంతర్జాతీయ పోలింగ్ పరిశీలకులుగా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 9,00,000 మంది భద్రతా సిబ్బందిని విధుల్లో ఉంచారు. భద్రత పర్యవేక్షణ నిమిత్తం దళాలు మొదటిసారి బోడీ కెమెరాలను, డ్రోన్లను ఉపయోగించారు. కాగా ఖుల్నా, మానిక్‌గంజ్, కిషోర్‌గంజ్, బ్రాహ్మణ్‌బారియా ప్రాంతాలలో పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణల్లో నలుగురు మరణించారు. 18 నెలలుగా ప్రధానమంత్రి లేకుండా తాత్కాలిక ప్రభుత్వ పాలనలో ఉన్న బంగ్లాదేశ్‌లో కౌటింగ్ సక్రమంగా జరిగితే మరో ఇరవైనాలుగు గంటల్లో కొత్త నాయకత్వం ఎవరిదో వెల్లడవుతుంది. కొత్త ప్రభుత్వం కోసం దేశంలో ఆర్థిక–సాంఘిక సవాళ్ళు, సమస్యలు కాచుకుని ఉన్నాయి. అవామీ లీగ్ పార్టీ ఉనికీ, ఊసూలేని ఈ ఎన్నికల్లో, ఇటీవలి కాలంవరకూ నిషేధానికి గురైన జమాత్–ఏ–ఇస్లామీ పార్టీ ఇప్పుడు 11 పార్టీల కూటమికి నాయకత్వం వహిస్తూ, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీకి పెద్ద సవాలుగా, ప్రధాన ప్రత్యర్థిగా నిలిచింది. యువకులే కేంద్రంగా కొత్తగా ఆవిర్భవించిన నేషనల్ సిటిజన్ పార్టీ కూడా తృతీయశక్తిగా ముందుకు వచ్చింది. మొత్తం 51 పార్టీల అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేశారు. దేశంలో 44 శాతం ఓటర్లు అందరూ 37 ఏళ్ళు లోపు వయసుగలవారే. బిఎన్‌పి నేత తారిఖ్ రెహ్మాన్ ఢాకాలోని గుల్షన్ మోడల్ స్కూలు సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. జమాత్–ఏ–ఇస్లామ్ నాయకుడు షఫికుర్ రహమాన్ మోనిపూర్ ఉచ్చావిద్యాలయ్‌లో ఓటు వేశారు.

మధ్యాహ్నంనాటికి 40.9 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల సంఘం కార్యదర్శి అక్తర్ అహ్మద్ చెప్పారు. రాజ్యాంగంలో మార్పులకు ఉద్దేశించిన ''జులై ఛార్టర్''పై ప్రజాభిప్రాయ సేకరణ కూడా నిర్వహించారు. పార్లమెంటు ''జతియా సంసద్''లో ఉన్న 350 స్థానాలకుగాను నిర్ణీత ప్రకారం 300 నియోజకవర్గాలలో పోలింగ్ జరగాల్సి ఉండగా, షెర్పూర్–3 మినహా 299 నియోజకవర్గాల్లో పోలింగ్ జరిగింది.. 12.77 కోట్ల మంది అర్హులైన ఓటర్ల కోసం ఓటర్లకోసం ఎన్నికల సంఘం 42,779 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఢాకా–19 నియోజకవర్గంలోని మహిళా పోలింగ్ కేంద్రంలో అధికారి అనుద్దేశపూర్వకంగా తప్పుచేయడంతో ఆయనను విధులనుండి తప్పించారు. ఒక ఓటరు గురించి వెరిఫికేషన్ చేస్తూ మరో ఓటరు వచ్చి ఓటు వేసి వెళ్ళినట్టుగా ఆయన గుర్తుపెట్టారు. దీంతో ఆ తర్వాత వచ్చిన మహిళ ఓటుహక్కు ఉపయోగించుకోలేకపోయారు. ఈ తప్పు గ్రహించిన ఉన్నతాధికారులు పోలింగ్ అధికారని విధుల నుండి తొలగించారు.

**బంగ్లాదేశ్‌కు సరికొత్త పుట్టినరోజు : యూనుస్**

చరిత్రాత్మకమైన ఈ పోలింగ్ దినం బంగ్లాదేశ్‌కు ఒక సరికొత్త పుట్టినరోజు అని తాత్కాలిక ప్రభుత్వ అధినేత, ప్రధాన సలహాదారు మహ్మద్ యూనుస్ వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికలు ఎప్పుడూ జరిగే ఒక రాజకీయ ప్రక్రియ మాత్రమే కాదని, బంగ్లాదేశ్ ప్రజలందరూ ఉమ్మడిగా తమ భవిష్యత్తును, విధిరాతను నిర్దేశించుకోవడానికి ఉద్దేశించిన పోలింగ్ ప్రక్రియ అన్నారు. జులై ఛార్టర్‌పై వేసే ఓటు కేవలం ఒక ముద్ర మాత్రమే కాదని, దేశ భవితను ఆ ముద్ర నిర్దేశిస్తుందని అన్నారు. కాబోయే ప్రధానమంత్రిగా దేశంలో బాగా ప్రచారం పొంది; EHNన బంగ్లాదేశ్ నేషనలిస్టుపార్టీ (బిఎన్‌పి) ఛైర్మన్ తారిఖ్ రెహ్మాన్ మాట్లాడుతూ, ఓటింగ్ తర్వాత విజయం తమనే వరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎన్నికలు నీతిగా,నిజాయతీగా జరిగితే తామే సంపూర్ణ విజయం సాధిస్తామని జమాత్–ఏ–ఇస్లామ్ అమీర్ షఫికుర్ రహమాన్ అన్నారు. ఇస్లామీ ఆందోళన్ బంగ్లాదేశ్ (ఐఎబి) పార్టీ నాయకుడు ఫైజుల్ కరీమ్ మాట్లాడుతూ, న్యాయంగా, నిజాయతీగా ఎన్నికలు జరిగితే దేశంలో ప్రజలు ఇస్లామ్, షరియాహ్‌కు మద్దతు ఇస్తారన్నారు.

## బిఎన్‌పి ఆధిక్యత

### రెండుచోట్ల తారిఖ్ రెహ్మాన్ గెలుపు



**ఢాకా:** బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల తొలి ఫలితాల్లో బంగ్లాదేశ్ నేషనలిస్టుపార్టీ (బిఎన్‌పి) ఆధిక్యంలో ఉంది. ముందుగా ఊహించిన విధంగానే జమాత్–ఏ–ఇస్లామ్ పార్టీ కూటమి ప్రతిపక్షంఒలో ఉండే అవకాశం ఉందని ఆ దేశ పత్రికలు అప్పుడే ఊహాగానాలు చేస్తున్నాయి. గురువారం రాత్రి 11 గంటలవరకూ వెలువడిన సమాచారం ప్రకారం బిఎన్‌పి ఛైర్మన్ తారిఖ్ రెహ్మాన్ పోటీ చేసిన రెండు నియోజకవర్గాలలో విజయం సాధించారు. ఐతే ఈ ఫలితాలను ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఢాకా–17, బోగ్రా నియోజకవర్గాల నుండి ఆయన పోటీ చేశారు. మొత్తం 299 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగాయి. ఒక నియోజకవర్గంలో ఎన్నిక అభ్యర్థి (జమాత్–ఏ–ఇస్లామ్)మరణం కారణంగా వాయిదా పడింది. 11 నియోజకవర్గాలలో లెక్కింపు పూర్తికాగా, 10 స్థానాలను బిఎన్‌పి గెలుచుకున్నట్లు అధికారికంగా ప్రకటించారు. మరో 20 నియోజకవర్గాలలో కౌంటింగ్‌లో ముందుకు దూసుకుపోతోంది. ఇక జమాత్–ఏ–ఇస్లామ్ పార్టీ నాయకత్వంలోని 11 పార్టీల కూటమి ఒక స్థానం గెలుచుకుంది. ఇస్లాం ఆందోళన్ బంగ్లాదేశ్, ఇతరులకు కూడా ఒక్కసీటు కూడా దక్కలేదు. ఇంకా 288 స్థానాల్లో ఫలితాలను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. 42, 659 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరగ్గా, మధ్యాహ్నం రెండు గంటల నాటికి 36,031 నియోజకవర్గాలలో 47.91 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇంకా 6,620 కేంద్రాల నుండి డేటా అందవలసి ఉన్నందువల్ల ఎంత శాతం పోలింగ్ జరిగిందనే వివరాలు పూర్తిగా తెలియరాలేదు.

# సార్వత్రిక సమ్మె సక్సెస్


తమిళనాడులో



త్రిపురలో

**న్యూఢిల్లీ :** భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం, ఎంజినరేగా రద్దు, తదితర కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన జాతీయ సార్వత్రిక సమ్మెకు అపూర్వ స్పందన లభించింది. ఈ సమ్మెలో మునుపెన్నడూ లేని విధంగా 30 కోట్ల మందికి పైగా వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నట్లు అంచనా. దేశవ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత, ప్రభుత్వ, ప్రభుత్వ రంగ, తదితర అన్ని రంగాలతో పాటు పారిశ్రామిక ప్రాంతాలు, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో మునుపటి సమ్మెలను తలదన్నెలా పెద్ద ఎత్తున ప్రజలు భాగస్వాములయ్యారు. కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర రంగాల ఫెడరేషన్లు, అసోసియేషన్‌ల సంయుక్త వేదిక, సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక కలిసి దేశంలోని 600 కంటే ఎక్కువ జిల్లాల్లో సమ్మె జరిగింది. పెద్ద ఎత్తున జనసమీకరణతో అత్యంత విజయవంతమైంది. ఈ మేరకు కేంద్ర కార్మిక సంఘాలు ఒక ప్రకటనలో పేర్కొన్నాయి.

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభలో అమర్జీత్ కౌర్ (ఎఐటియుసి), అశోక్ సింగ్ ఐఎన్‌టియుసి, హర్భజన్ సింగ్ సంధు (హెచ్‌ఎంసి), సుదీప్ దత్తా (సిఐటియు),ఆర్.కె. శర్మ (ఎఐయుటియుసి), జి. దేవరాజన్(టియుసిసి) లతాబెన్ (సేవా), రాజీవ్ దిమ్రీ(ఎఐసిసిటియు), శత్రుజీత్ సింగ్ (యుటియుసి), సంతోష్ కుమార్ (ఎంఇసి)తదితర సెంట్రల్ కేంద్ర ట్రేడ్ యూనియన్ నాయకులు, కిసాన్ నాయకులు ప్రసంగించారు. పార్లమెంటు వెలుపల వామపక్ష, విపక్ష ఎంపిలు సమ్మెకు సంఘీభావంగా ప్రదర్శన జరిపారు.

అనేక చోట్ల 'సేవ్ ఎడ్యుకేషన్', 'ఉపాధి హామీ ఇవ్వండి', 'ఖాళీ పోస్టులను భర్తీ చేయండి' తదితర నినాదాలు చేస్తూ విద్యార్థులు, యువత సమ్మెలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రాస్తా రోకో, రైల్ రోకో కార్యక్రమాలలో ఐసిడిఎస్, ఆశా, మధ్యాహ్న భోజనం, బీడీ రంగం, గృహ కార్మికులతో పాటు నిర్మాణ రంగం, హాకర్లు, విక్రేతలు, లోడింగ్ అన్‌లోడింగ్ హమాలీలు, ఇంటి పనివారల్లు, మత్స్యకారులు వంటి ఇతర అసంఘటిత రంగాల మహిళలు ముందు వరుసలో నిలిచారు. అనేక రాష్ట్రాల్లో పలు చోట్ల ఈ–రిక్షా డ్రైవర్లు, ఆటో , టాక్సీ యూనియన్లు పాల్గొన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులు భారీగా గుమిగూడారు.

**అన్ని రాష్ట్రాలలో సక్సెస్**

దేశవ్యాప్తంగా సమ్మె సక్సెస్ అయింది. పుదుచ్చేరి, అస్సాం, ఒడిశా, జార్ఖండ్, తమిళనాడు, పంజాబ్, కేరళ, పశ్చిమ బెంగాల్, గోవా మొదలైన దేశంలోని అనేక రాష్ట్రాల్లో బంద్ పరిస్థితిని తలపించింది. రాజస్థాన్, హర్యానా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మేఘాలయ, మణిపూర్, త్రిపుర వంటి రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలలో పాక్షిక బంద్ జరిగినట్లు కార్మిక సంఘాలు తెలియజేశాయి. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, గుజరాత్‌లోని పారిశ్రామివాడల్లో సమ్మె జరిగింది. అనేక రాష్ట్రాలలో బస్సులు రోడ్డెక్కలేదు. కేరళ, తమిళనాడులో రాష్ట్ర రవాణ సంస్థ కార్మికులు ముందే సమ్మెకు మద్దతుగా విధులకు దూరంగా ఉన్నారు. కర్నాటకలో అన్ని కార్మిక సంఘాలు బెంగళూరు టౌన్ హాల్ వద్ద నిరసన తెలియజేస్తుండగా, పోలీసులు ఈడ్చుకెళ్ళారు. హిమాచల్ ప్రదేశ్‌లో ఆపిల్ పండ్ల రైతులు సమ్మె చేశారు. తమిళనాడులో పలు చోట్ల రైళ్ళను అడ్డుకున్నారు. జార్ఖండ్‌లోని అనేక ప్రాంతాలలో సమ్మె సక్సెస్ అయింది. ఒడిస్సాలో అన్ని సంఘాలు 12 గంటల బంద్ నిర్వహించాయి. తెలంగాణలో ఆటో కార్మికులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటోలను నడపుకుంటా సంపూర్ణంగా సమ్మెలో పాల్గొన్నారు. అలాగే కార్మిక సంఘాలు హైదరాబాద్‌లో భారీ ప్రదర్శనను నిర్వహించాయి. తమిళనాడులో అనేక పోర్టుల్లో పనులు నిలిచిపోయాయి.

**గనులు, పారిశ్రామిక వాడల్లో**

గనులు,తయారీ, సర్వీసు రంగంలో సమ్మె భారీ ప్రభావం చూపింది. బొగ్గు, ఎన్‌ఎండిసి, ఐరన్, రాగి, బాక్సైట్, అల్యూమినియం, బంగారు గనులు వంటి ఇతర బొగ్గు ఏతర ఖనిజాల కార్మికులు, వారి యూనియన్లు, స్టీల్, బ్యాంకులు, ఎల్ఐసి, జిఐసి,పెట్రోలియం, విద్యుత్, పోస్టల్, గ్రామీణ డాక్ సేవకులు, టెలికాం, అణుశక్తి, సిమెంట్, పోర్ట్ అండ్ డాక్, టీ తోటలు, జూట్ మిల్లులు, ప్రజా రవాణా, ప్రైవేట్ రంగంలోని వివిధ రకాల రవాణా, వివిధ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు.

పోస్టల్, ఆదాయపు పన్ను, ఆడిట్ వంటి ప్రధాన విభాగాల్లోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. దేశంలోని చాలా పారిశ్రామిక ప్రాంతాలలోని కార్మికులు,ఉద్యోగులు, అనేక ఎంఎన్‌సిలతో సహా, పెద్ద ఎత్తున సమ్మెలో చేరి ప్రదర్శనలు నిర్వహించారు. రక్షణ రంగ ఉద్యోగులు సమ్మెకు మద్దతుగా ఒక గంట పనిని నిలిపివేసి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. రైల్వే యూనియన్లు సంఘీభావ కార్యక్రమాలు నిర్వహించాయి. సామాన్య ప్రజలు ఈ చర్యలకు మద్దతు ఇచ్చారు. సమ్మె, బంద్ పిలుపుకు స్పందనగా అనేక చోట్ల మార్కెట్లు మూతపడ్డాయి.

# మంజూరు చేయండి (మొదటి పేజీ తరువాయి)





శంకుస్థాపన కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సిఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. కేంద్ర మంత్రితో సౌత్ బ్లాక్‌లోని ఆయ న కార్యాలయంలో సిఎం భేటీ అయ్యారు. సుస్థిర పట్టణాభివృద్ధి లక్ష్యాలతో పర్యావరణ హితంగా, స్వచ్ఛమైన నీటితో నది ప్రవహించేలా మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపడుతున్నట్లు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన 100 ఎకరాల రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కేంద్ర మంత్రికి సిఎం విజ్ఞప్తి చేశారు. ఈసీ, మూసీ నదుల సంగమ స్థలంలో 1948 లో జాతిపిత మహాత్మా గాంధీ చితాభస్మాన్ని నిమజ్జనం చేసిన బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు సిఎం తెలియజేశారు.

**కేంద్ర నిధులతో కృష్ణా–వికారాబాద్ రైలు మార్గం నిర్మించండి : రైల్వే శాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి**

కృష్ణా–వికారాబాద్ రైలు మార్గాన్ని పూర్తిగా కేంద్ర నిధులతో చేపట్టాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ వ్యయాన్ని మొత్తాన్ని తామే భరిస్తామని ఇప్పటికే తెలియజేసిన విషయాన్ని కేంద్ర మంత్రికి సిఎం గుర్తు చేశారు. రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో సిఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ మార్గంలోని లైమ్ స్టోన్ నిక్షేపాలను గుర్తించామని, సిమెంట్, జౌళి పరిశ్రమల కేంద్రంగా దానిని అభివృద్ధి చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు సిఎం కేంద్ర మంత్రికి తెలియజేశా రు. కొడంగల్, టేడంగల్, దౌల్తాబాద్లను పారిశ్రామిక జోన్లు గా అభివృద్ధి చేస్తున్నట్లు సిఎం వివరించారు.

**హైస్పీడ్ కారిడార్ ప్రాజెక్టులకు 500 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తాం**

హైదరాబాద్–చెన్నై(778కి.మీ.), హైదరాబాద్–బెంగళూర్ (586 కి.మీ.), హైదరాబాద్–పుణే (556 కి.మీ.) హైస్పీడ్ రైలు కారిడార్లకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ సమీపంలో 500 ఎకరాల స్థలం కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు తెలియజేశారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న శంషాబాద్ నుంచే హైస్పీడ్ రైలు మార్గాలని ప్రారంభించాలని సిఎం సూచించారు. హైదరాబాద్‌చెన్నై హైస్పీడ్ కారిడార్ అమరావతి మీదుగా వెళుతుందని, అక్కడి నుంచి బందరు పోర్టుకు రైలు మార్గం మంజూరు చేయాలని కోరారు. దాంతో డ్రైపోర్ట్ నుంచి బందరు పోర్టుకు సరకు రవాణా వేగవంతం అవుతుందని వివరించారు. హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్ పుణే హైస్పీడ్ కారిడార్లు శంషాబాద్ నుంచే మొదలు పెడితే అది ట్రై జంక్షన్ అవుతుందని సిఎం రైల్వే మంత్రికి వివరించారు. ఈ మూడు కారిడార్లకు భూ సేకరణ వెంటనే చేపట్టి పనులు ప్రారంభించాలని రైల్వే శాఖ మంత్రికి సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలత వ్యక్తం చేశారు. పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

**అంతర్జాతీయ ప్రమాణాలతో మామునూరు ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించాలి : పౌరవిమానయాన శాఖమంత్రి రామ్మోహన్ నాయుడుకు సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి**

తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్‌కు సమీపంలో నిర్మించనున్న మామునూరు ఎయిర్‌పోర్ట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని పౌర విమానయాన శాఖమంత్రి కె. రామ్మోహన్ నాయుడు కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడుతో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో సిఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. మామునూరు ఎయిర్ పోర్ట్‌కు అవసరమైన భూ సేకరణ పూర్తయినందున వెంటనే పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. మామునూరు ఎయిర్‌పోర్ట్‌లో కార్గో సేవలతో పాటు మెయింటెనెన్స్, ఓవర్ హాల్ రిపేర్ (ఎంఓఆర్) సదుపాయాలు ఉండేలా చూడాలని సిఎం విజ్ఞప్తి చేశారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ ఉమ్మడి వరంగల్‌తో పాటు ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలకు కేంద్రంగా ఉంటుందని సిఎం వివరించారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి అనుమతులు వెంటనే మంజూరు చేయాలని సిఎం విజ్ఞప్తి చేశారు. ఆ విమానాశ్రయ ఏర్పాటుకు అదనంగా అవసరమైన 249.82ఎకరాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సిఎం వెల్లడించారు. మామూనూరు ఎయిర్‌పోర్ట్ పనుల ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులను అక్కడకు పంపిస్తానని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సిఎం రేవంత్ రెడ్డికి హామీ ఇచ్చారు.

**బిఎం బకాయిలు విడుదల చేయండి – కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని కోరిన సిఎం రేవంత్ రెడ్డి :** భారత ఆహార సంస్థకు (ఎఫ్‌సిఐ) 2014–15 వానాకాలంలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి తెలంగాణ రాష్ట్రానికి బకాయి పడిన రూ.1,468. 94 కోట్లను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కోరారు. నాడు అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని గుర్తు చేశారు. వానాకాలం పంటకు (2025–26 సీజన్‌కు) సంబంధించి తాము అదనంగా సేకరించిన 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎఫ్‌సిఐ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని న్యూఢిల్లీని ఆయన నివాసంలో సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం కలిశారు. వానాకాలం పంటకు సంబంధించి 53.73 లక్షల మెట్రిక్ టన్నులకు (ఎల్‌ఎంటి) అనుమతించారని కానీ భారీగా పంట ఉత్పత్తి కావడంతో అదనంగా 18 ఎల్‌ఎంటిలు తాము సేకరించినందున ఆ మొత్తాన్ని 10 శాతం నూకతో ఎఫ్‌సిఐ సేకరించాలన్నారు. 2024–25 యాసంగి పంటకు సంబంధించి 5 శాతం నూకతో అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్ రైస్ మిల్లింగ్‌కు అనుమతించాలన్నారు. 2024–25 వానాకాలం పంటకు సంబంధించి కస్టమ్స్ మిల్లింగ్ రైస్‌కు ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు గడువు నిర్దేశించారని, దీనిని మరో రెండు నెలలు పాటు పొడిగించాలన్నారు. నాడు సేకరణ నిమిత్తం తాము తీసుకున్న రుణానికి వడ్డీ రూ.2 వేల కోట్లకుపైగా పెరిగిందని, ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద 2021, మే నుంచి 2022, మార్చి వరకు సరఫరా చేసిన అదనపు బియ్యం, 2022 ఏప్రిల్ నెలలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సిఎంతో పాటు ఎంపిలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలి : హైకోర్టు

**హైదరాబాద్:** హైదరాబాద్‌లో రోడ్లపై ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఫుట్‌పాత్‌లు ప్రజలకు ప్రాథమిక మౌలిక సదుపాయమని, ఫుట్‌పాత్‌లు లేక ప్రజలు రోడ్లపై నడవలేకపోతున్నారని, రోడ్లపై నడవాల్సివస్తోందని, దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. పన్నులు చెల్లించే ప్రజలకు ఫుట్‌పాత్‌ల వినియోగం లేని దుస్థితి ఉందని వ్యాఖ్యానించింది. కోర్టు ఆదేశాలు లేదా మీడియా కథనాల సమయంలో మాత్రమే అధికారు లు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి, తర్వాత నిర్లక్ష్యం వహిస్తున్నారని అభిప్రాయపడింది. బాగ్‌లింగంపల్లి ప్రాంతంలో అక్రమ నిర్మాణాల తొలగింపుపై జీహెచ్‌ఎంసీ జారీచేసిన నోటీసులను సవాలుచేస్తూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ శ్రవణ్ కుమార్ విచారించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాది స్తూ, పిటిషనర్ చట్ట ప్రకారం స్థలాన్ని కొని అధికారిక అనుమతులతో వ్యాపారం చేస్తున్నారని చెప్పారు.జీహెచ్‌ఎంసీ తరఫు న్యాయవాది ఆక్రమణలు గుర్తించిన తర్వాతే నోటీసులు జారీ చేశామన్నారు. ఫుట్‌పాత్ ఆక్రమించుకున్నారని చెప్పారు. హైకోర్టు, అధికారుల ఉదాసీనతపై కమిషనర్ విచారణ జరపాలనిఆదేశించింది.



భువనేశ్వర్‌లో...



బీహార్‌లో...


చెన్నైలో...


న్యూ ఢిల్లీలో...


హర్యానాలో...


కేరళలో...

# రవాణా బంద్

## సార్వత్రిక సమ్మెలో సంఘటిత, అసంఘటిత కార్మికులు

**న్యూఢిల్లీ :** బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 'కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక దేశ వ్యతిరేక కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు గురువారం దేశవ్యాప్త సమ్మె చేపట్టాయి. సమ్మె నేపథ్యంలో వివిధ రాష్ట్రాల్లో సాధారణ జనజీవనం స్తంభించిపోయింది. రవాణా, బ్యాంకింగ్‌తో పాటు పలు రకాల సేవలపై తీవ్ర ప్రభావం పడింది. ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు, ఎఐయుటియుసి, ఎస్‌ఇడబ్ల్యుఎ, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియు సి కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. సమ్మెకు వామపక్ష పార్టీలు, ప్రజా సం ఘాల సహా దేశంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కూడా మద్దతు తెలిపింది. విద్యుత్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, రవాణా, ఆరోగ్యం, విద్య, గ్యాస్, నీటి సరఫరా, మైనింగ్, గ్యాస్ పైప్‌లైన్ వంటి రంగాలకు చెందిన కార్మిక సంఘాలు సమ్మెలో పాల్గొన్నాయి.

### ఒడిశాలో రోడ్ల దిగ్బంధనం

ఒడిశాలో నిరసనకారులు రోడ్లను దిగ్బంధించారు, రవాణా సేవలు నిలిచిపోయాయి. భువనేశ్వర్, కటక్, రూర్కెలా వంటి ప్రదేశాలలో రవాణా సేవలు స్తంభించిపోయాయి. దేశవ్యాప్తంగా సమ్మె ఒడిశాలో సాధారణ జీవితాలపై తీవ్రంగా ప్రభావితం చేసింది. రాజధాని నగరంలో, స్టేషన్ స్క్వేర్ సమీపంలో నిరసనకారులు దిగ్బంధనం చేశారు, ప్రయాణికులు రైల్వే స్టేషన్‌లో చిక్కుకున్నారు. సమ్మె కారణంగా అయా బ స్సు, ఆటోరిక్షా సేవలు నిలిచిపోయాయి. రాష్ట్ర రాజధానిలో ప్రధాన వాణిజ్య సంస్థలు కూడా మూసివేయబడ్డాయి. జయదేవ్ విహార్ వద్ద జాతీయ రహదారి16పై కూడా ప్రదర్శనలు జరిగాయి, దీని వల్ల ట్రాఫిక్ స్తంభించింది.

### జార్ఖండ్‌లో బ్యాంకింగ్, బీమా, బొగ్గు రంగాలపై ప్రభావం

జార్ఖండ్‌లోని వివిధ కార్మిక సంఘాల సభ్యులు వివిధ బొగ్గు కంపెనీలు, పిఎస్‌యుల ద్వారాల వద్ద ప్రదర్శనలు నిర్వహించారు. సమ్మె రాష్ట్రంలోని బ్యాంకింగ్, బీమా, బొగ్గు రం గాలను ప్రభావితం చేసింది. వామపక్షాలు, కాంగ్రెస్ సమ్మెకు తమ మద్దతు ప్రకటించాయి.

### కేరళలో స్తంభించిన జనజీవనం, రవాణా సేవలు బంద్

కేరళలో సమ్మె కారణంగా సాధారణ జీవితం స్తంభించిపోయింది. కెఎస్‌ఆర్‌టిసి, ప్రైవేట్ బస్సులు రోడ్లపైకి రాకపోకలు సాగించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆటోరిక్షా యూనియన్లు కూడా సమ్మె సమయంలో తాము వాహనాలు నడపబోమని ప్రకటించాయి. 'రాత్రి డ్యూటీ తర్వాత కంజిరామట్టం ఇంటికి తిరిగి రావడానికి ఉదయం 6 గంటల నుండి ఆర్‌టిసి బస్సు కోసం వేచి ఉన్నాను. కానీ బస్సులు ఏవీ రావడం లేదు. గమ్యస్థానానికి చేరుకోవడానికి స్థానిక రైలు పట్టుకోవడానికి రైల్వే స్టేషన్‌కు వెళ్లే ముందు మరి కొన్ని గంటలు వేచి ఉంటాను' అని ఒక ప్రయాణీకుడు పిటిఐ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సమ్మె కారణంగా అధికారి అనధికారికంగా గైర్హాజరు అయితే 'డైనాన్' గా పరిగణించాలని ఉత్తర్వు జారీ చేసింది.

### ఛత్తీస్‌గఢ్‌లో మూతపడ్డ బ్యాంకులు

ఛత్తీస్‌గఢ్‌లో ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడంతో అనేక జాతీయ బ్యాంకులు మూతపడ్డాయి. బీమా కంపెనీలు, పోస్టాఫీసుల సిబ్బంది, కార్మికులు, రైతులు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. ఇది వారి వారి రంగాల కార్యకలాపాలను ప్రభావితం చేసింది. ఖనిజ సంపన్న రాష్ట్రంలో మైనింగ్ కార్యకలాపాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

### ముంబైలో సమ్మె

**మహారాష్ట్రలో.. :** దేశఆర్థిక రాజధాని ముంబైలోని లేబర్ కమిషనరేట్ కార్యాలయం ఎదుట ఎఐటియుసి, సిఐటియు, ఐఎన్‌టియుసి, ఆర్‌డబ్ల్యుపిఐల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. నాగ్‌పూర్ బస్ డిపోలో ఉదయం నాలుగు గంటల సమయంలోనే ఆర్‌టిసి కార్మికులు ప్రదర్శన నిర్వహించి సమ్మెకు మద్దతుగా నిలిచారు. పలు చోట్ల ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు.

**గోవాలో :** గోవా రాజధాని పంజిమ్‌లో సమ్మె సందర్భంగా భారీ ప్రదర్శన జరిగింది. ఇందులో ఎఐటియుసి, బ్యాంక్ ఎంప్లాయీస్, ఆశా వర్కర్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### తమిళనాడులో నిలిచిన ఓడలు

తమిళనాడులో ఓడరేవు కార్యకలాపాల్లో సాధారణ పరిస్థితులపై సమ్మె తీవ్ర ప్రభావం చూపింది. కార్మికులు నిరసనలు చేపట్టారు. తూత్తుకుడి, చెన్నైలలోని ఓడరేవు కార్యకలాపాలు ఆందోళన తీవ్రతను ఎదుర్కొన్నాయి. పారిశ్రామిక కేంద్రమైన శ్రీపెరంబుదూర్‌లో తయారీ యూనిట్ల కార్మికులు సమ్మెకు సంఘీభావంగా గేట్ మీటింగ్‌లు, ప్రదర్శనలు నిర్వహించారు. కొన్ని ప్రధాన ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ సౌకర్యాలలో ఉత్పత్తి అతి తక్కువ మందదితో కొనసాగినప్పటికీ, శ్రీపెరంబుదూర్–ఒరగడమ్ పారిశ్రామిక బెల్ట్‌లో రవాణా వాహనాల కొరత కారణంగా వస్తువుల తరలింపు ఆలస్యమైంది.

**పంజాబ్‌లో :** పంజాబ్ అధికార పార్టీ ఆప్ దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెకు మద్దతు ప్రకటించింది. పంజాబ్, దేశవ్యాప్తంగా తమ కార్యకర్తలు కార్మికులు, రైతులతో కలిసి ఈ సమ్మె లో పాల్గొంటారని పార్టీ ప్రకటించింది. గోవాలో ఆందోళనకు మిశ్రమ స్పందన లభించింది, బ్యాంకింగ్ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. అత్యవసర సేవలు అంతరాయం లేకుండా ఉన్నాయి. తీరప్రాంత రాష్ట్రంలో జాతీయం చేసిన బ్యాంకులు, అనేక బీమా కంపెనీల కార్యాలయాలు మూతపడ్డాయి.

### గంట ఆలస్యంగా విధులకు హాజరైన 25,000 మంది డిఫెన్స్ ఉద్యోగులు

మధ్యప్రదేశ్ అంతటా రక్షణ సంస్థలతో పనిచేస్తున్న 25,000 మందికి పైగా పౌర ఉద్యోగులు సమ్మెకు మద్దతుగా గురువారం గంట ఆలస్యంగా విధుల్లోకి వెళ్లారు. ఆరు ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, ఆర్మీ బేస్ క్యాంప్ వర్క్ షాప్, సెంట్రల్ ఆర్డినెన్స్ డిపో, మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్‌ల ఉద్యోగులు ఇందులో పాల్గొన్నట్లు ఎఐడిఇఎఫ్ అధ్యక్షులు ఎన్.ఎన్.పాఠక్ పిటిఐకి తెలిపారు. రక్షణ శాఖ ఉత్పత్తులు, సంబంధిత పనులు అత్యవసర సర్వీసుల కేటగిరిలో వస్తాయని, అందుకే రోజంతా సమ్మెలో పాల్గొనలేమని, అందుకే ఉదయం 8 గంటలకు బదులుగా గంట ఆలస్యంగా ఉదయం 9 గంటలకు విధులకు హాజరైనట్లు చెప్పారు. ఇక పశ్చిమ బెంగాల్, త్రిపుర, గుజరాత్‌లో సమ్మె పాక్షికంగా కొనసాగింది. గోవాల కార్మిక సంఘాల సభ్యులు రాజధాని నగరం పనాజీలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.


ముంబయిలో...


పంజాబ్‌లో...


తమిళనాడులో...


తెలంగాణలో...


ఉత్తరాఖండ్‌లో...


వెస్ట్‌బెంగాల్‌లో...

# లేబర్ కోడ్‌లు అమలు చేయమని అసెంబ్లీలో తీర్మానం చేయాలి

**రాష్ట్ర ప్రభుత్వానికి వామపక్ష పార్టీల విజ్ఞప్తి**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మికవర్గ హక్కులను, ప్రయోజనాలను హరించే విధంగా కేంత్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయబోమని తెలంగాణ శాసనసభలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని పలువురు వామపక్ష పార్టీల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్మిక, కర్షక, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు వామపక్ష, లౌకిక శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. కార్మిక వర్గాన్ని మతోన్మాద, కార్పొరేట్ శక్తులకు బానిసలుగా ఉండేలా మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టిందని, లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకునే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. అమెరికా వాణిజ్య ఒప్పందం ద్వారా మోదీ ప్రభుత్వం భారత దేశ సంపదను దోచిపెడుతోందని, సార్వభౌమాధికారాన్ని అమెరికాకు తాకట్టు పెట్టిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు సార్వత్రిక సమ్మెలో భాగంగా కేంద్ర కార్మిక, సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్త ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్‌టిసి కళ్యాణ మండపం నుంచి ఇందిరాపార్క్ వరకు జరిగింది. ఈ సందర్భంగా ప్రదర్శనకారులను ఉద్దేశించి కార్మిక నాయకులు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ పెట్టుబడిదారి విధానం పెరిగితే, పేదరికం, దోపిడీ పెరుగుతుందని విమర్శించారు. లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఎంఎస్ నేత రెబ్బ రామబారావు మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాస్తూ లేబర్ కోడ్‌లు తీసుకొచ్చారని మండిపడ్డారు. సిఐటియు నాయకులు పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ కోసమే సార్వత్రిక సమ్మెను చేపట్టామన్నారు. హైదరాబాద్‌లో ఐదు వేల కంపెనీలను మూసివేశారని, దాదాపు రూ.200ల కోట్ల ఉత్పత్తి నిలిచిపోయిందన్నారు. టియుసిఐ ఎస్.ఎల్.పద్మ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను అమలు చేయకముందే ఉద్యోగాలు వచ్చాయని కేంద్రంలోని బిజెపి తప్పుడు ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. ఐఎఫ్‌టియు నేత ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ లేబర్‌కోడ్‌లకు సంబంధించి గత రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన రూల్స్‌ను కూడా రద్దు చేయాలని కోరారు. బిఆర్‌టియు నాయకులు వేముల మారయ్య మాట్లాడుతూ లేబర్‌కోడ్‌లు కార్మిక వర్గానికి మరణశాసనమన్నారు. ఎఐయుటియుసి నేత భరత్ మాట్లాడుతూ అమెరికా ఉత్పత్తులకు భారతదేశంలో జిరో ట్యాక్స్‌తో విక్రయించేందుకు అవకాశం కల్పించడం అన్యాయమన్నారు.

**కేంద్ర కార్మిక, సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్త ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని ఆర్‌టిసి కళ్యాణ మండపం నుంచి ఇందిరాపార్క్ వరకు భారీ ప్రదర్శన**




### బిజెపి,ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయాలి

సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ మాట్లాడుతూ కార్మిక, రైతు, కర్షకులకు కేంద్రంలోనిబిజెపి ప్రభుత్వం, ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకంగా వ్యవహారిస్తోందని విమర్శించారు. ఆహార భద్రతను కాపాడుతున్న రైతుల వ్యతిరేక విధానాలకు మోదీ ప్రభుత్వం పాల్పడుతోందని, వ్యవసాయాన్ని అదానీ,అంబానీ చేతుల్లో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులను బానిసలుగా మార్చే మోదీ అంతు తేల్చేందుకు, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ టి.సాగర్ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్నినిర్వీర్యం చేసి ప్రవేశపెట్టిన విబి జి రాంజీ చట్టాన్ని అమలు చేస్తున్నారని, ఈ విషయంలో కేంద్ర మంత్రులను, ఎంపిలను గ్రామాల్లో నిలదీయాలన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి కార్మిక సంఘాల నాయకులు ఎం.నర్సింహ(ఎఐటియుసి), ఆర్.డి.చంద్రశేఖర్ (ఐఎన్‌టియుసి), అధ్యక్షవర్గంగా వ్యవహారించగా, కాంగ్రెస్ ఎంఎల్‌ఎ నవీన్ యాదవ్, కార్మిక, రైతు, ప్రజాసంఘాల నాయకులు మొగుళ్ల రాజిరెడ్డి (ఐఎన్‌టియుసి ), కమతం యాదగిరి, ప్రేమ్ పావని, కరుణకుమారి (ఎఐటియుసి), అంజద్ (హెచ్‌ఎంఎస్), జె.వెంకటేష్, కుమారస్వామి (సిఐటియు), కె.ఎస్.ప్రదీప్ (టియుసిఐ), అరుణ (ఐఎఫ్‌టియు), రాంబాబు యాదవ్ (బిఆర్‌టియు), మల్లు లక్ష్మి (ఐద్వా), ప్రభాకర్ (ఎఐకెయుసి), ఈదురు వెంకన్న(టిజిఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్) తదితరులు పాల్గొన్నారు.

### అసెంబ్లీలో 'లేబర్‌కోడ్'పై తీర్మానం చేసే అంశాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్తా

**టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**

తెలంగాణ రాష్ట్రంలో లేబర్ కోడ్‌లను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేసే అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ హామీనిచ్చారు. ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దెంచేందుకు వామపక్షాలు, లౌకిక శక్తులన్నీ కలిసి ఉద్యమించాలని కోరారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు మరింత బలపడాలని, అప్పుడే మోదీని గద్దె దించవచ్చని చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంత రావు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని హామీనిచ్చారు.




# కదం తొక్కిన కార్మికులు

## కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ఎర్ర జెండాలతో కవాతు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర రాజధానిలో కార్మిక, రైతు, ప్రజా సంఘాలు కదం తొక్కాయి గురువారం ఎర్ర జెండాలతో కవాతు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, కార్మిక, రైతు వ్యతిరేక నల్లా చట్టాలను నిరసిస్తూ దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు, టియుసిఐ, ఐఎఫ్‌టియు, బిఆర్‌టియు, ఎఐయుటియుసి, టిఎన్‌టియుసి, కేంద్ర , రాష్ట్ర ఉద్యోగుల ఫెడరేషన్లు, అసోసియేషన్ల , రైతు సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బాగ్‌లింగంపల్లిలోని ఆర్‌టిసి కళ్యాణ మండపం నుంచి ఇందిరా పార్క్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో వేలాది మంది కార్మికులు పాల్గొన్నారు. ర్యాలీ అగ్రభాగాన కార్మిక సంఘాల నేతలు ఎస్.బాల్‌రాజ్, ఎం.నర్సింహ్మా (ఎఐటియుసి), పాలడగు భాస్కర్(సిఐటియు), ఎస్‌ఎల్ పద్మ (టియుసిఐ), తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మతో పాటు వివిధ సంఘాల నేతలు ఈ ర్యాలీల్లో ఆటో డ్రైవర్ యూనియన్లు, గిగ్ వర్కర్స్ యూనియన్, బ్యాంక్, ఆర్‌టిసి, అంగన్‌వాడీ, మున్సిపల్, జిహెచ్‌ఎంసి కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మిక లోకం పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ ర్యాలీలో ఐఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు వెంకన్న గౌడ్ ఆర్‌డి చంద్రశేఖర్, మొగిళ్ల రాజీరెడ్డి, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బ రామారావు, అంజాద్, కుమారస్వామి ,కె.ఎస్ ప్రదీప్ ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్ అరుణ , బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు యాదవ్, మారన్న, ఎఐయుటియుసి నాయకులు భరత్ , తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, ప్రభాకర్, వెంకన్న, ఎఐటియూసి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటయ్య డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బి.కిషన్, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రేమ్ పావని, రాష్ట్ర కార్యదర్శి కరుణకుమారి హైదరాబాద్ జిల్లా నాయకులు ఏ.పార్వతి, ఉమర్ఖాన్ కొమురెల్లి బాబు, వీరేందర్, కాశయ్య ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, టియుడబ్ల్యుజె అధ్యక్షుడు కె.విరాహత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

### సమ్మెకు మద్దతుగా గిరిజన సంఘాల ర్యాలీ

కేంద్ర కార్మిక , రైతు సంఘాలు చేపట్టిన భారత్ సార్వత్రిక సమ్మెకు మద్దతుగా గిరిజనసంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్. గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య నాయకులు శీను నాయక్,తెలంగాణ జాగృతి గిరిజన విభాగం రాష్ట్ర నాయకులు రూప్ సింగ్, ధర్మానాయక్. బానోత్ కిషన్ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి మోహన్ సింగ్, బస్కీ నాయక్,తెలంగాణ ప్రదేశ్ ఎరుకల హక్కుల సంఘం బి రఘు ఎరుకల, తెలంగాణ ప్రదేశ్ ఎరుకుల ఆదివాసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోకిని రాజు, బాలు నాయక్. తదితరులు పాల్గొన్నారు.

### శ్రమజీవుల జీవితాలతో మోదీ చెలగాటం : సామాజిక సంఘాలు

నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక వర్గం గొంతుపై కత్తి పెట్టి కూర్చుందని సామాజిక సంఘాలు, ప్రజా సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా సామాజిక ప్రజాసంఘాలు నీలి జెండాలతో ఆందోళన నిర్వహించారు. అనంతరం డిహెచ్ పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభను జరిగింది. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జాతీయ కన్వీనర్ విమలక్క ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అరుణ జ్యోతి, మల్లుల, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం వి రమణ, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు జెరిపోతుల కుమార్, ఆరుట్ల రాజు కుమార్, వై ఉషాశ్రీ , బాబు, బందు సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు పల్లెల వీరస్వామి వశపాక నరసింహా,తెలంగాణ జెఎసి కన్వీనర్ కోల జనార్ధన్ విసి కె పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తెలంగాణ శ్యామ్, సురుగు ప్రభాకర్ ఎన్.పి ఆర్.డి రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్, జైభీమ్ మహాసేన వ్యవస్థాపక అధ్యక్షులు రాజ్యాంగం అంజన్న ప్రభు, రాణి, పి.ఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు సరస్వతి, గాదె ఝాన్సీ, డివై ఎఫ్ఐ నగర కార్యదర్శి ఎం.డి జావీద్, కెవిపిఎస్ నగర కార్యదర్శి బి సుబ్బారావు, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎన్ బాల పీరు ,జిల్లా నాయకులు దర్శనం రమేష్ బి పవన్ మధు ఆంజనేయులు వై శ్రీను సమ్మక్క కృష్ణవేణి నాగామణి నాంచారి తదితరులు పాల్గొన్నారు.

**మోదీ పాలనలో కార్మికులు, కర్షకులకు**

# తీరని అన్యాయం

**కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి : కూనంనేని**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కేంద్రంలోని బిజెపి పాలనలో కార్మికు లు, కర్షకులకు తీరని అన్యాయం జరుగుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త పిలుపులో భాగంగా కార్మిక, కర్షక, ఉద్యోగ, మహిళా, మోటార్ ట్రాన్స్‌పోర్టు, ఆటో, క్యాబ్, భారీ వాహనాలు, పలు వర్గాలు సమ్మెల్లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా గురువారం చుంచుపల్లి మండల పరిధిలోని మె యిన్ రోడ్‌లో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా పాల్గొన్న ఎంఎల్‌ఎ మాట్లాడారు. కార్మికుల రక్తతర్పణంతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా రూ పొందించి కార్మికుల పట్ల వివక్ష చూపుతూ వారి పొట్టను కొడుతోందన్నా రు. ఈ సమ్మెలో భాగంగా ఎన్నడూ లేని విధంగా సింగరేణి రెగ్యులర్, కాం ట్రాక్ట్ కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని, వారితో పాటుగా ఆ శాలు, అంగన్‌వాడీలు, పంచాయితీ కార్మికులు, ఆటో డ్రైవర్లు రోడ్డెక్కాడరని, ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కంచర్ల జమలయ్య, సహాయ కార్యదర్శులు గెదాద్దు నగేష్, వాసిరెడ్డి మురళీ, గ్రామ పంచాయితీ వర్కర్స్ జిల్లా సహాయ కార్యదర్శి అమర్, అంగన్‌వాడీవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గోనె మణి, విద్యానగర్ సర్పంచ్ శాంతిప్రియతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేసే వరకు రాజీలేని పోరాటాలు

**సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేసేంత వరకు రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి ప్రకటించారు. కార్మికవర్గం దేశ వ్యా ప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెకు మద్దతుగా సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్ న్యూడెమోక్రసీ), సిపిఐ(ఎంఎల్ మ్యాస్‌లైన్), ఎఐఎఫ్‌బి, ఎస్‌యుసి ఐ తదితర వామపక్ష పార్టీలు గురువారం హైదరాబాద్‌లోని నారాయణగూడ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వామపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రదర్శనకారులను ఉద్దేశించి పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజావ్యతిరేక నల్లా చట్టాలను నిరసిస్తూ దేశ వ్యాప్త సమ్మెలో దాదాపు 30 కోట్ల మంది భాగస్వామ్యమయ్యారని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మరింత ఉధృతమైన ఉద్యమాలు చేపడతామన్నారు. సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి సమ్మె చేసే హక్కును, సంఘం పెట్టుకునే హక్కును హరిస్తూ యజమాన్యాలకు బానిసలుగా మార్చే ఈ విధానాలను పూర్తిగా నిరసిస్తున్నామని తెలిపారు. సిపిఐ (ఎంఎల్ న్యూ డెమోక్రసీ) అధికార ప్రతినిధి చలపతి రావు మాట్లాడుతూ కోట్లాదిగా ఉన్న కార్మికుల హక్కులను పరిరక్షించాల్సిన కార్మిక శాఖను ప్రభుత్వాలు పూర్తిగా నిర్వీర్యం చేస్తూన్నాయన్నారు. సిపిఐ (ఎంఎల్ మాస్‌లైన్) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి హన్‌మేష్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న ట్రేడ్ ఒప్పందంతో దేశ సార్వభౌమఅధికారానికే ము ప్పు అని హెచ్చరించారు. సిపిఐ(ఎంఎల్) లిబరేష న రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేశ్ రాజా, ఎస్‌యుసిఐ రాష్ట్ర కార్యదర్శి మురహరి మాట్లాడుతూ అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహా, కార్యవర్గ సభ్యులు ఆర్. అంజయ్య నాయక్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
ఆపరేషన్ : సైబర్‌సిటీ సర్కిల్
**టెండర్ నోటిఫికేషన్ నెం: 11/25-26**
TGSPDCL టెండర్లు దాఖలును కోరడమైనది. బిడ్లకు అనుభవజ్ఞులైన కాంట్రాక్టర్లు / సప్లయర్స్ నుండి సీల్డ్ బిడ్లను అర్హత కలిగిన బిడ్డర్ల నుండి ఆహ్వానించడమైనది. 1) కొండాపూర్ డివిజన్‌లోని 11 KV లైన్ పనుల ఇంటర్ లింకింగ్. 2) గచ్చిబౌలి డివిజన్‌లోని 11 KV లైన్ పనుల ఇంటర్‌లింకింగ్ మరియు బైఫర్‌కేషన్. 3) ఇబ్రహీంబాగ్ డివిజన్‌లోని 11 KV లైన్స్ ఇంటర్ లింకింగ్, అదనపు DTRల ఏర్పాటు & PTRల మెరుగుదల, 11 KV AB కేబుల్‌ను 11 KV UG కేబుల్‌గా కన్వర్షన్. 4) RR స్టోర్స్‌లో మెటీరియల్స్ లోడ్, అన్‌లోడ్ మరియు సైబర్‌సిటీ సర్కిల్‌లోని వివిధ ఇతర పనులు. మరిన్ని వివరాల కోసం దయచేసి www.tgsouthernpower.org & www.eauction.telangana.gov.in & www.eprocurement.telangana.gov.in వెబ్‌సైట్లను సందర్శించండి.
Sd- SE/OP/Cybercity, రేతిబౌలి, నానల్ నగర్ X రోడ్, హైదరాబాద్-28.
DIPR R.O. No. : 15266-PP/CL/ADVT/1/2025-26, Date: 12-02-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
GHMC
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, చార్మినార్ జోన్.
Short Tender Notice No. 15/EE.Div.NO.28/GHMC/2025-26, తేది: 11.02.2026
NIT No. Short Tender Notice No. 15/EE.Div.NO.28/GHMC/2025-26, తేది: 11.02.2026, పని వివరణ: నిర్వహణ పనులు (01) నెం., అంచనా మొత్తం: రూ.10.50 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: ప్రారంభ తేది: 12.02.2026న మ.03.00గం.ల నుండి, స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 16.02.2026న మ.03.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీ సనాఉద్దీన్, సెల్ నెం. 7993727669. జతపరచబడింది: పనుల వివరాలు కాపీ.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-28, సిఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 15282-PP/CL/ADVT/1/2025-26, Date: 12-02-2026

# కార్పొరేట్ అనుకూల లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

హనుమకొండలో కార్మిక సంఘాల ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా





**ప్రజాపక్షం/హనుమకొండ :** కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. గురువారం కార్మిక సంఘాల దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా హనుమకొండలో భారీ ర్యాలీ నిర్వహించారు. హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తన కార్మిక వర్గ వ్యతిరేక, రైతు వ్యతిరేక వైఖరిని ఆపాలని, నాలుగు కార్మిక కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో సుమారు 40 కోట్ల మంది సంఘటిత, అసంఘటిత కార్మికుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న ఈ మోదీ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ నగర మేయర్ గుండు సుధా రాణి, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సిపిఎం నాయకులు సారంపల్లి వాసుదేవ రెడ్డి, ఎం.చుక్కయ్య, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేల్పుల సారంగపాణి, ఐక్కు రాజు గౌడ్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్,జిల్లా నాయకులు తేలూరు ఉప్పలయ్య, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుల నున్నా అప్పారావు, ఐఎన్టీయుసి నాయకుడు కె.వెంకట్ తదితరులు పాల్గొన్నారు



## సార్వత్రిక సమ్మెతోనైనా కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న 29 కార్మిక చట్టాలను ఉద్దేశ్యపూర్వకంగా రద్దు చేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడాన్ని టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అధ్యక్షుడు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అన్నారు. ఇందులో భాగంగా జాతీయ సంఘాల పిలుపు మేరకు గురువారం సార్వత్రిక సమ్మెలో ఎంప్లాయీస్ యూనియన్ కార్మికులు పాల్గొనడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గ శ్రమను దోపిడీ చేసే విధంగా, రాజ్యాంగంలో కల్పించబడిన హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తూ తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా ఆర్‌టిసి కళ్యాణ మండపం నుండి ఇందిరాపార్కు వరకు జాతీయ సంఘాల ప్రదర్శనలో ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, ఎన్.మంగ, ఎం.ఎ.మజీద్, రాష్ట్ర నాయకులు సిహెచ్.బి.రెడ్డి, జీడిమెట్ల డిపో డేనియల్, కృష్ణముషీరాబాద్ డిపో, జి.ముత్యాలు, సిహెచ్.నాగప్ప, ఎ.రవీందర్, ఆగమయ్య, ఎం.డి.మజహర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగంలో కార్పొరేట్, మతోన్మాద విధానాలు అమలు

వామపక్ష విద్యార్థి సంఘాలు ఐక్య కార్యాచరణ కమిటీ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ విద్యారంగాన్ని కార్పొరేట్, ప్రైవేటు శక్తులకు అప్పగించి, విద్యారంగం నుంచి ప్రభుత్వ తప్పుకుంటుందని వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు విమర్శించారు. కేంద్ర కార్మిక, కర్షక ,కూలీ సంఘాల పిలుపుమేరకు సార్వత్రిక సమ్మెకు మద్దతుగా వామపక్ష విద్యార్థి సంఘాలు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో గురువారం ప్రదర్శన నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు.
ఈ నిరసన సభలో వామపక్ష విద్యార్థి సంఘాలు నాయకులు టి.నాగరాజు, ఎస్.రజనీకాంత్ (ఎస్ఎఫ్ఐ), పుట్ట లక్ష్మణ్ (ఎఐఎస్ఎఫ్), పొడపంగి నాగరాజు, పి.మహేష్ (పిడిఎస్‌యు), ఎస్.అనిల్ (పిడిఎస్‌యు), నితిష్(ఎఐడిఎస్ఒ), పల్లెమురళీ (ఎఐఎఫ్‌డిఎస్), గణేష్ (పిడిఎస్‌యు) మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం విద్యారంగంలో కార్పొరేట్, మతోన్మాద విధానాలు అమలు చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో 93వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారని, తద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యను కూడా పేదలకు అందకుండా చేస్తోందని విమర్శించారు.
బిజెపి పరిపాలిస్తున్న రాష్ట్రాల్లో ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు 2025 పేరుతో యూనివర్శిటీలను దెబ్బతిసి, ఉన్నత విద్యకు పేద వర్గాలను దూరం చేస్తోందని మండిపడ్డారు.
ప్రైవేటు, కార్పొరేట్, విదేశీ యూనివర్శిటీలను అనుమతిస్తూ ప్రభుత్వ విద్యలో ఫీజులను పెంచిచ అందరికి అందుబాటులో లేకుండాచేస్తున్నారన్నారు.
కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.కిరణ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష్య, కార్యదర్శులు లెనిన్ గువేరా, కె.అశోక్ రెడ్డి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ గ్యార నరేష్, నాయకులు హరీష్ , కృష్ణ ,భరత్ పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు రాజేష్, నవీన్, శ్రీనివాస్, ఎఐడిఎస్ఒ జిల్లా నాయకులు నాగరాజు ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రవీణ్ ,ఆంజనేయులు పాల్గొన్నారు.

# కోల్‌బెల్ట్ ఏరియాల్లో నిరసనలు

శ్రీరామ్‌పూర్‌లో వాసిరెడ్డి అరెస్ట్





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కోల్‌బెల్టు 11ఏరియాల వ్యాప్తంగా సింగరేణి కార్మికులు గురువారం దేశవ్యాప్త సమ్మెలో జెఎసి ఆధ్వర్యంలో సంఘటిత, అసంఘటిత కార్మికులు పాల్గొని జయప్రథం చేశారు. కొత్తగూడెం ఏరియాలో వికే వర్క్‌షాపు, పివికె 5, వికెసిఎం, ఆర్‌సిహెచ్‌పి, సివిల్, జిఎం ఆఫీస్‌లలో కార్పొరేట్ అత్యవసర సేవలు అందించే కార్మికులు సమ్మెలో పాల్గొని విధులను బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ నరేంద్రమోడి ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను మార్చడం సరైంది కాదని, దీనిని వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు.
**రోడ్డుపై నిరసన :** కోల్ బెల్టు ఏరియా శ్రీరామ్‌పూర్ బస్టాండ్ సెంటర్ వద్ద ఏఐటియూసి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్యతో పాటు పలువురు కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా మోడి ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని నిరశిస్తూ బస్టాండ్ ఏరియాలో రోడ్డుపై బైఠాయించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడి సర్కార్ కార్మికుల ఉసురు పోసుకుంటున్నారని, వారి శ్రమను దోచుకుంటూ హక్కులను కాలరాస్తూ జీవితాలను అంధకారంలోకి నెడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమాల్లో కోల్‌బెల్ట్ ఏరియా నాయకులు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, డిప్యుటి జనరల్ సెక్రటరీ కందికట్ల వీరభద్రయ్య, కేంద్రకార్యదర్శి వంగా వెంకట్, ముసికే సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య, వైవి రావు, బాజిసైదా, రమణమూర్తి, అగ్బర్ అలీ, ఎస్ సత్యనారాయణ, ఎంఆర్‌సి రెడ్డి, జి.రవీందర్, ఆరెల్లి పోషమ్, జక్కం గట్టయ్య, మోటపలుకుల రమేష్, రామ్ గోపాల్, నజీర్ అహ్మద్‌తో పాటు రాము, సందబోయిన శ్రీనివాస్, ఎస్ నాగేశ్వరావు, కత్తెర్ల రాములు, మధుకృష్ణ, భూక్యా రమేష్, ఆర్ సాంబమూర్తి, సౌజన్య, ఎంఆర్‌కే ప్రసాద్, ఐఎన్‌టియూసి నాయకులు పితాంబరం, సిఐటియూ నాయకులు నగేష్, ఐఎఫ్‌టియూ సాదినేని వెంకటేశ్వరరావు, సంజీవరావుతో పాటు తదితర సింగరేణి సంఘటిత, అంసఘటిత కార్మికులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో 'ఇన్‌వాయిస్' పేరుతో భారీ మోసం

వెలుగు చూసిన రూ.32 కోట్ల నకిలీ ఇన్వాయిస్ దందా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో ఇన్‌వాయిస్ పేరుతో జరిగిన భారీ ఆర్థిక మోసం వెలుగులోకి వచ్చింది. వాణిజ్య పనుల శాఖకు చెందిన కొందరు అధికారుల చేతివాటంతో సుమారు రూ.32 కోట్ల నకిలీ ఇన్వాయిస్ వ్యవహారం సాగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ వాహన తనిఖీల్లో బయటపడిన ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఒక ప్రముఖ కంపెనీకి చెందిన గూడ్స్ వాహనాలు దేశవ్యాప్తంగా సరుకులను తరలిస్తున్న సమయంలో పక్కా ప్రణాళికతో తనిఖీలు నిర్వహించిన అధికారులు అనుమానాస్పద విషయాలను గుర్తించారు. వాహనాల్లో తరలిస్తున్న సరుకులకు సంబంధించి సరైన ఇన్వాయిస్‌లు లేకపోవడం, టాక్స్ చెల్లింపుల వివరాలు సరిపోకపోవడం గమనార్హం. ప్రాథమిక విచారణలో సుమారు రూ.75 కోట్లకు పైగా విలువైన సరుకులను ఇన్వాయిస్ లేకుండా, ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా అక్రమంగా తరలించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో కొందరు వాణిజ్య శాఖ అధికారుల ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నకిలీ ఇన్వాయిస్‌ల సాయంతో ప్రభుత్వ ఖజానాకు కోట్ల రూపాయల నష్టం కలిగించినట్లు సమాచారం. ఈ ఘటనపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో అధికారిక ఫిర్యాదు నమోదైంది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసుల విచారణలో కూడా సంచలన విషయాలు బయటపడినట్లు తెలుస్తోంది. పలువురు అనుమానితులను విచారిస్తున్నట్లు సమాచారం. కంపెనీ ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు, జీఎస్టీ రికార్డులను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ కేసులో మరింత మంది అధికారుల ప్రమేయం బయటపడే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. భారీ స్థాయిలో జరిగిన ఈ ఇన్వాయిస్ మోసం రాష్ట్ర వాణిజ్య వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

## హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడబోం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** షెడ్యూల్డ్ కులాలు, గిరిజన వసతి గృహాలలో విద్యార్థులకు విద్య, వైద్యం, మౌలిక సదుపాయలలో రాజీ పడే ప్రసేక్తే లేదని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు వయోవృద్ధులు ట్రాన్స్ జెండర్ ల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్ లో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, గిరిజన సంక్షేమ తదితర శాఖల ఉన్నతాధికారులతో బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రి అడ్లూరి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న వసతి గృహాలలలో వసతులు, మరమ్మతులు, రవాణా సౌకర్యం సదుపాయాలకు సంబంధించిన ప్రతిపాదనలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.నిధుల కొరత లేదని వసతుల కోసం ఎంత బడ్జెట్ నైనా కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి అన్నారు. ఎస్సి, ఎస్‌టి, వర్గాల కు చెందిన విద్యార్థుల ను అత్యున్నత స్థాయికి తీసుకురావాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృఢ సంకల్పమని, వారి ఆశయాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు.

**ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల విద్య, వైద్యానికి పెద్ద పీట :**
ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ హాస్టల్ విద్యార్థుల విద్యా, వైద్యంకు ప్రభుత్వ పెద్దపీట వేస్తోందని మంత్రి తెలిపారు. చెన్నై తరహాలో జాతీయ ప్రమాణాలతో స్టడీ సర్కిళ్లు ద్వారా విదేశీ విద్య కలల సహకారం చేయనుందని తెలిపారు. విద్యా, వైద్యంతో పాటు సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం అధిక నిధులను కేటాయించిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వివరించారు. గత బడ్జెట్‌లో హాస్టల్ విద్యార్థుల సంక్షేమం కోసం గత బడ్జెట్‌లో పథకాల అమలుకు ప్రభుత్వం కేటాయించిన నిధుల అమలు తీరుపై ఒక నివేదికను రూపొందించి సమర్పించాలని మంత్రి ఉన్నతాధికారులను ఆదేశించారు. హాస్టల్, భవనాలు, వసతులు, మరమ్మతులు సదుపాయాలపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నివేదికలను అందజేయాలని ఆదేశించారు.
**ఉన్నత ప్రమాణాలతో స్టడీ సర్కిళ్ళు :**
ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులను ఐఎఎస్, ఐపిఎస్ అధికారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని మంత్రి తెలిపారు. జాతీయ ప్రమాణాలతో పోటీపడేలా స్టడీ సర్కిళ్లను తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళికలను రూపొందిస్తున్నారని మంత్రి వివరించారు. లోయర్ ట్యాంక్‌బాండ్ కాచిగూడ అంబేద్కర్ భవనాలను ఢిల్లీ, చెన్నై తరహాలో అత్యాధునికంగా రూపొందిస్తున్నామని మంత్రి వివరించారు.



## దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

అదనపు డిజికి ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ నేతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నాయకులపై దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి, పోలీసులపై అనుచిత వాక్యాలు చేసిన ఎంపి ధర్మపురి అరవింద్ ,మాజీ ఎంఎల్ఎ జగ్గారెడ్డి పై కేసులు నమోదు చేయాలని కోరుతూ గురువారం అడిషనల్ డిజిపి మహేష్ భగవత్ కు బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, గెల్లు శ్రీనివాస్ యాదవ్ , కిషోర్ గౌడ్ , బొందర రామ్మూర్తి, తుంగ బాలు, కడారి స్వామి యాదవ్ , గోపగాని రఘురాంలు వినతి పత్రం అందజేశారు.గోల్కొండలో ఉండే అబ్బాస్ అనే రౌడీ షీటర్లను పట్టుకొని కౌటింగ్ సెంటర్ల వద్ద దాడులు చేశారని విన్నవించారు. ఎలక్షన్ బూతుకు వంద మీటర్ల దూరంలో ఉండవలసిన నాయకులు లోపలికి వెళ్తే సిఐ ఆపితే తప్ప...? అని ప్రశ్నించారు. పోలీసులపై జగ్గారెడ్డి మాట్లాడిన మాటలను సుమోటోగా తీసుకొని కేసులు ఎందుకు పెట్టలేదన్నారు. కాంగ్రెస్ మంత్రులు జూపల్లి కృష్ణారావు,పొంగులేటి కుమారుడు పై కేసులు పెట్టిన పోలీసులను ఎక్కడికి పంపించారు...? ఇదేనా ప్రజాస్వామ్యం ఇదేనా ప్రజాపాలన...? అని మీడియాతో మాట్లాడుతూ పేర్కొన్నారు.

## భారీ పరిశ్రమలలో...
# అగ్ని ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారీ పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల నివారణకు, కార్మికుల భద్రతకు ప్రభుత్వయంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, చర్యలపై స్పష్టమైన ఒక మాన్యువల్ ను సిద్ధం చేయాలని సి.ఎస్ ఆదేశించారు. గురువారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సిగాచి ఇండస్ట్రీస్‌లో జరిగిన దుర్ఘటన పై ఇప్పటి వరకు తీసుకున్న చర్యలను సంబంధిత అధికారులతో సి.ఎస్ సమీక్షించారు. ఈ ప్రమాదంలో మరణించిన కార్మికుల, బాధిత కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా చెల్లింపులు, కోర్టు కేసుల పురోగతిపై సంబంధిత విభాగాల ఉన్నతాధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా భారీ, మధ్యతర, చిన్నతరహా పరిశ్రమలలో రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలలో వివిధ విభాగాలు సమన్వయంతో తనిఖీలు నిర్వహించుకోవడానికి జాయింట్ ఇన్స్పెక్షన్ టీమ్స్ (ఉమ్మడి తనిఖీ బృందాలు) ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమలలో అగ్ని ప్రమాదాల నివారణకు నిరంతరం పర్యవేక్షణ ఉండే విధంగా అధికారులతో తనిఖీ నిర్వహించాలని అన్నారు. ఇందుకు జిల్లా స్థాయిలో రెవెన్యూ, పోలీస్, పరిశ్రమలు, కార్మిక, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ మండలి శాఖల అధికారులతో కూడిన తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని అదేశించారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి ఆ వివరాలను ఆన్ లైన్ లో (డాష్ బోర్డ్ పొందుపరిస్తే అన్ని విభాగాల అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని సిఎస్ సూచించారు. పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు, భద్రతా ఆడిట్, అలాగే కార్మికుల భద్రతకు సంబంధించి శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, సంజయ్ కుమార్, దాన కిషోర్, ఫైర్ సర్వీస్స్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్, సంగారెడ్డి కలెక్టర్ ప్రవీణ్య, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సిడిఎ) కమిషనర్ శశాంక, కాలుష్య నియంత్రణ మండలి (పిసిబి) మెంబర్ సెక్రటరీ రవి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# నుమాయిష్ వాణిజ్య, సాంస్కృతిక వికాసానికి రోల్ మోడల్

నుమాయిష్‌ను జిల్లాలకు విస్తరించాలి

నిమాయిష్ బహుమతుల ప్రదానోత్సవంలో మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ వ్యాప్తంగా ఖ్యాతి గడించిన నాంపల్లి నుమాయిష్ కేవలం ఒక వ్యాపార ప్రదర్శన మాత్రమే కాదని, అది మన రాష్ట్ర వాణిజ్య, సాంస్కృతిక వికాసానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో గురువారం ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ, ఈ ప్రదర్శనకు ఇప్పటి వరకు 20 లక్షలకు పైగా సందర్శకులు వచ్చారని, ఇది హైదరాబాద్‌పై ప్రజలకు ఉన్న మక్కువను, నుమాయిష్‌పై ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తోందని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల చిన్న, మధ్య తరగతికి చెందిన వ్యాపారులు ఉత్పత్తి చేసిన వస్తువులను విక్రయించుకునేందుకు మన నుమాయిష్ వేదిక కావడం సంతోషకరంగా ఉందన్నారు. హైదరాబాద్ తో పాటు జిల్లాలకు ఎగ్జిబిషన్ ను విస్తరించాలని సూచించారు. 1938లో స్థాపించిన ఈ నుమాయిష్ అనాడు 100 స్టాళ్లతో మొదలై, నేడు 1050 స్టాళ్లకు చేరడం మన పారిశ్రామిక ప్రగతికి నిదర్శనమని తెలిపారు. వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తూ ఆర్థికంగా ఎదగడంలో నుమాయిష్ కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు.
చార్మినార్, గోల్కొండ, బిర్యానీ తరహాలోనే 'నుమాయిష్' హైదరాబాద్ బ్రాండ ఇమేజ్‌లో అంతర్భాగమైంది. ఇది భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పే వేదిక. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఉన్న ఉత్పత్తులు ఇక్కడ కొలువుదీరడం వల్ల ఇది ఒక 'మినీ ఇండియా'ను తలపిస్తోంది. మన గంగాజమునా తెహజీబ్‌కు ఇది నిలువుటద్దం అని ఆయన అన్నారు.వ్యాపారం ద్వారా వచ్చిన ఆదాయాన్ని తిరిగి సమాజానికి అందించడం గొప్ప విషయం. ముఖ్యంగా 19 విద్యా సంస్థలను నడుపుతూ, 30 వేల మంది విద్యార్థులకు, అందులోనూ మహిళా విద్యకు పెద్దపీట వేయడం ఎగ్జిబిషన్ సొసైటీ చేస్తున్న అద్భుతమైన కృషికి నిదర్శనమని వెల్లడించారు. నుమాయిష్ ద్వారా వచ్చిన ప్రతి రూపాయిని నిరుపేద విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు వినియోగించడం అభినందనీయమని అన్నారు. నుమాయిష్‌లో సందర్శకులకు ఉత్తమ సేవలను అందించిన స్టాల్ నిర్వాహకులు, పోలీస్, ట్రాఫిక్, విద్యుత్, రోడ్లు భవనాలు ఇతర శాఖల అధికారులకు బహుమతులను ప్రధానం చేశారు. 86వ నుమాయిష్ మరింత విజయవంతంగా, అద్భుతంగా జరగాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ సుఖేష్ రెడ్డి, సెక్రటరీ బిఎన్. రాజేశ్వర్, ట్రెజరర్ ఎన్. సంజీవ్ కుమార్, జాయింట్ సెక్రటరీ టి. చంద్రశేఖర్, ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ అడ్వైజర్ పి. హరినాథ్ రెడ్డి, కన్వీనర్ బి.అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

# హబీబ్‌పై దాడికి సిపిఐ ఖండన



**న్యూఢిల్లీ :** ఢిల్లీ విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన సమతా దివస్ కార్యక్రమంలో చరిత్ర ప్రొఫెసర్ ఎస్.ఇర్ఫాన్ హబీబ్ ప్రసంగిస్తుండగా ఆయనపై జరిగిన దాడిని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రొఫెసర్ హబీబ్ ప్రసంగిస్తుండగా, గోడ వెనుక భాగం నుంచి ఆయనపై నీళ్ల బకెట్‌ను విసిరారు. ఈ ఘటన అనంతరం ఆయన తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఇది ఎబివిపి పనేనని ఎఐసిఎ(ఐసా) తదిదర విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. కాగా, ఇర్ఫాన్ హబీబ్‌పై దాడిని భిన్నాభిప్రాయం లేదా చర్చ కాదు, ఇది పిరికి బెదిరింపు చర్య అని ఖండించారు. ఆలోచనలను ఆలోచనలతో సంఘర్షించాలని, హింస, బెదిరింపులు లేదా గూండాయిజంతో కాదన్నారు. స్వేచ్ఛా ఆలోచన, బహిరంగ చర్చకు భయపడే మితవాద శక్తుల లోతైన అభద్రతను ఇటువంటి చర్యలు బహిర్గతం చేస్తాయన్నారు. తాము ప్రొఫెసర్ ఎస్. ఇర్ఫాన్ హబీబ్‌కు సంపూర్ణ సంఘీభావంగా నిలబడుతామని రాజా తెలిపారు.

## హోలీ, వేసవి రద్దీ దృష్ట్యా వారాంత

# స్పెషల్ రైళ్ల పొడిగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హోలీ పండుగతో పాటు రానున్న వేసవి కాలంలో పెరిగే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ పలు వారాంత ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ మేరకు చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ. శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 01477 సోలాపూర్–అనకాపల్లి రైలు మార్చి 6 నుంచి జూలై 10 వరకు ప్రతి శుక్రవారం,01478 అనకాపల్లి–సోలాపూర్ రైలు మార్చి 7 నుంచి జూలై 11 వరకు ప్రతి శనివారం , ఈ రైళ్లు అకల్కోట్ రోడ్ గణగాపూర్, కలబుర్గి, యాదగిరి, రాయచూర్, మంత్రాలయం రోడ్ ఆదోని, గుంటకల్, అనంతపురం, ధర్మవరం, తిరుపతి, నెల్లూరు, ఒంగోలు, తెనాలి, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామల్కోట్, అన్నవరం, యెలమంచిలి తదితర స్టేషన్లలో ఆగనున్నాయి.

# కార్మికులు, రైతుల గొంతును ప్రభుత్వం విస్మరించింది

### ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శ

### కార్మిక సంఘాల సమ్మెకు మద్దతు



**న్యూఢిల్లీ :** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపునకు దేశంలోని ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. కార్మికులు, రైతుల భవిష్యత్తు గురించి నిర్ణయాలు తీసుకునేటప్పుడు వారి గొంతును ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని లోక్‌సభ ప్రతిపక్ష రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇప్పుడైనా ప్రధాని నరేంద్ర మోదీ వింటారా? అని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మోదీ ప్రభుత్వ వాణిజ్య ఒప్పందం, కార్మిక చట్టాలు, ఎంజి నరేగాను లాక్కోవడానికి వ్యతిరేకంగా దేశంలోని అన్ని కార్మిక సంఘాలు, రైతులు, కార్మికులు వీధుల్లోకి వచ్చారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. లక్షలాది మంది శ్రమించే రైతులు, కార్మికులు , కార్మికుల భవిష్యత్తును తాకట్టు పెట్టిన ప్రజా వ్యతిరేక ట్రాప్ డీల్‌కు తాము గట్టిగా వ్యతిరేకంగా నిలుస్తామన్నారు. విదేశీ ఒత్తిడికి లొంగి, మోదీ ప్రభుత్వం దేశంలోని కోట్లాది మంది పౌరుల జీవితాలతో చెలగాటమాడిందని ఆయన ఆరోపించారు. 'అబ్కీ బార్ ట్రంప్ సర్కార్' అని నినాదాలు చేసిన వారు భారతదేశ జాతీయ ప్రయోజనాలకు హాని కలిగించారని, దీనికి అతిపెద్ద వ్యతిరేకత మన కార్మికులు, చిన్న వ్యాపారులు, సామాన్య ప్రజల నుండి వస్తుందని ఖర్గే ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. వీధుల నుండి పార్లమెంటు వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఖర్గే పేర్కొన్నారు. ప్రభుత్వం కార్మికులు, రైతుల భవిష్యత్తుకు సంబంధించి నిర్ణయాలు తీసుకునేటప్పుడు వారి గొంతులను విస్మరించిందని గాంధీ ఆరోపించారు. భారత్–అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం 'టోకు లొంగుబాటు' అని రాహుల్‌గాంధీ ఆరోపించారు. గురువారం దేశవ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులు, రైతులు తమ హక్కుల కోసం తమ గొంతులను వినిపించడానికి వీధుల్లోకి వచ్చారని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఎంజినరేగాను బలహీనపరచడం లేదా తొలగించడం వల్ల గ్రామాలకు మద్దతు ఇచ్చే చివరి వనరు కూడా పోతుందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ కార్మికులు, రైతులకు మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం ఏమి చేసినా అది పూర్తిగా తప్పు అని అన్నారు. 'వారు రైతులను మోసం చేస్తున్నారు. వారు సంతకం చేసిన వాణిజ్య ఒప్పందం రైతులకు బాధలను కలిగిస్తుంది. కార్మిక సంఘాల సమ్మెకు మేము మద్దతు ఇస్తున్నామని ఆమె అన్నారు.

## భారత్ అమెరికా ట్రేడ్‌డీల్

# విపక్ష ఎంపిల నిరసన




**న్యూఢిల్లీ:** భారత్, అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష ఎంపిలు పార్లమెంట్ లోపల, వెలుపల ఆందోళన నిర్వహించారు. గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో లోక్‌సభలో గందరగోళం నెలకొంది. సభ సమావేశమైన వెంటనే, ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడం ప్రారంభించారు. ప్లకార్డులను కూడా ప్రదర్శించారు. కొన్ని అంశాలను లేవనెత్తడానికి ప్రయత్నిస్తూ చాలా మంది సభ్యులు సభలోకి దూసుకెళ్లారు. వారిలో కొందరు 'వాణిజ్య ఒప్పందాన్ని వెనక్కి తీసుకోండి' (వాణిజ్య ఒప్పందాన్ని వెనక్కి తీసుకోండి) అని నినాదాలు చేశారు. కొత్త కార్మిక నియమావళిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. స్పీకర్ స్థానంలో ఉన్న కృష్ణ ప్రసాద్ టెన్నెటి వారిని తమ సమస్యలను లేవనెత్తడానికి అనుమతించలేదు. నిరసన తెలిపిన సభ్యులను తిరిగి వారి సీట్లకు వెళ్లమని విజ్ఞప్తి చేశారు. సభ లోపల ప్లకార్డులు ప్రదర్శించడం పార్లమెంటు నియమాలకు విరుద్ధమని ఆయన పదే పదే అభ్యర్థించారు. గందరగోళం కొనసాగడంతో మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యకలాపాలను వాయిదా వేశారు. ప్రశ్నోత్తరాల సందర్భంగా ఏడు నిమిషాల పాటు జరిగిన ఒక ప్రశ్న, దాని అనుబంధాలను తీసుకున్నారు. అయితే అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందంలో ప్రభుత్వం అందించిన వ్యవసాయ రంగానికి సంబంధించిన వివిధ రాయితీల గురించి కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇదిలా ఉండగా, మధ్యాహ్నం 12 గంటలకు సభ సమావేశం కాగానే కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని బిజెపి సభ్యుడు నిషికాంత్ దూబే చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు ఆందోళన చేయడంతో లోక్‌సభను శుక్రవారానికి వాయిదా వేశారు. జీరో అవర్‌లో ఈ అంశాన్ని లేవనెత్తిన దూబే, గాంధీ దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపారని ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలు ప్రతిపక్ష బెంచీల నుండి తీవ్ర గందరగోళానికి దారితీశాయి. దీంతో చైర్మన్‌గా ఉన్న టిడిపి నాయకుడు కృష్ణ ప్రసాద్ టెన్నేటి ఆ రోజు కార్యకలాపాలను వాయిదా వేశారు.

**పార్లమెంట్ వెలుపల ఆందోళన**

మరోవైపు భారత–అమెరికా తాత్కాలిక వాణిజ్య ఒప్పందంపై గురువారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రతిపక్ష ఎంపిలు నిరసన తెలిపారు. ప్రభుత్వం భారత ప్రయోజనాలను వదులుకుంటోందని ఆరోపించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎఐసిసి ప్రధాన కార్యదర్శులు కె.సి. వేణుగోపాల్, జైరాం రమేష్, డిఎంకెకు చెందిన టి.ఆర్. బాలు, ఎస్‌పి చెందిన ధర్మేంద్ర యాదవ్, జయా బచ్చన్, సిపిఐ(ఎంఎల్)కు చెందిన సుదామ ప్రసాద్ తదితరులు పార్లమెంటు మకర ద్వారం సమీపంలో జరిగిన నిరసనలో పాల్గొన్నారు. 'ట్రాప్ డీల్' అని రాసిన భారీ బ్యానర్‌తో 'నరేంద్ర సరెండర్' పోస్టర్లను పట్టుకుని, ఎంపిలు 'యుఎస్ డీల్ హై అత్యాచారి' 'దేశ్ కో బెచ్నా బంద్ కరో' వంటి నినాదాలు చేశారు. ఆ తరువాత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, ఇటీవల సస్పెండ్ చేయబడిన వారితో సహా ఇతర కాంగ్రెస్ ఎంపిలతో కలిసి మకర ద్వారం మెట్లపై నిలబడి ఈ ఒప్పందంపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

## రూ.3.60 లక్షలకోట్లతో 114 రాఫెల్ జెట్స్ సేకరణ

# మెగాప్రాజెక్టుకు డిఎసి ఆమోదముద్ర



**న్యూఢిల్లీ:** ఫ్రాన్స్ నుండి మరో విడత భారీ మొత్తం ఖర్చుచేసి 114 రాఫెల్ యుద్ధ విమానాలను సేకరించేందుకు భారత రక్షణశాఖ అనుమతి మంజూరు చేసింది. ఈసారి సుమారు రూ.3.60 లక్షలకోట్ల వ్యయంతో ఈ యుద్ధ విమానాల సేకరణ ద్వారా భారత్–ఫ్రాన్స్‌మధ్య అతిపెద్ద ఒప్పందం జరుగుతుంది. సైనిక అవసరాల నిమిత్తం యుద్ధ విమానాల సేకరణకు ఇటీవలి కాలంలో ప్రపంచంలోనే అతి భారీస్థాయిలో నిధుల కేటాయింపులలో ఒకటిగా దీనిని భావిస్తున్నారు. ఈ మెగా ప్రాజెక్టుకు డిఎసి ఆమోదం తెలియజేసింది.13 సంవత్సరాల తర్వాత భారతదేశం మరోసారి రాఫెల్ విమానాలను గతంకంటే భిన్నంగా చాలా హెచ్చుస్థాయిలో సేకరిస్తోంది. అతిపెద్ద మొత్తాన్ని దేశ రక్షణ అవసరాల నిమిత్తం కేటాయించేందుకు రక్షణశాఖ సిద్ధపడింది. దీని ప్రకారం సైనిక అవసరాల నిమిత్తం యుద్ధ సామాగ్రి, మౌలిక వనరులను సేకరించనున్నారు. డిఫెన్స్ ఎక్విజిషన్ కౌన్సిల్ ఈ మేరకు ఆమోదముద్ర వేసింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన డిఫెన్స్ ఎక్విజిషన్ కౌన్సిల్ (డిఎసి) సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. భారత సైన్యం యుద్ధ పోరాట పటిమను మరింత పటిష్టం చేసుకోవడానికి వీలుగా ఈ యుద్ధ విమానాలను సేకరిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 18 యుద్ధ విమానాలను దస్సాల్ట్ ఎవియేషన్ సరఫరా చేస్తుంది. యుద్ధ అవసరాల నిమిత్తం తక్షణం గాలిలో సంచరించడానికి వీలుగా ఉండే సిద్ధంచేసిన విమానాలను రాఫెల్ సరఫరా చేస్తుంది. మిగిలిన 96 విమానాలను భారత్‌లోనే తయారు చేస్తారు. 50 శాతం దేశీయ భాగస్వామ్యంతో దశలవారీగా వీటిని తయారు చేస్తారు. ఐతే డి ఎ సి మాత్రం ఖర్చును ఇదిమిత్థంగా తేల్చిచెప్పలేదు. బహుశా రూ.2.90 లక్షల కోట్ల నుండి రూ.3.15 లక్షల కోట్లవరకూ ఈ ఖర్చు ఉంటుందని అంచనా వేస్తున్నారు.ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ భారత్‌లో మూడురోజుల పర్యటనకు రావడానికి ఐదు రోజుల ముందుగా రక్షణ సేకరణ మండలి సమావేశంలో రాఫెల్ యుద్ధ విమానాల సేకరణకు సంబంధించిన ఆమోదముద్ర పడింది. లాంఛనపూర్వకమైన కాంట్రాక్టు ఒప్పందం ఈ ఏడాది చివరాఖరుకంటే ముందే జరిగే అవకాశం లేకపోవచ్చు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతనగల సిసిఎస్ (భద్రతపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ కమిటీ) కూడా ఈ డిఎసి ఆమోదానికి తిరిగి తన సమ్మతిని తెలియజేయాల్సి ఉంది. బహుముఖపాత్రలు నిర్వహించే రాఫెల్ యుద్ధ విమానాలు 114 వరకూ అవసరం అవుతాయని పేర్కొంటూ 2019 ఏప్రిల్ నెలలో భారత వైమానికదళం ఒక విజ్ఞప్తి సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. వీటి విలువ 18 బిలియన్ డాలర్లుగా భారత వైమానిక దళం అంచనావేసింది. ఈ మెగా ప్రాజెక్టు కోసం లాకీహిడ్ మార్టిన్స్ ఎఫ్–21,బోయింగ్ ఎఫ్/ఎ–18, యూరోఫైటర్ టైఫూన్‌లు ఇతర పోటీదారులుగా ఉన్నారు. భారత యుద్ధ విమానాలు నడిపేందుకు స్క్వాడ్రన్ లీడర్స్‌ను అధికారికంగా 42 మందిని నియమించుకోవాలని భావించగా వాస్తవిక సంఖ్య మాత్రం కేవలం 31 మాత్రమే ఉంది. ఈ దశలో కొత్త యుద్ధ విమానాలను రక్షణశాఖ సేకరిస్తోంది. దాదాపు 13 సంవత్సరాల తర్వాత బహుముఖంగా యుద్ధభూమిలో పనిచేసే విమానాలను సేకరించే ప్రక్రియను రక్షణశాఖ పూర్తిచేసింది. 2015లో ఫ్రాన్స్–భారత్ ప్రభుత్వాలమధ్య ఒప్పందం కింద 36 రాఫెల్ విమానాల సేకరణకు మోదీ ప్రకటన చేశారు. ఇప్పుడు భారత వైమానిక దళం కొత్త ఆర్డరు పెట్టింది. వీటిని సేకరించడం ద్వారా భారత గగనతలపోరాట పటిమ ఇబ్బడిముబ్బడిగా పెరుగుతుందని రక్షణమంత్రిత్వశాఖ ప్రకటించింది.


తెలంగాణా ప్రభుత్వము
భూ సేకరణ అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి
ఖమ్మం వారి రూఢీ ప్రకటన

ఫారం - 7

(చూడుము సబ్ రూల్ 1 రూల్ - 25, సెక్షన్ - 19(1) చట్టము - 30/2013)

జిల్లా గెజిట్ నెం. A3/16/2026 — తేది: 10.02.2026
కలెక్టర్ ఫైల్ నెం. జి1/1027/2018 — తేది: 10.02.2026
భూ.సే. అధికారి ఫైల్ నెం. C1/4690/2025 — తేది: 06.02.2026

తెలంగాణా ప్రభుత్వం / కలెక్టర్ & జిల్లా మెజిస్ట్రేట్, ఖమ్మం ఆదేశానుసారం ఖమ్మం జిల్లా, ఖమ్మం (అర్బన్) మండలంలో **ధంసలాపురం** గ్రామములో గల విస్తీర్ణం **1210 చదరపు గజాలు** ఈ దిగువ చూపిన భూమి, ప్రజా ప్రయోజనార్ధం అనగా కొండపల్లి నుండి ఖాజీపేట వరకు **3వ రైల్వేలైన్ విద్యుద్దీకరణ** కొరకు భూమి అవసరమైయున్నదని భావించినైనది.

కావున ఈ ప్రాజెక్ట్ క్రింద ఖమ్మం జిల్లా ఖమ్మం (అర్బన్) మండలంలో **ధంసలాపురం** గ్రామములో భూమి విస్తీర్ణం **1210 చదరపు గజాలు** భూమి ఈ క్రింది అనుబంధంలో వివరించిన ప్రకారం పైన తెలిపిన ప్రాజెక్ట్ నిర్మాణమునకు అవసరమైనందున రూఢీ ప్రకటన (డిక్లరేషన్) జారి చేయనైనది.

షెడ్యూల్

గ్రామము: ధంసలాపురం మండలం: ఖమ్మం (అర్బన్) జిల్లా: ఖమ్మం

| క్ర.సం. | సర్వే నెం. | సబ్ డివిజన్ నెం. | భూమి స్వభావం (పట్టా/ఇనాం) | భూమి రకం | సేకరించే విస్తీర్ణం (చ.గజాలు) | భూమి పట్టాదారు / తండ్రి పేరు లేదా భర్త పేరు | నిర్మాణాలు / చెట్లు / బావులు | హద్దులు |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 15/1/2 | | పట్టా | మెట్ట | 40 | నర్సింశెట్టి సావిత్రి, W/o నాగేశ్వర రావు | లేవు | తూ: 75 / ప: గ్రామం, ఉ: 16 / ద: 23, 14 |
| 2 | 15/1/2 | | పట్టా | మెట్ట | 45 | రోడియా ప్రభాకర్, S/o రామయ్య | లేవు | తూ: 75 / ప: గ్రామం, ఉ: 16 / ద: 23, 14 |
| 3 | 15/1/2 | | పట్టా | మెట్ట | 203 | బండారు లక్ష్మి , W/o లక్ష్మ య్య | లేవు | తూ: 75 / ప: గ్రామం, ఉ: 16 / ద: 23, 14 |
| 4 | 15/1/2 | | పట్టా | మెట్ట | 22 | సరియాల యాదయ్య, S/o తిరపతయ్య | లేవు | తూ: 75 / ప: గ్రామం, ఉ: 16 / ద: 23, 14 |
| 5 | 15/1/2 | | పట్టా | మెట్ట | 152 | నర్సింశెట్టి పుష్పవతి, W/o లక్ష్మి నారాయణ | లేవు | తూ: 75 / ప: గ్రామం, ఉ: 16 / ద: 23, 14 |
| 6 | 15/1/2 | | పట్టా | మెట్ట | 33 | శీలం హేమలత, W/o రమేష్ బాబు | లేవు | తూ: 75 / ప: గ్రామం, ఉ: 16 / ద: 23, 14 |
| 7 | 15/1/2 | | పట్టా | మెట్ట | 110 | CC రోడ్డు | లేవు | తూ: 75 / ప: గ్రామం, ఉ: 16 / ద: 23, 14 |
| 8 | 16/1/2 | | పట్టా | మెట్ట | 8 | నర్సింశెట్టి పుష్పవతి, W/o లక్ష్మి నారాయణ | లేవు | తూ: 74/ ప: గ్రామం, ఉ: 17 / ద: 15 |
| 9 | 16/1/2 | | పట్టా | మెట్ట | 200 | శీలం హేమలత, W/o రమేష్ బాబు | లేవు | తూ: 74 / ప: గ్రామం, ఉ: 17 / ద: 15 |
| 10 | 16/1/2 | | పట్టా | మెట్ట | 22 | జక్కుల లక్ష్మి బాయమ్మ, W/o వెంకట్‌రావు | లేవు | తూ: 74 / ప: గ్రామం, ఉ: 17 / ద: 15 |
| 11 | 16/1/2 | | పట్టా | మెట్ట | 60 | యన్. పద్మ, W/o మల్లయ్య | లేవు | తూ: 74 / ప: గ్రామం, ఉ: 17 / ద: 15 |
| 12 | 16/1/2 | | పట్టా | మెట్ట | 182 | సాంగోజు రామ చంద్ర చారి, W/o బ్రహ్మయ్య | లేవు | తూ: 74 / ప: గ్రామం, ఉ: 17 / ద: 15 |
| 13 | 16/1/2 | | పట్టా | మెట్ట | 50 | శర్యాల పద్మ, W/o శ్రీనివాస రావు | లేవు | తూ: 74 / ప: గ్రామం ఉ: 17 / ద:15 |
| 14 | 16/1/2 | | పట్టా | మెట్ట | 10 | బండారి ఏడుకొండలు, S/o నర్సయ్య | లేవు | తూ: 74 / ప: గ్రామం ఉ: 17 / ద: 15 |
| 15 | 16/1/2 | | పట్టా | మెట్ట | 73 | CC రోడ్డు | లేవు | తూ: 74 / ప: గ్రామం ఉ: 17 / ద: 15 |
| మొత్తం (చదరపు గజాలలో) | | | | | 1210 | | | |

భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాసం మరియు పునరుద్ధరణ చట్టం - 2013 (నెం.30/2013) లోని 15 ప్రకారం పై భూ సేకరణ పై ఎటువంటి అభ్యంతరములు నమోదు కాలేదు. కావున రూఢీ ప్రకటన(డిక్లరేషన్) జారి చేయనైనది. భూసేకరణ కారణంగా ఎవరూ నిర్వాసితులు కానందున పునరావాసం కల్పించబడు విస్తీర్ణం శూన్యం.

భూ సేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజములు ప్రాజెక్ట్ నిర్మాణముకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

ఆ పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలో కలెక్టర్ & జిల్లా మెజిస్ట్రేట్, ఖమ్మం మరియు భూసేకరణ అధికారి & రెవెన్యు డివిజినల్ అధికారి, ఖమ్మం వారి కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సం/- భూ సేకరణ అధికారి/ రెవెన్యూ డివిజనల్ అధికారి ఖమ్మం
సం/- అదనపు కలెక్టర్ ఖమ్మం
సం/- జిల్లా కలెక్టర్ ఖమ్మం

DIPR RO NO. 1117/LA/PP/Advt/Pub/2025-26


# పని ప్రదేశంలో..'కుల వివక్షా?

### రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే

### ఒడిశా అంగన్‌వాడీ కేంద్రంలో 'కుక్'ను బహిష్కరించడంపై ఆవేదన



**న్యూఢిల్లీ :** పని ప్రదేశాలలో కులవివక్షపై సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే గురువారం ఆందోళన వ్యక్తం చేశారు.ఇటీవల ఒడిశాలో ఒక నిర్దిష్ట వర్గానికి చెందిన సభ్యులు దళిత అంగన్‌వాడీ వర్కర్ వండిన ఆహారాన్ని తిననివ్వకుండా నిరాకరించిన సంఘటనను ఖర్గే ఉటంకించారు.మల్లికార్జున్ ఖర్గే ఎగువసభలో జీరో అవర్‌లో ఈ అంశాన్ని లేవనెత్తారు. 21వ శతాబ్దంలో మనం సామాజిక అభివృద్ధి, సాంఘిక సంస్కరణలు, హిందువుల ఐక్యత గురించి మాట్లాడేటప్పుడు ఒడిశాలోని అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్‌కమ్‌వంటమనిషిగా ఒక దళిత మహిళ వండిన ఆహారాన్ని ఒక నిర్దిష్ట సామాజికవర్గానికి ప్రజలు తమ పిల్లలు తినడానికి నిరాకరించారని, ఆ మహిళ గతమూడు నెలలుగా బహిష్కరించబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రంఅనేతి పిల్లల శారీరక పునాది అని ప్రతిపక్షనేత చెప్పారు. ఒకవేళ అలాంటి జాతి వివక్ష అక్కడ ఉన్నట్లయితే , అది సహజంగానే ఆ పిల్లల పెరుగుదలను ప్రభావితం చేస్తుందని అన్నారు. ఇటువంటి సంఘటనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఎ ప్రకారం అందించబడిన విద్యాహక్కును ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తాయన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి పనిప్రదేశాలలో కులవివక్షత వ్యక్తం అవుతున్న సమాచారం కూడా అందుతోందని ఖర్గే వివరించారు. దర్యాప్తు జరిగి ఉంటే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా నివారించబడేవన్నారు. మల్లికార్జున్ ఖర్గే ఈ సందర్భంగా ఇతర రాష్ట్రాలలో చోటుచేసుకున్న సంఘటనలను కూడా ఉదహరించారు. కొన్ని సంవత్సరాల క్రితం మధ్యప్రదేశ్‌లో ఒక ఆదివాసీ వ్యక్తిపై ఓ వ్యక్తి మూత్ర విసర్జన చేసిన సంఘటనను గుర్తు చేశారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది గుజరాత్‌లో కుల వివక్షత కారణంగా ఒక దళిత అధికారి ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని ఉదహరించారు.ఈ కులవివక్ష సంఘటనలు కేవలం సామాజిక, రాజకీయ జీవితాలకే పరిమితం కాలేదని, పని ప్రదేశాలలో కూడా వ్యాపించిందన్నారు. ఈ స్థితి ప్రజల గౌరవం, కెరీర్ పురోగతి, వ్యక్తిగత భద్రతను కూడా ప్రభావితం చేస్తుందని మల్లికార్జున్ ఖర్గే తెలియజేశారు. ఏ అధికారిపైన అయినా ఇలాంటి కులవివక్ష చూపించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14,15, 17లను కూడా ఉల్లంఘించడమేనన్నారు. ఇలాంటి విషయాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని, ఇలాంటి సంఘటనలపై సకాలంలో దర్యాప్తు చేపట్టి తగిన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రాహుల్‌పై ప్రివిలేజ్ నోటీసిస్తాం : రిజిజు



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మండిపడ్డారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై తప్పుడు, నిరాధారమైన ఆరోపణలు చేశారని విమర్శించారు. అలాగే సభను తప్పుదారి పట్టించినందుకు విపక్షనేతపై ప్రివిలేజ్ నోటీసు ఇస్తామని తెలిపారు. 'సభను తప్పుదారి పట్టించినందుకు, ప్రభుత్వం, ప్రధాని మోదీపై నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు విపక్ష నేత రాహుల్ గాంధీపై మేము ప్రివిలేజ్ నోటీసు దాఖలు చేయబోతున్నాం. లోక్‌సభ, రాజ్యసభలో విధానపరమైన ప్రవర్తనకు చాలా స్పష్టమైన నియమాలు ఉన్నాయి. ఒక ఎంపి మరొక ఎంపిపై తీవ్రమైన ఆరోపణలు చేయాలని అనుకున్నప్పుడు ముందుగా నోటీసు ఇవ్వాలి. ప్రధాని మోదీ దేశాన్ని, దేశ ప్రయోజనాలను అమ్మేశారని చెబుతూ రాహుల్ తప్పుడు ఆరోపణలు చేశారు. అలాగే కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరీపై ఎటువంటి నోటీసు ఇవ్వకుండానే రాహుల్ తీవ్రమైన ఆరోపణ చేశారు' అని కిరణ్ రిజిజు స్పష్టం చేశారు.

**రాహుల్ గాంధీపై 'సబ్‌స్టాంటివ్ మోషన్' దాఖలు చేశా : దూబే**

కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై 'సబ్‌స్టాంటివ్ మోషన్' దాఖలు చేశానని ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయనను జీవితాంతం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని బిజెపి ఎంపి నిషికాంత్ దూబే డిమాండ్ చేశారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో పిటిఐతో మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడు సోరోస్ ఫౌండేషన్, యుఎస్‌ఎఐడి, ఫోర్డ్ ఫౌండేషన్‌తో చేతులు కలిపి విదేశాలను ఎలా సందర్శిస్తారో, భారత వ్యతిరేక అంశాలతో 'కుట్ర' చేస్తారో తన నోటీసులో పేర్కొన్నట్లు దూబే తెలిపారు.

## బంగారం చోరీ దర్యాప్తులో తాజా నమూనాల సేకరణ కోసం..

# శబరిమల చేరుకున్న 'సిట్'

**పథనంథిట్ట (కేరళ) :** శబరిమల ఆలయంలోని కళాఖండాల నుంచి బంగారం చోరీకి గురైందన్న ఆరోపణలపై గురువారం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) శాస్త్రీయ విశ్లేషణ కోసం తాజా నమూనాల సేకరణలో భాగంగా గురువారం కొండ మందిరానికి చేరుకుంది. ఈ విషయాన్ని పోలీస్ వర్గాలు వెల్లడించాయి. ఈ సిట్ బృందానికి నేతృత్వం వహించిన ఎస్‌పి ఎస్,శశిధరన్ శబరిమలలోని బేస్ క్యాంప్ 'పంప'కు ఉదయం చేరుకుంది. ఆ తర్వాత మధ్యాహ్నం సన్నిధానానికి చేరుకున్నట్లు అధికారులు చెప్పారు. సోమవారం ప్రత్యేక దర్యాప్తు బృందానికి అనుమతిని మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో శాస్త్రీయ విశ్లేషణ కోసం తాజా శాంపుల్స్‌ను సేకరికంచాలని ప్రత్యేక దర్యాప్తు బృందం నిర్ణయించింది. పోలీస్ వర్గాలు తెలిపిన ప్రకారం శబరిమల దేవాలయం నెలవారీ పూజను గురువారం సాయంంత్రం 5 గంటలకు తెరువనుంది. కాగా షెడ్యూల్ ప్రకారం...ఫిబ్రవరి 17న రాత్రి 11గంటలకు మూసివేయనున్నది. సన్నిధానంలో వివిధ పూజల తర్వాత ఆలయం మూసివేసిన అనంతరం ప్రత్యేక దర్యాప్తు బృందం నమూనాలను సేకరిస్తుందని భావిస్తున్నారు. శ్రీ కోవిల్ దాని పిల్లర్లలోని బంగారుపూతతో కప్పబడిన కళాఖండాలను తొలగించడానికి లీగల్ మెట్రోలజీ డిపార్ట్‌మెంట్, ది ఫోరెన్సిక్ లేబరేటరీ, నైపుణ్యం కలిగిన కళాకారులు ప్రత్యేక దర్యాప్తు బృందానికి సహాయం చేయనున్నట్ల అధికారులు చెప్పారు. ద్వారపాలక (సంరక్షక దేవత) విగ్రహ ప్లేట్లు, శ్రీ కోవిల్ తలుపు చట్రాల నుండి బంగారం చోరీకి గురయిందన్న ఆరోపణలకు సంబంధించిన రెండు కేసులను సిట్ దర్యాప్తు చేస్తోంది. మొదట్లో ఉన్న బంగారం పరిమాణం, ఆ తర్వాత ఉన్న బంగారం పరిమాణం ఖచ్చితత్వం, నిష్పాక్షికతతో అధునాతన శాస్త్రీయ విశ్లేషణను స్థాపించడం అనివార్యమని ప్రత్యేక దర్యాప్తు బృందం కేరళ హైకోర్టు ముందు సమర్పించింది. ఉపరితల మూలక నిర్మాణాన్ని నిర్ణయించడానికి, ఎక్స్‌రే ఫ్లోరోసెన్స్ స్పెక్ట్రోస్కోపీ (ఎక్స్‌ఆర్‌ఎఫ్), అల్ట్రా ట్రేస్ ఇంప్యూరిటీ, ఎలిమెంట్ ప్రొఫిల్లింగ్ , ఇండక్టివ్‌లీ కపుల్ ప్లాస్మా మాస్ స్పెక్ట్రోమెట్రీ (ఐసిపిఎంఎస్), అలాయ్ కాంపోజిషన్, మెటలర్జికల్ యూనిఫార్మిటీని విశ్లేషించడానికి ఆప్టికల్ ఎమిస్సన్ స్పెక్ట్రోస్కోపీ (ఒఇఎస్) నిర్వహించాలని ఇది ప్రతిపాదించింది. ప్రత్యేక పరీక్షలు నిర్వహించడానికి ముంబయ్‌లోని భాభా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్, జంషెడ్‌పూర్‌లోని నేషనల్ మెటలర్జికల్ లేబరేటరీ, హైదరాబాద్‌లోని డిఫెన్స్ మెటలర్జికల్ రీసెర్చ్ లాబొరేటరీ సహా ప్రఖ్యాత జాతీయ పరిశోధనా సంస్థలు, ప్రయోగశాలలను అవసరాల పట్ల కేంద్రం సంప్రదించినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం కోర్టుకు తెలియజేసింది. అధునాతన ఫోరెన్సిక్, మెటలర్జికల్ పరీక్ష చాలా అవసరమని, ఈ ఫలితాలు ప్రాసిక్యూషన్ కేసుకు పునాదిగా నిలుస్తాయని, ఈ విషయంలో కోర్టు సంతృప్తి చెందిందని పేర్కొంది.

# కార్పొరేట్ బుజ్జగింపు బడ్జెట్



రాజ్యసభలో సిపిఐ ఎంపి సందోష్ కుమార్

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ బిజెపి వర్గ పక్షపాతం, కార్పొరేట్ బుజ్జగింపు రాజకీయాలను, ప్రతీకార వివక్షతను, సమాఖ్యస్ఫూర్తికి అన్యాయాన్ని బహిర్గతం చేస్తోందని సిపిఐ రాజ్యసభ సభ్యులు పి.సందోష్ కుమార్ విమర్శించారు. రాజ్యసభలో గురువారం బడ్జెట్‌పై జరిగిన సాధారణ చర్చలో ఆయన పాల్గొంటూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ద్వారా బిజెపి కార్పొరేట్ అనుకూల, కేరళ వ్యతిరేక ఎజెండాను బయటపెట్టిందని అన్నారు. పేదలు పేదలుగా మారుతుండగా, అదానీ వంటి కార్పొరేట్ సంస్థల సంపద అనేక రెట్లు పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ వెనుక మోదీ పాలన నిజమైన ప్రాధాన్యతలను స్పష్టంగా వెల్లడించిందని వ్యాఖ్యానించారు. కేరళ పట్ల నిరంతరం, ఉద్దేశపూర్వక నిర్లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రదర్శిస్తుందని మండిపడ్డారు. 'చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక సర్దుబాటు ప్యాకేజీని మంజూరు చేయలేదు. పార్లమెంటులో కేంద్ర ఆరోగ్య మంత్రి హామీ ఇచ్చినప్పటికీ ఎయిమ్స్ మంజూరు కాలేదు. కేరళ హైస్పీడ్ కారిడార్ ప్రాజెక్టును డిమాండ్ చేసింది, కానీ ప్రతిగా తాబేలు మార్గాన్ని ఇచ్చింది, ఇది రాష్ట్ర అభివృద్ధి అవసరాల పట్ల కేంద్రం యొక్క తిరస్కార వైఖరిని ప్రతిబింబిస్తుంది.' అని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలపునరావాసం కూడా సిగ్గు లేకుండా రాజకీయం చేస్తున్నారని, కేరళ ప్రజలు, ఎల్‌డిఎఫ్‌పై రాజకీయ ప్రతీకారం కారణంగా కేంద్ర ప్రభుత్వం చూరల్మల–మెప్పాడి కొండచరియలు విరిగిపడిన బాధితులను శిక్షించిందన్నారు.

# మద్దతు ధర, రైతు రుణమాఫీపై..

### సిఎం సిద్ధతో ఎస్‌కెఎం మోర్చా భేటీ

**బెంగళూరు:** కనీస మద్దతు ధర, రైతు రుణమాఫీపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సంయుక్త కిసాన్ మోర్చా ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కోరింది.గురువారం బెంగళూరులో కిసాన్ సంయుక్త మోర్చా కన్వీనర్ జగ్జిత్ సింగ్ దల్లేవాల్, కో కన్వీనర్ కురుబర శాంతకుమార్ ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా వారు రైతుల ముఖ్యమైన డిమాండ్లు నెరవేర్చడానికి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని మెమోరాండం సమర్పించారు. రైతులకు కనీస మద్దతు ధర, రుణామాఫీపై ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో చర్చించారు. మెమోరాండంలో వ్యవసాయ సంక్షోభంపై కిసాన్ సంయుక్త మోర్చా ఆందోళన లేవనెత్తింది. ఇటీవల కాలంలో కేంద్రంలోని ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేశాయని, దేశవ్యాప్తంగా 4లక్షల మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ రంగం వెన్నెముక అని, కోవిడ్ సమయంలో అన్ని సెక్టార్లు మూతపడినా..వ్యవసాయం రంగం మాత్రం 3.6 శాతం వృద్ధి సాధించిందన్నారు.


SHRIRAM Finance — వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS03UC 0617 | SUVARNA MINES | MAN CLA 25.250 FRT-T | 2017 |
| 2 | TG03T 0639 | ANUSHA PARIKI | EICHER PRO 2118 BS6 FBT | 2024 |
| 3 | TS09EV 0223 | ASHWINI GUMMADI | I20 1.4 L ASTA DIESEL 5 SEATER | 2017 |
| 4 | AP31TH 8989 | CHINTHAKINDI HARIKA | AL VIKING FBV-P | 2014 |
| 5 | TS24T 2759 | RAVI BONTHA | TATA LPK 2518 -FBT | 2018 |

AUCTION DATE : 14-02-2026

VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL

గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED
D.No:5-11-503 & 504, Kandakatla Gateway 3rd floor, KUC X Road, Hanamkonda - 506009. Cell : 9849955900 & 9573787776

# మోదీ ప్రభుత్వం మొండితనం, మూర్ఖత్వం విడనాడాలి

ప్రధాని నరేంద్రమోదీ నిరంకుశ ప్రభుత్వం కార్మిక హక్కులను హరిస్తూ, పెట్టుబడిదారులకు ఊడిగం చేసేందుకు తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ చట్టాల అమలును నిలుపు చేసి, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా 30కోట్లమందికి పైగా కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కార్మికులు, వివిధ స్రవంతులకు చెందిన వైట్‌కాలర్ ఉద్యోగులు గురువారం నిర్వహించిన సార్వత్రిక సమ్మె అపూర్వం. 2019, 2020 సంవత్సరాల్లో ఆమోదించిన ఈ కోడ్‌లను నిరసిస్తూ, వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ 10 కేంద్ర ట్రేడ్ యూనియన్‌ల జాతీయవేదిక పిలుపులపై ఇప్పటికి ఐదుసార్లు నిర్వహించిన సార్వత్రిక సమ్మెలకన్నా తాజా సమ్మె పరిధిలో, విస్తృతిలో విలక్షణమైంది. ఇది అన్ని రకాల శ్రమజీవుల్లో ఈ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక ఒంటెత్తు పోకడ విధానాలకు వ్యతిరేకంగా గూడుకట్టుకున్న అసంతృప్తిని ప్రతిబింబించింది. పారిశ్రామిక కార్మికులతోపాటు బ్యాంకులు, బీమా, బొగ్గు, విద్యుచ్ఛక్తి, డిఫెన్స్, రవాణా ఉద్యోగులతోపాటు కేంద్రప్రభుత్వ స్కీంవర్కర్స్, గిగ్–ప్లాట్‌ఫాం శ్రామికులు సహా, రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్న ఈ విజయవంతమైన సమ్మె నరేంద్ర మోదీ ప్రభుత్వానికి తీవ్రమైన హెచ్చరిక. కార్మికసంఘాలు విత్తన, విద్యుచ్ఛక్తి బిల్లులు, అణుశక్తి ప్రైవేటీకరణ ప్రతిపాదనల రద్దుతోపాటు మహాత్మాగాంధి గ్రామీణ ఉపాధి హామీ చట్టం పునరుద్ధరణను డిమాండ్ చేస్తున్నాయి. రైతు సంఘాలకు ప్రాతినిధ్యం వహించే సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సమ్మెకు తోడ్పాటు ప్రకటించటంతోపాటు, ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, తాజాగా ముందుకు తెచ్చిన ముసాయిదా విత్తనాల బిల్లును, ముసాయిదా విద్యుచ్ఛక్తి చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మల దగ్ధం వంటి నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. దీనితో ప్రభుత్వానికి వ్యతిరేకంగా శ్రమజీవుల నిరసన పరిధి విస్తృతమైంది. కార్మిక–కర్షక ఐక్యత కార్యాచరణలో ప్రతిఫలించింది.

బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ బిఎంఎస్ మినహా ఎఐటియుసి, సిఐటియు, ఐఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్ తదితర 10కేంద్ర టియులు కార్మికోద్యమాన్ని ఐక్యంగా నడుపుతున్నాయి. కర్షకులతో సమన్వయం నెరపుతున్నాయి. బిఎంఎస్ సైతం ఇందులో చేరకపోయినా కోడ్‌లలో తాము వ్యతిరేకిస్తున్న అంశాలను వివరిస్తూ కేంద్ర కార్మిక మంత్రికి మెమొరాండం సమర్పించింది.

స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా కార్మికవర్గం తమ హక్కుల సాధనకై ఎన్నో సమ్మెలు చేబట్టింది. పోలీసు చిత్రహింసలను అనుభవించింది. ప్రాణాలు సైతం త్యాగం చేసి కొన్ని చట్టాలు సాధించుకుంది. స్వాతంత్ర్యం తర్వాత నెహ్రూ ప్రభుత్వం జస్టిస్ గజేంద్ర గడ్కర్ చైర్మన్‌గా ఏర్పాటు చేసిన తొలి లేబర్ కమిషన్ చేసిన సిఫారసుల ప్రకారం కొన్ని చట్టాలు వచ్చాయి. రాజ్యాంగం ఆదేశిక సూత్రాలకు అనుగుణంగా ఆ చట్టాలు తెచ్చారు. వాజ్‌పేయి ప్రభుత్వకాలంలో ఏర్పాటైన రెండవ లేబర్ కమిషన్ తొలి కమిషన్ సిఫారసులను వడపోస్తూ సిఫారసులు చేసింది. అయితే ట్రేడ్ యూనియన్‌ల తీవ్రమైన ప్రతిఘటన కారణంగా అవి చట్టరూపం దాల్చలేదు. 1991లో ప్రపంచీకరణ ప్రవేశించాక కేంద్రప్రభుత్వాలు పెట్టుబడిదారులు, బహుళ జాతి కార్పొరేషన్‌లకు అనుకూలంగా కొన్ని చట్టాలు తెచ్చాయి. 2014 లో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు వేగం పుంజుకున్నాయి. ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్ ఆదేశించినట్లు పెట్టుబడులను ఆకర్షించేందుకు 'వ్యాపారాల సులభతరం' పేరుతో కార్మికుల హక్కులను హరించే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటిని నాలుగు కోడ్‌లుగా కొత్త చట్టాలు తెచ్చింది. వాటిని నోటిఫై చేసి వచ్చే ఏప్రిల్ నుంచి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నది.

2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలంటున్న ప్రభుత్వానికి మూర్ఖత్వంతో పాటు ఇంగితజ్ఞానం కూడా అవసరం. 30 కోట్లమందికి పైగా శ్రమజీవులను అణచివేసి సాధించే వికాసం ఎవరికోసం? విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకోసమేకదా? అదే జరిగితే అభివృద్ధి గణాంకాల్లో ఉంటుంది కాని ప్రజల జీవితాల్లో ఉండదు. అసమానతలు పెచ్చుపెరిగి అసంతృప్తి, అలజడులు పెచ్చరిల్లుతాయి. ప్రజల వాణికి స్పందించేదే ప్రజాస్వామ్య ప్రభుత్వమవుతుంది. అందువల్ల మోదీ ప్రభుత్వం మూర్ఖత్వం, మొండితనం విడనాడి కార్మిక, రైతు సంఘాలతో చర్చించి సామరస్యపూర్వక అంగీకారం సాధించాలి. అప్పుడే అభివృద్ధికి అర్థం ఉంటుంది. తాజా సమ్మె నుంచి ప్రభుత్వం గుణపాఠాలు తీసుకోకపోతే తర్వాత చింతించవలసి వస్తుంది.



## సమ్మె రోజే ఈ బిల్లా?

దేశవ్యాప్తంగా సమ్మె చేస్తున్న రోజే పారిశ్రామిక సంబంధాల కోడ్ సవరణ బిల్లును తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వ ఉద్దేశ్యం ఏమిటో అర్థమవుతోంది. ఎంతో కాలం పోరాడి సాధించిన హక్కులను నాలుగు కోడ్‌ల పేరుతో తొలగించారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పని గంటలు పరిమితి లేకుండాపోతుంది. కార్మికులు రోడ్కెక్కారు. కానీ, కేంద్ర ప్రభుత్వం వారి మాట వినడం లేదు. తక్షణమే నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి.

- లోక్‌సభలో సిపిఐ ఎంపి వి.సెల్వరాజ్



# బహుముఖ ప్రజ్ఞాశాలి సరోజినీ నాయుడు

అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభల తొలి మహిళా అధ్యక్షురాలు, స్వతంత్ర భారత తొలి మహిళా గవర్నర్, కవయిత్రి, గాన కోకిల, స్వాతంత్ర్య సమరంలో గళమెత్తిన మహిళా శిరోమణి, ధైర్యానికి ప్రతీక, దేశభక్తికి మారుపేరు అయిన బహుముఖ ప్రజ్ఞాశాలి సరోజినీ నాయుడు కీర్తి భరతమాత చరిత్ర పుటల్లో పదిలంగా ఉన్నది. 13 ఫిబ్రవరి 1879 రోజు హైదరాబాదులో విద్యాధికులైన డా:అఘోరనాథ్ చటోపాధ్యాయ , వరదా దేవి దంపతులకు జన్మించిన సరోజినీ చటోపాధ్యాయ చిన్నతనం నుంచే కార్యదక్షత, పట్టుదల, విద్యలో మక్కువ, ఇంగ్లీష్‌లో పట్టుకలిగి పదకొండవ ఏటనే అనర్గళంగా ఆంగ్లం మాట్లాడి ఆశ్చర్యాన్ని కలిగించింది. సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్‌లో విద్యను అత్యున్నత శ్రేణిలో పూర్తి చేసిన తర్వాత మద్రాసు యూనివర్సిటీలో మెట్రిక్యులేషన్ పూర్తిచేసి చురుకైన విద్యార్థినిగా మన్ననలు పొందింది.

**చదువుల్లో మేటి, ఆంగ్ల సాహిత్యంలో ఘనాపాటి, సమరంలో ఆడ పులి:**

13వ ఏటనే సరోజినీ నాయుడు 'సరోవరాణి' అనే పుస్తకం రచించి రచయిత్రిగా తన ప్రస్థానం ప్రారంభించింది. ఆమెలోని మేధో సంపత్తిని గుర్తించిన నాటి నిజాం నవాబు రూ:4,200/–స్కాలర్‌షిప్‌ను ఇచ్చి విదేశీ చదువులకోసం లండన్ కింగ్స్ కళాశాల, గిర్టన్ కళాశాల్లో చేరి కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో ఉన్నత చదువులను పూర్తి చేయడానికి పంపడం సంతోషదాయకం. ప్రముఖ బ్రిటీష్ ఆంగ్ల భాషావేత్తలు అబ్బురపడే విధంగా ఆంగ్లంలో కవిత్వం రాసిన సరోజినీ నాయుడు కాల విహంగం(బర్డ్ ఆఫ్ టైమ్), స్వర్గ ద్వారం (ది గోల్డెన్ త్రిషోల్డ్, విరిగిన రెక్కలు (ది బ్రోకెన్ వింగ్స్)) లాంటి ప్రఖ్యాత కావ్యాలు రచించి తన సత్తా చాటుకున్నారు. 1898లో విదేశీ విద్య పూర్తి చేసుకొని స్వదేశానికి తిరిగి వచ్చిన సరోజినీ నాయుడు శ్రీ ముత్యాల గోవిందరాజులు నాయుడును కందుకూరి వీరేశలింగం పంతులు సమక్షంలో కులాంతర వివాహమాడింది. కులం, మతం, ధనం లాంటి అంశాలను విభేదించిన సరోజినీ నాయుడు సమానత్వ భావనను నాడే ప్రచారం చేసారు. వారి సుసంపన్న దాంపత్యం ఫలితంగా ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలు జన్మించారు. పిల్లలకు తల్లిగా, కుటుంబానికి పెద్దగా ఉన్న సరోజినీ నాయుడు వలస పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నది. 1906లో మహిళా విద్య ప్రాధాన్యాన్ని దేశమంతా ప్రచారం చేసి నాటి స్వాతంత్ర్య సమర యోధుల దృష్టిని ఆకర్షించగలిగారు. అవిశ్రాంతంగా దేశమంతా తిరిగి ఉపన్యాసాలతో ప్రజల్లో దేశ భక్తిని జాగృతం చేయడంలో సఫలం అయ్యింది. తన ఆరోగ్యాన్ని పణంగా పెట్టి స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొనడంతో గుండె జబ్బుతో అనారోగ్యం పాలు అయింది. లండన్‌లో చికిత్స తీసుకొంటున్న సమయంలో జలియన్ వాలా బాగ్ మారణకాండ జరగడంతో చలించిపోయి, భారత్‌కు తిరిగి వచ్చి నాటి పంజాబ్ గవర్నర్ డయ్యర్ రాక్షస ప్రవృత్తికి వ్యతిరేకంగా గళం ఎత్తింది.

15 ఆగష్టు 1947 రోజు స్వాతంత్ర్యం పొందిన తర్వాత యుపి గవర్నర్‌గా సరోజినీ నాయుడు విశిష్ట సేవలు అందించింది.. తానే దేశంగా, దేశమే తన గుండెగా భావించినా మహోన్నత మహిళా చైతన్య స్ఫూర్తి దేశ ప్రజలకు రాజకీయ, సాంఘీక, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో అనితర సాధ్యమైన మానవీయ సేవలను స్వచ్ఛందంగా అందించింది. తన జీవితాన్ని భరతమాత సేవలో అర్పించిన సరోజినీ నాయుడు 02, మార్చి 1949 రోజు లక్నోలో తుదిశ్వాస విడిచి దేశాన్ని కన్నీటి సంద్రంలో ముంచెత్తింది. తన హైదరాబాదు నాంపల్లి సమీప నివాసమైన గోల్డెన్ త్రిషోల్డ్ హైదరాబాదు యూనివర్సిటీకి అప్పగించడం విశేషం. మన హైదరాబాదు ముద్దు బిడ్డ, నైటింగేల్ ఆఫ్ ఇండియా, తొలి తరం సాహస మహిళ సరోజినీ నాయుడు త్యాగమయ జీవితం నేటి యువతకు నిత్యం ప్రేరణగా నిలవాలని కోరుకుందాం.

*(13 ఫిబ్రవరి సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా)*

# భారత మార్కెట్ తలుపులు అమెరికాకు బార్లా

ఆర్.సూర్యకుమార్

భారతదేశం – అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం దౌత్యపరమైన పురోగతిగా, పెరుగుతున్న భారతదేశ ఆర్థిక ఉత్థానానికి రుజువుగా మన దగ్గర ప్రచారం చేయబడింది. వాస్తవానికి, వాషింగ్టన్‌తో భారతదేశ సంబంధాలలో వాణిజ్యం, భద్రత, సార్వభౌమాధికారం ఎలా తిరిగి క్రమబద్ధీకరిస్తున్న నిర్ణయాత్మక మార్పును ఇది సూచిస్తుంది. ఈ ఒప్పందం పైకి సుంకాల ఉపశమనాన్ని అందిస్తున్నా, లోపల లోతైన పునఃవ్యవస్థీకరణ దాగి ఉంది. ఇది అమెరికన్ మార్కెట్‌కు షరతులతో కూడిన అవకాశం కల్పించే విధాన స్వయంప్రతిపత్తి, నియంత్రణ పరిధి, వ్యూహాత్మక వెసులుబాటును అందిస్తుంది.

భారతదేశానికి సుంకాల ఉపసంహరణ, అమెరికా సుంకాల వ్యూహాత్మక లాభాలు అని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జిటిఆర్ఐ) ఈ చట్రాన్ని నిర్మొహమాటంగా వివరించింది. ఆ సూత్రీకరణ ఒప్పందం మూలం వద్ద అసమానతను తెలియజేస్తుంది.

అత్యంత స్పష్టమైన ఫలితం ఏమిటంటే, రష్యాతో ఇంధన సంబంధాలకు అనుసంధానించిన భారతదేశం వాణిజ్య వ్యవహారంపై అమెరికా కార్యనిర్వాహక ఆదేశాల కింద విధించబడిన శిక్షాత్మక సుంకాలను వెనక్కి తీసుకోవడం. ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ 14329 కింద విధించబడిన అదనపు 25శాతం సుంకాన్ని తొలగించాలనే వాషింగ్టన్ నిర్ణయం దౌత్య విజయంగా ఉత్సవాలు జరుపుకుంటున్నారు. అయినప్పటికీ ఈ ఉపశమనం సరళీకరణ లేదా పరస్పర సహకారం నుండి ఆవిర్భవించలేదు. ఇది అమెరికా జాతీయ భద్రతా లక్ష్యాలతో భారతదేశం సమన్వయం నుండి ఉద్భవించింది. ముఖ్యంగా, రష్యన్ చమురు దిగుమతుల ను అరికట్టడం, అమెరికా ఇంధన కొనుగోళ్ల వైపు మొగ్గు చూపడం ఇందులో ముఖ్యాంశాలు.

ఒక్క ఉత్పత్తిపై కూడా అమెరికా మోస్ట్ ఫేవర్డ్ నేషన్ (ఎంఎఫ్ఎన్) సుంకాలను తగ్గించలేదు. మరి చేసిందేమిటంటే, చట్టబద్ధత ప్రశ్నార్థకమైన 'ప్రతీకార సుంకాలను' వెనక్కి తీసుకోవడం, దాదాపు 55 శాతం భారతీయ ఎగుమతులపై 50 శాతం నుండి 18 శాతానికి తగ్గించడం. ఫలితంగా వాషింగ్టన్ భారతదేశం నుండి శాశ్వత మార్కెట్ అవకాశాల రాయితీల కోసం దాని స్వంత అసాధారణమైన, బలవంతపు సుంకాల నుండి ఉపశమనం పొందింది. ఇది స్వేచ్ఛా వాణిజ్యం కాదు. ఇది సృష్టించబడిన సమ్మతి.

ఈ చట్రంలో అమెరికా పారిశ్రామిక వస్తువులన్నిటిపై, విస్తృత శ్రేణి వ్యవసాయ ఉత్పత్తులపై భారతదేశం ఎంఎఫ్ఎన్ సుంకాలను తగ్గించడానికి లేదా తొలగించడానికి అంగీకరించింది. వాటిలో చాలావరకు రాజకీయంగా సున్నితమైనవి. వీటిలో అమెరికా ఎగుమతిదారులు పరిమాణం, సబ్సిడీలు, లోతైన దేశీయ మద్దతును ఆస్వాదించే ఆపిల్, నారింజ వంటి తాజా పండ్లు, సోయాబీన్ నూనె, వైన్, స్పిరిట్స్, ట్రీ నట్స్, అలాగే ముడి ఆహార పదార్థాలైన డిడిజిలు, ఎర్ర జొన్నలు, ఇతర ఉత్పత్తులు ఉన్నాయి.

జిటిఆర్ఐ హెచ్చరించినట్లుగా, పండ్లు, తినదగిన నూనెలపై సుంకాల కోతలు భారతీయ రైతులను దెబ్బతీసే అవకాశం ఉంది. అలాగే స్థానికంగా ప్రతిఘటనను రేకెత్తిస్తాయి. భారతీయ నూనెగింజల పెంపకందారులకు మద్దతు ఇవ్వడానికి సోయాబీన్ నూనె మాత్రమే చాలా కాలంగా రక్షించబడింది. ఈ ఒప్పందం ఆటోమొబైల్స్ చుట్టూ నెలకొన్ని అస్పష్టతను తొలగించింది. అమెరికా, ఇయుతో భారతదేశం చేసుకున్న ఎఫ్‌టిఎలో మాదిరిగా సుంకాల కోతలు పరిమితంగా, కోటా బద్ధంగా ఉంటాయా, లేదా అపరిమితంగా ఉంటాయా. రెండోది జరిగితే, భారతదేశం సహజ పర్యావరణ వ్యవస్థపై చిక్కులు తీవ్రంగా ఉండవచ్చు.

భారతదేశ తయారీ ఆకాంక్షలలో కీలకమైన రంగాలైన ఎలక్ట్రానిక్ భాగాలు, స్మార్ట్‌ఫోన్లు, సోలార్ ప్యానెళ్ళపై భవిష్యత్ సుంకాల తొలగింపులు కూడా అంతే ఆందోళనకరంగా ఉన్నాయి. భారతదేశం ప్రపంచ విలువ గొలుసులను అధిరోహించడానికి ప్రయత్నిస్తున్నట్లే ఈ రాయితీలు దేశీయ ఉత్పత్తిని తగ్గించే ప్రమాదం ఉంది. దీనికి విరుద్ధంగా, అమెరికా పూర్తి విచక్షణను నిలుపుకుంది. ఔషధాలు, రత్నాలు, వజ్రాలు, యంత్రాలపై భారత ఎగుమతులకు భవిష్యత్తులో సుంకాల ఉపశమనం దర్యాప్తులు, అనుబంధాలు, కార్యనిర్వాహక సంతృప్తిపై ఆధారపడి ఉంటుంది.

ఈ చట్రంలోని అత్యంత పర్యవసాన అంశం పూర్తిగా సుంకాల వెలుపల ఉంది. సరఫరా గొలుసులపై సహకారం, ఎగుమతి నియంత్రణలు, పెట్టుబడి పరిశీలన, 'తృతీయ పక్షం మార్కెట్ యేతర విధానాలకు' ప్రతిస్పందనలతో సహా అమెరికాతో 'ఆర్థిక భద్రతా అమరికను బలోపేతం చేయడానికి' భారతదేశం అంగీకరించింది. ఈ భాష ఉద్దేశపూర్వకంగా విస్తృతమైనది, లోతైన చొరబాటుతో కూడుకున్నది.

జిటిఆర్ఐ గమనించినట్లుగా, అలాంటి నిబద్ధతలు భారతదేశం ఆర్థిక ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ, రష్యా, చైనాతో సహ తృతీయదేశాలపై అమెరికా ఆంక్షలు, వాణిజ్య చర్యలను ప్రతిబింబించేలా భారతదేశాన్ని బలవంతం చేస్తాయి. భద్రతా కారణాల దృష్ట్యా వాషింగ్టన్ ఒక దేశం నుండి దిగుమతులపై 100 శాతం సుంకాలను విధించినట్లయితే, భారతదేశం కూడా దానిని అనుసరించే అవకాశం ఉంది. అమెరికా ఆంక్షల కింద ఉన్న దేశాలతో లావాదేవీలను పరిమితం చేయాలని భారతదేశంపై ఒత్తిడి కూడా రావచ్చు. అలాగే దాని విదేశీ ఆర్థిక విధానంలోని అంశాలను సమర్థవంతంగా ఔట్‌సోర్స్ చేస్తుంది.

వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, బహుళ— అనుసంధానాలను చాలాకాలంగా సమర్థించిన దేశానికి, ఇది నిర్మాణాత్మక అడ్డంకిని సూచిస్తుంది. ఈ చట్రంలో ఆర్థిక భద్రత, స్థితిస్థాపకతకు కాదు, అనుసంధానానికి ఒక సాధనంగా మారుతుంది.

ఈ ఒప్పందం భారతదేశ నియంత్రణ వ్యవస్థను అపూర్వమైన బాహ్య ప్రభావానికి కూడా లోను చేస్తుంది. వైద్య పరికరాలపై అమెరికా దీర్ఘకాలంగా ఉన్న ఆందోళనలను సడలించడానికి, ఐసిటి ఉత్పత్తులకు దిగుమతి లైసెన్సింగ్‌ను తొలగించడానికి, ఆరు నెలల్లోపు ఎంచుకున్న రంగాలలో అమెరికన్ ఎగుమతులకు యుఎస్ లేదా అంతర్జాతీయ ప్రమాణాలు అంగీకరించబడతాయో లేదో నిర్ణయించడానికి భారతదేశం కట్టుబడి ఉంది. ఇది పరస్పర గుర్తింపు కాదు. ఇది నియంత్రణ అధీనం.

జిటిఆర్ఐ మలేషియా ఉదంతాన్ని సూచిస్తుంది. ఆ దేశంలో వ్యవసాయ, ఆహార ఉత్పత్తులకు యుఎస్ సర్టిఫికేషన్ దేశీయ పారిశుద్ధ్య, ఆరోగ్య ప్రమాణాలపై ప్రబలంగా ఉంది. వాషింగ్టన్ నుండి పరస్పర రాయితీలు లేకుండా ఇది కొనసాగుతోంది. భారతదేశంలో ఇలాంటి ఫలితాలు వ్యవసాయం, ఆరోగ్యం, భద్రతలో దేశీయ పర్యవేక్షణను బలహీనపరుస్తాయి. ప్రమాణాలను ప్రజా విధాన సాధనాలుగా కాకుండా వాణిజ్య రాయితీలుగా మారుస్తాయి. ఒకసారి అంగీకరించిన తర్వాత, అటువంటి నియంత్రణ పరధిని తిరిగి పొందడం దాదాపు అసాధ్యం.

డిజిటల్ వాణిజ్యం తదుపరి తప్పుగా మారనుంది. ఈ చట్రం రెండు వైపులా 'వివక్షత లేదా భారమైన' డిజిటల్ పద్ధతులను తొలగించడానికి, బిటిఎ కింద బలమైన డిజిటల్ వాణిజ్య నియమాలను ఏర్పాటు చేయడానికి కట్టుబడి ఉంది.

ఆచరణలో డిజిటల్ సేవల పన్నులపై నిషేధాలు, ఎలక్ట్రానిక్ ప్రసారాలపై కస్టమ్స్ సుంకాలపై శాశ్వత మారటోరియం, ప్రపంచ సాంకేతిక సంస్థల దేశీయ నియంత్రణపై పరిమితులు ఉంటాయి. ఇది ఇతర ఒప్పందాలలో అమెరికా డిమాండ్లను ప్రతిబింబిస్తుంది.



మలేషియా ఇప్పటికే ఇలాంటి నిబంధనలను అంగీకరించింది. డిజిటల్ పన్నులు, సరిహద్దు సేకరణ హక్కులు, విదేశీ వేదికల నుండి స్థానిక ఆదాయ సహకారాలను కూడా వదులుకోవడం. భారతదేశం ఈ మార్గాన్ని అనుసరిస్తే, అది డబ్ల్యుటిఒలో దాని దీర్ఘకాలిక స్థానాన్ని బలహీనపరుస్తుంది. బిగ్ టెక్ పన్ను విధించే సామర్థ్యాన్ని బలహీనపరుస్తుంది. భవిష్యత్ డిజిటల్ విధాన పరిధిని తీవ్రంగా తగ్గిస్తుంది.

డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాల ద్వారా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థకు, ఇది స్వల్ప సమస్య కాదు. ఇది సార్వభౌమాధికారం హృదయానికి తగులుతుంది. ఒప్పందంలో రాజకీయంగా ఉపయోగకరమైనది, కానీ ఆర్థికంగా నమ్మశక్యం కాని అంశం ఐదు సంవత్సరాలలో 500 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా వస్తువులను కొనుగోలు చేయాలనే భారతదేశం ఉద్దేశ్యాన్ని సూచిస్తుంది. ఇది జరగాలంటే అమెరికా నుండి వార్షిక దిగుమతులు రెట్టింపు కంటే ఎక్కువ, అంటే దాదాపు 45 బిలియన్‌ల నుండి దాదాపు 100 బిలియన్ డాలర్ల వరకు పెంచాల్సి ఉంటుంది.

జిటిఆర్ఐ ఎత్తి చూపినట్లుగా, దూకుడుగా విమానాల కొనుగోళ్లు కూడా ఈ అంతరాన్ని తగ్గించలేవు. భారతదేశం ప్రస్తుతం దాదాపు 200 బోయింగ్ విమానాలను నడుపుతోంది. ఐదు సంవత్సరాలలో ఆ విమానాల సంఖ్యను రెట్టింపు చేయడం అసంభవమైన పరిస్థితి. దాదాపు 60 బిలియన్ల డాలర్లకు చేరుకుంటుంది. అలాంటి నిర్ణయాలు ప్రభుత్వాలు కాకుండా ప్రైవేట్ విమానయాన సంస్థలు తీసుకుంటాయి. ఈ సంఖ్య ఉత్తమ పరిస్థితులలో ఆకాంక్షాత్మకంగా, హీనపరిస్థితులలో ప్రతీకాత్మకం గా కనిపిస్తుంది. ఆర్థిక సాధ్యాసాధ్యాల కంటే రాజకీయ సద్భావనను సూచించడానికి రూపొందించబడింది.

ప్రకటనలో అత్యంత తప్పుదారి పట్టించే అంశం 'మధ్యంతర' అనే పదం. ఈ చట్రం భారతదేశాన్ని వ్యవసాయం, తయారీ, నియంత్రణ, డిజిటల్ విధానం, ఇంధన వనరులు, భద్రతా అమరిక వంటి పథాలలోకి బంధించింది. ఇవి చివరికి ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని రూపొందిస్తాయి. భవిష్యత్తు ప్రత్యామ్నాయాలను పరిమితం చేస్తాయి.

జిటిఆర్ఐ పేర్కొన్నట్లుగా ఈ ఒప్పందం వ్యవసాయం, నియంత్రణ, డిజిటల్ వాణిజ్యంపై 'మరిన్ని నిబద్ధతలకు తలుపులు తెరుస్తుంది'. ఒకసారి తెరిచిన తర్వాత, ఆ తలుపులు చాలా అరుదుగా మూసుకుపోతాయి.

భారతదేశం సుంకం ఉపశమనం పొందింది. కానీ ధర ఎక్కువగా ఉంది: అమెరికా వస్తువులకు శాశ్వతంగా అందుబాటులోకి మార్కెట్, తగ్గిన నియంత్రణ స్వయంప్రతిపత్తి, పరిమితమైన తృతీయ దేశ సంబంధాలు, వాణిజ్యానికి మించిన వ్యూహాత్మక నిబద్ధతలు. విచ్ఛిన్నమైన ప్రపంచ వ్యవస్థలో ఇది ఎంపికచేసుకున్న ప్రత్యామ్నాయం కావచ్చు. కానీ దీనిపై నిజాయితీగా చర్చించాలి. ఎందుకంటే ఈ ఒప్పందం కేవలం సుంకాలను తగ్గించడం గురించి మాత్రమే కాదు. ఇది భారతదేశ ఆర్థిక భవిష్యత్తు నిబంధనలను ఎవరు నిర్ణయిస్తారో, చర్చల బల్ల (నెగోషియేటింగ్, న్యూఢిల్లీ) ఎంత సార్వభౌమత్వాన్ని ఉంచేందుకు సిద్ధంగా ఉందో పునర్నిర్వచించటానికి సంబంధించింది కూడా.

**(ఐపిఎ సర్వీస్)**

# బాల్యం ఆలోచనకు అడ్డుకట్ట వేస్తున్నది ఎవరు?

ప్రశ్నలే పురోగతికి పునాది, ప్రతి మనిషిలోనూ పుట్టుకతోనే ఒక ఆలోచనాపరుడు దాగి ఉంటాడు. ఒక చిన్నారి మొదటిసారి ఎందుకు? అని అడిగే క్షణం నుంచే ఆలోచన ప్రారంభమవుతుంది. ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే తపన, చూసినదాన్ని విచారించాలనే స్వభావం, తెలియని దాన్ని తెలుసుకోవాలనే ఆసక్తి..ఇవే మానవ మేధస్సుకు పునాది. చిన్న పిల్లలను గమనిస్తే ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఒక చీమ నడుస్తుంటే దాన్ని ఎందుకు చూస్తుందో, ఆకాశం నీలంగా ఎందుకు ఉంటుందో, పక్షులు ఎలా ఎగరగలుగుతాయో.. వారి ప్రశ్నలకు అంతం ఉండదు. ఈ ప్రశ్నల వెనుక ఉన్నది అల్లరి కాదు, అది సృజనాత్మక మేధస్సు. కానీ సమాజం, కుటుంబం,వ్యవస్థ ఈ మూడింటిలో ఎక్కడో ఒకచోట ఆ ప్రశ్నల ప్రవాహం అడ్డుకుంటూ పోతుంది. ప్రశ్నలు అడగకు, నిశ్శబ్దంగా ఉండు, ఇది అలాగే ఉంటుంది. అనే సమాధానాలు చిన్నారి ఆలోచన తలుపులు మూసేస్తాయి. ప్రశ్నించడం ఆగిన చోట ఆలోచన ఆగిపోతుంది. ఆలోచన ఆగిన చోట సృజన క్షీణిస్తుంది. ఇప్పుడేమో మరో సవాలు మన ముందుంది ....డిజిటల్ ప్రపంచం. ఇది జ్ఞానానికి ద్వారం కూడా.. అదే సమయంలో మేధస్సును మాయలో ముంచే శక్తి కూడా దానిదే. డిజిటల్ యుగంలో మన పిల్లల ఆలోచనా స్వాతంత్ర్యాన్ని ఎలా కాపాడాలి?.

**బాల్య మేధస్సు–డిజిటల్ ప్రభావం..**

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచాన్ని మన చేతిలో పెట్టింది. సమాచారం క్షణాల్లో అందుబాటులోకి వస్తోంది. విద్య, వినోదం, సంభాషణఅన్నీ ఒకే పరికరంలో అందుబాటులోకి రావడం వల్ల ఈ సౌలభ్యం మానవ జీవితాన్ని సులభతరం చేసింది. అయితే అదే సాంకేతికత చిన్నారుల సహజ ఆలోచనా ప్రక్రియపై ప్రతికూల ప్రభావం చూపుతోందనే ఆందోళనలు పెరుగుతున్నాయి. నేటి పిల్లలకు ఆడుకునే మైదానం కంటే మొబైల్ స్క్రీన్ ఎక్కువ ఆకర్షణీయంగా మారుతోంది. కథల పుస్తకం కంటే వీడియో ఎక్కువ ఆసక్తికరంగా కనిపిస్తోంది. శాస్త్రీయ అధ్యయనాలు చెబుతున్నది ఏమిటంటే ఐదేళ్లలోపు పిల్లలకు ప్రత్యక్ష సంభాషణ, కథలు, పాటలు, అనుభవాత్మక ఆటలు అత్యవసరం. ఇవి మెదడులోని నాడీకణాల అనుసంధానాలను బలపరుస్తాయి. భాషా నైపుణ్యం, జ్ఞాపక శక్తి, భావ వ్యక్తీకరణ, సామాజిక నైపుణ్యాలు, ఇవి ప్రత్యక్ష మానవ సంబంధాల ద్వారానే మెరుగుపడతాయి. కానీ అధిక స్క్రీన్ టైమ్ వల్ల పిల్లల్లో కొన్ని సమస్యలు పెరుగుతున్నాయని అంతర్జాతీయ పరిశోధనలు సూచిస్తున్నాయి.. ప్రపంచ దేశాలు ఈ అంశాన్ని గంభీరంగా పరిగణిస్తున్నాయి. అమెరికాలో 13 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా ఖాతాలపై పరిమితులు ఉన్నాయి. యూరోపియన్ యూనియన్ డిజిటల్ సేవల చట్టం ద్వారా పిల్లల రక్షణ కు కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. చైనా మైనర్లకు గేమింగ్ సమయాన్ని పరిమితం చేసింది. ఈ చర్యలు ఒక స్పష్టమైన సందేశం ఇస్తున్నాయి. సాంకేతికతను నిరాకరించడం కాదు, నియంత్రించడం అవసరం.

**నియంత్రణ–బాధ్యత కుటుంబం నుంచి విధానాల వరకూ..**

పిల్లల డిజిటల్ అలవాట్ల నియంత్రణ రూపకల్పనలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకం. పిల్లలు చెప్పిన మాటల కంటే చూసిన ప్రవర్తనను ఎక్కువగా అనుసరిస్తారు. పెద్దలు ఎప్పుడూ ఫోన్‌లో మునిగితే, పిల్లలు కూడా అదే మార్గాన్ని అనుసరించడం సహజం. కాబట్టి కుటుంబం నుంచే నియంత్రణ ప్రారంభం కావాలి. ఇంట్లో స్క్రీన్ టైమ్‌పై స్పష్టమైన ప్రణాళిక ఉండాలి. భోజనం, నిద్ర సమయంలో పరికరాలను దూరంగా ఉంచాలి. కుటుంబ సభ్యులంతా కలిసి సంభాషణకు, పుస్తక పఠనకు, బహిరంగ ఆటలకు సమయం కేటాయించాలి. పిల్లలతో సోషల్ మీడియా గురించి తెరవెనుక చర్చించాలి. ఆన్‌లైన్‌లో ఎదురయ్యే ఇబ్బందులను వారు స్వేచ్ఛగా పంచుకునే వాతావరణం కల్పించాలి.నియంత్రణ కాకుండా దిశానిర్దేశం చేయాలి.

పాఠశాలలు కూడా బాధ్యత వహించాలి. డిజిటల్ సాక్షరతను పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి. ఆన్‌లైన్ భద్రత, సమాచార విశ్లేషణ, బాధ్యతాయుత వినియోగం వంటి అంశాలను బోధించాలి. హానికర కంటెంట్‌పై కఠిన నియంత్రణలు ఉండాలి. డిజిటల్ వ్యసనంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. కృత్రిమ మేధస్సు (AI) విద్యలో ఒక సాధనంగా ఉపయోగ పడాలి. కానీ అది స్వతంత్ర ఆలోచనకు ప్రత్యామ్నాయంగా మారకూడదు.

**మేధస్సును మేల్కొలిపే సమాజమే శక్తివంతం**

డిజిటల్ ప్రపంచాన్ని నిరాకరించడం సాధ్యంకాదు. కానీ దానిపై నియంత్రణ సాధ్యం. కుటుం బం జాగృతమైతే, పాఠశాల దిశానిర్దేశం చేస్తే, ప్రభుత్వం దృఢ విధానాలు అమలు చేస్తే..మన భవిష్యత్ తరాలు మానసికంగా ఆరోగ్యవంతమైనవిగా, సృజనాత్మకంగా, బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారు. నియంత్రిత డిజిటల్ వినియోగమే సృజనాత్మక భారత భవిష్యత్తుకు భరోసా.

**మేకిరి దామోదర్**, 9573 666650.

# వినండి... వినండి.. ఉల్లాసంగా, ఉత్సాహంగా!




రేడియో నిన్నటి తరానికి నోస్టాల్జియా, నేటి తరానికి మేనియా, రేపటి తరానికి ఉటోపియా. మొత్తంగా చెప్పాలంటే రేడియో అనేది తరాల్ని కలిపే ఒక భావోద్వేగం. ప్రయాణంలో కారులో, చేతిలో ఉన్న ఫోన్లో మనతో పాటు నడిచే మౌన సహచరి. కలత చెందిన మనసుకు ఓదార్పు, ఆనంద క్షణాల్లో తోడు, సమాచారానికి చేదోడు, కబుర్లు చెప్పే నెచ్చెలి – ఇదే రేడియో ప్రత్యేకత. ఒకప్పుడు రేడియోనే జీవితం. ఉదయాన్నే సిగ్నేచర్ ట్యూన్‌తో సుప్రభాతం, మధ్యాహ్నం కార్మికుల కార్యక్రమాలతో ఉత్సాహం, సాయంత్రం జనరంజక కార్యక్రమాలు, రాత్రి హాయిగా నిద్రపుచ్చే స్వరాలు. రేడియో ప్రత్యేకత ఏమిటంటే, అది మన పనులకు అడ్డంకి కాకుండా, పనులతో పాటు నడిచేది. వింటూనే వంట, వింటూనే పని – అందుకే రేడియో అంత ప్రజాదరణ పొందింది. ఆధునిక కమ్యూనికేషన్‌కు పునాది వేసిన వాడు ఇటాలియన్ శాస్త్రవేత్త గుగ్లిఎల్మో మార్కోని. 1895లో తొలి వైర్‌లెస్ రేడియో సంకేతాన్ని ప్రసారం చేసి, 1909లో నోబెల్ బహుమతి అందుకున్నారు. ఆయన ఆవిష్కరణే రేడియో, టెలివిజన్, ఆధునిక ప్రసార వ్యవస్థలకు మూలస్తంభం. రేడియో అనేది కాలానికి అనుగుణంగా మారుతూ వచ్చిన సాంకేతిక అద్భుతం. ప్రపంచంలో జరిగే సంఘటనలను తక్షణమే ప్రజల చెంతకు చేర్చింది. భూత–వర్తమాన–భవిష్యత్ కాలాల్లో మానవుడికి అనధికారిక మిత్రుడిగా నిలిచిన అదృశ్య విజ్ఞానం ఇది. నేటికీ ప్రపంచ జనాభాలో 95 శాతానికి పైగా ప్రజలు రేడియో వినియోగిస్తున్నారన్నది గమనించాల్సిన నిజం. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 75 శాతం మందికి పైగా గృహిణులు సమాచారానికి రేడియోపై ఆధారపడుతున్నారు. రేడియో క్రేజ్ తగ్గింది అన్న మాటలకు ఇదే సమాధానం. రేడియో ఎవర్‌గ్రీన్. ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' ద్వారా దేశ ప్రజలతో మాట్లాడటమే రేడియో శక్తికి నిదర్శనం. ఎఫ్‌ఎం రూపంలో కొత్తతరం ప్రచార మాధ్యమాలతో పోటీ పడుతూ రేడియో నిలబడుతోంది. భారతదేశంలో రేడియో చరిత్ర కూడా గొప్పది. జూన్‌లో రేడియో క్లబ్ ఆఫ్ బొంబాయి ద్వారా తొలి ప్రసారాలు ప్రారంభమయ్యాయి. 1927లో కోల్‌కతా, ముంబయిలో ప్రయోగాత్మక ప్రసారాలు జరిగాయి. 1936లో ఆకాశవాణి ప్రభుత్వ సంస్థగా ఏర్పడింది. స్వాతంత్ర్యం సమయానికి కేవలం ఆరు కేంద్రాలే ఉండగా, నేడు వందల కేంద్రాలు ఉన్నాయి. 1938లో మద్రాస్ ఆకాశవాణి కేంద్రంలో తెలుగు కార్యక్రమాలు ప్రారంభమైనప్పుడు తొలి మహిళా అనౌన్సర్ పున్నావజ్ఝల భానుమతి – 'రేడియో భానుమతి'గా ప్రసిద్ధి చెందారు. ఆమె కూతురు జ్యోత్స్న కూడా రేడియో ద్వారా శ్రోతల అభిమానాన్ని పొందారు. రేడియో కేవలం వినోద సాధనం మాత్రమే కాదు. అది స్వాతంత్ర ఉద్యమానికి ఆయుధం. భాగ్యనగర్ రేడియో, ఆజాద్ హింద్ రేడియో, ఆజాద్ రేడియోలు ప్రజలను జాగృతం చేసి బ్రిటిష్ పాలకులకు వణుకు పుట్టించాయి. యునెస్కో ఈ ఏడాది ప్రపంచ రేడియో దినోత్సవ నినాదంగా రేడియో – కృత్రిమ మేధను ఎంచుకుంది. ఎన్ని సాంకేతిక మార్పులు వచ్చినా, ఎన్ని ఏఐలు వచ్చినా, రేడియోకు అవి అదనపు హంగులే. ఎందుకంటే వినికిడి ద్వారా మనసును మేల్కొలిపే శక్తి రేడియోకే సొంతం.

*(ఫిబ్రవరి 13 ప్రపంచ రేడియో దినోత్సవం సందర్భంగా)*

సుధాకర్ ఎవి
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, ఎస్‌టియుటిఎస్
9000674747

## ఉద్యోగ భద్రత లేని లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి: బోనగిరి రూపేష్



**ప్రజాపక్షం/బెజ్జంకి:** ఉద్యోగ భద్రత లేని లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ అన్నారు.దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం సిపిఐ,ఏఐటీయూసి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని స్థానిక తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపై మండల సహాయ కార్యదర్శి సంగెం మధు,ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతవేణి మహేష్,రోడ్డ చరణ్,ఏఐటీయూసి మండల కార్యదర్శి పండుగ పర్శరాములు,కుంబం రాములు,బండి సమ్మయ్య,కార్మిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి: కమిషనర్




**ప్రజాపక్షం/కరీంనగర్:** నగరపాలక సంస్థ 66 డివిజన్ కు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. నగరపాలక సంస్థ 2వ సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం రోజు స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాలలో కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, సీపి గౌస్ ఆలం సమక్షంలో మాస్టర్ ట్రైనర్లు కౌంటింగ్ అధికారులు సిబ్బంది కి శిక్షణ నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులకు సిబ్బంది కి ఓట్ల లెక్కింపు విధి విధానాల పై దిశా నిర్దేశం చేశారు. ఓట్ల కౌంటింగ్ ప్రక్రియలో పాటించాల్సిన నిబంధనల పై పలు సూచనలు చేస్తూ, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, నగరపాలక సంస్థ ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎన్నికల సంఘం నియమ నిభంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ సర్వం సిద్ధం చేశామని తెలిపారు. స్థానిక ఎస్ ఆర్ ఆర్ కళాశాల ఇండోర్ స్టేడియంలో శుక్రవారం రోజు ఉదయం 66 డివిజన్లకు సంబంధించిన ఓట్ల లెక్కింపు 8:00 గంటలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ సుపర్ వైజర్లు, అసిస్టెంట్ సూపర్ వైజర్లు కలుపుకొని మొత్తం 300 మంది కౌంటింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ సెంటర్ లో మొత్తం 66 ఏర్పాటు చేయడం జరుగుతుందని... మొదటగా ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్లను లెక్కించడం జరుగుతుందని, తదనంతరం బ్యాలెట్ లెక్కింపు జరుగుతుందని తెలిపారు. 1000 ఓట్లకు ఒక రౌండ్ చొప్పున పలితాలను వెల్లడించడం జరుగుతుందని తెలిపారు.రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపా రు. ఈ కార్యక్రమంలో ఎన్నికల కౌంటింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఏసిపి



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన సుల్తానాబాద్ మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని గురువారం పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని ఏసిపి తెలిపారు. అనంతరం అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి లతోపాటు సుల్తానాబాద్ ఎస్సై చంద్రకుమార్ మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు పటిష్ఠ బందోబస్తు: ఎస్పి

### విజయోత్సవ ర్యాలీలు పూర్తిగా నిషేదం

**ప్రజాపక్షం/జగిత్యాల :** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు 450 పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్ఆర్ కళాశాల ఆవరణలో ఉన్న కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్‌తో కలిసి ఎస్పీ గురువారం పరిశీలించి మాట్లాడారు. ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మూడంచెల భద్రత నిర్వహిస్తున్నట్లు వివరించారు. సెక్షణ్ అమలులో ఉన్న సమయంలో ధర్నాలు, రస్తారకోలు, ఊరేగింపులు, టపాకాయలు కాల్చడం, సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు పూర్తిగా నిషేదమన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు కేంద్రం సమీప పరిసర ప్రాంతాలను డాగ్స్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. గుర్తింపు కార్డులు ఉన్న వారినే కౌంటింగ్ కేంద్రాలకు అనుమతిస్తామని ప్రతి ఒక్కరూ పోలీస్ అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రఘ చందర్, రాములు తదితరులు ఉన్నారు.

## యువకుడు ఆత్మహత్య



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** పురుగుల మందు తాగి యువకుడు మృతి చెందిన ఘటన సుల్తానాబాద్ మండలంలోని రాముడు పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మండలం రాముని పల్లి గ్రామానికి చెందిన ముడతనపల్లి చరణ్ వయసు 25 సంవత్సరాలు అనునతడు హైదరాబాదులో ఎంసీఏ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు.అతనితో చదువుకున్న వాళ్లకు ఉద్యోగాలు వచ్చి ఇతనికి ఉద్యోగం రాలేదు అన్న బాధతో మనస్థాపం చెంది ఈనెల 5 రోజున వాళ్ళ పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగగా అతన్ని సుల్తానాబాద్ హాస్పిటల్ కి తరలించగా అక్కడి నుంచి రిఫర్ చేయడంతో హైదరాబాద్ లోని రెనోవ హాస్పిటల్ లో ఎన్ని రోజులు చికిత్స పొందుతూ గురువారము రాత్రి ఒంటిగంట సమయంలో మృతి చెందడం జరిగింది.మృతుడు చరణ్ తండ్రి ముడతనపల్లి సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు.

# నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

### ఎఐటియుసి గౌరవాధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గురువారం రోజున సింగరేణి కార్మికుల ఆధ్వర్యంలో సింగరేణి ఆర్ జీవన్ ఏరియాలోని జీడికే 2వ ఇంక్లైన్లో పాల్గొని అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని, తెలంగాణ లోని బొగ్గు గనులను సింగరేణికి కేటాయించాలని, బొగ్గు ఉత్పత్తిని పర్మినెంట్ కార్మికులతో చేయించాలని, సొంత ఇంటి పథకం అమలు చేయాలని, పెర్క్స్‌పై ఇన్ కం ట్యాక్స్ యాజమాన్యమే చెల్లించాలని, ప్రతి నెలా మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి, కారుణ్య ని యామకాలు చేపట్టాలని, మారుపేర్లు విజిలెన్స్ కేసుల కార్మికుల డిపెండెంటు లకు ఉద్యోగాలు ఇవ్వాలని, డిస్మిస్ ఐన కార్మికులకు ఒక సారి అవకాశం కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై మండిపడ్డారు. నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, సహాయ కార్యదర్శి రంగు శ్రీను, నాయకులు సంకె అశోక్, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న అజీం పాషా, బండి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను హరిస్తున్న కొత్తకోడ్‌లను ఎత్తివేయాలి



**ప్రజాపక్షం/ధర్మపురి :** కార్మికుల హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్ లు,భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త నిరసనలో భాగంగా గురువారం జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులు కదంతొక్కారు.ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు ముదుగం రాజలింగం నేతృత్వంలో మున్సిపల్, పంచాయతీ కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజలింగం మాట్లాడుతూ..పోరాడి సాధించుకున్న లేబర్ చట్టాలను కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.ప్రజా,కార్మిక,రైతు వ్యతిరేక విధానాలను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.అనంతరం కార్మికులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ముదుగం రాజలింగం, బదుగు లచ్చయ్య, దూడ గంగయ్య,ముదుసుల సత్తయ్య, రవి,రాజు లు పాల్గొన్నారు.

## కౌంటింగ్ అధికారులు, సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి


### ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కౌంటింగ్ అధికారులు, సిబ్బంది ర్యాండమైజెషన్ ప్రక్రియ గురువారం పూర్తి చేశారు. జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ప్రక్రియను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, ఈడీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సిరిసిల్ల ఆర్‌డిఓ కార్యాలయం ముందు ఆందోళనలు

### నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి
### కార్మిక సంఘాల నాయకుల డిమాండ్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సిరిసిల్ల ఆర్డిఓ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమం చేపట్టి ఆర్డిఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాంట్రాక్టు ఉద్యోగులకు 26వేల కనీస వేతనం చెల్లిస్తూ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులకు ప్రతినెల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక విధానాలు ఉపసంహారించుకోవాలని, ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని అన్నారు. ఉపాది హామీని పట్టణాలకు విస్తరించి, సంవత్సరంలో 200 రోజుల పని దినాలు కల్పిస్తూ, రోజుకు 600 రూపాయలు ఇవ్వాలని కోరారు. పవర్లూం కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో ప్రకారం 10గంటల పని విధానం, వారంలో 48 గంటలు పని కల్పించాలన్నారు. నైట్ డ్యూటీ రద్దు చేయాలని, వర్క్ టూ ఓనర్ పథకం వెంటనే అమలు చేసే, త్రిఫ్ట్ పథకంలో అమలు చేయాలన్నారు. 50 సంవత్సరాల వయస్సు నిండిన కార్మికులకు 5వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనగన్వాడీ లను రెగ్యులరైజ్ చేయాలన్నారు. సివిల్ సప్లై కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి హమాలి కార్మికులకు పని భద్రత కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, పోచయ్య, వడ్డెపెల్లి లక్ష్మ ణ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ, విమల, నాయకులు ఆకుల రాములు, ఏఐటీసీయూ రాష్ట్ర నాయకులు సోమిశెట్టి దశరథం, తదితర నాయకులు పాల్గొన్నారు.

## మెజారిటీ స్థానాలు బిజెపికే

### కేంద్ర మంత్రి బండి సంజయ్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ కార్పోరేషన్ ఫలితాల్లో మెజారిటీ స్థానాలు బీజేపీ కైవసం చేసుకోబోతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. యావత్ దేశమంతా కరీంనగర్ ఫలితాలవైపు చూస్తోందన్నారు. బీజేపీకి అనుకూల ఫలితాలు రాబోతున్నాయని, కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుని చరిత్ర సృష్టించబోతున్నామని చెప్పారు. కరీంనగర్ లోని రాజశ్రీ గార్డెన్‌లో బీజేపీ కార్పోరేటర్ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో గురువారం బండి సంజయ్ కుమార్ సమావేశమయ్యారు. బాస సత్యనారాయణ, సునీల్ రావు, గుగ్గిళ్ల రమేష్, నేతలు రమేష్, మల్లేశం, శ్రీను హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కరీంనగర్‌లో బీజేపీకి మెజారిటీ స్థానాలు రాబోతుండటంతో అధికార కాంగ్రెస్‌లో కలవరం మొదలైంది. ప్రలోభాలకు గురిచేసి బీజేపీ కార్పొరేటర్లను గుంజాలని చూస్తోంది. అప్పుడే కాంగ్రెస్ నేతలు ఫోన్లు చేస్తూ ప్రలోభాల స్కెచ్‌కు తెరదీశారు.జాగ్రత్తగా ఉండండి అని సూచించారు.

## వేములవాడ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా పక్కా

### ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/వేములవాడ:** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలనీ అందరూ బాగా పని చేశారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరవేస్తూ ఎన్నికల్లో ఓట్లు అభ్యర్థించారు. వేములవాడ మున్సిపల్ పై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయం. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున హృదయపూర్వక ధన్యవాదాలు. మొన్నటి ఎన్నికల్లో జరిగిన వాటిపై పార్టీ సమీక్ష చేస్తుంది. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఇంకా బలోపేతం కోసం కృషి చేస్తున్నాం, మొన్నటి ఎన్నికల ప్రచారంలో పలు వార్డులలో తిరిగినప్పుడు చాలా సమస్యలు అలానే ఉన్నాయి. గత పాలకులు వేములవాడ పట్టణంలో ప్రతి వార్డులో సమస్యలను గాలికి వదిలేశారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న వేములవాడ పట్టణాన్ని అభివృద్ధి చేస్తాం. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుంది.కష్టపడితే ప్రజలు తప్పకుండా గుర్తిస్తారు. బీజేపీ బిఆర్ఎస్ ఫెవికల్ బంధంతో కాంగ్రెస్ పార్టీ పై అసత్యపు ఆరోపణలు చేశారు. వారు ఓడిపోతున్నారని బయపడి గిచ్చి కయ్యం పెట్టుకోవాలని చూశారు.కానీ మనం రెండు సంవత్సరాలలో వేములవాడ పట్టణంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ముందుకు పోయాం. గత పాలకులు ఎమ్మెల్యే పదవిని హోదాకు చిహ్నంగా వాడుకున్నారు, కానీ నేను దానిని ప్రజల కోసం ఉపయోగిస్తున్నాను.ప్రజలు మనం చేస్తున్న అభివృద్ధి పనులు చూసి మన వెంట నడిచారు, ప్రతి ఒక్కరూ పార్టీ నిర్ణయనికి కట్టుబడి ఉండాలి.కౌన్సిలర్ అభ్యర్థులు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజ సేవ చేయాలి,మీరు ప్రచార సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేద్దాం.ఈ ఎన్నికల టికెట్ ఆశించి రాని వారికి నేను అండగా ఉంటా. భవిష్యత్తులో ఏ ఎన్నిక జరిగినా కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం ప్రతి ఒక్కరూ పాటు పడాలి. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ పేరు పేరున హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సమావేశంలో పాల్గొన్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, 28 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు, బిఎల్‌ఏ, ఎన్రోలర్‌లు పాల్గొన్నారు.

## మాతా, శిశు కేంద్రంలో మరిన్ని పడకలు

### కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మరిన్ని పడకలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆసుపత్రి సూపరింటెండెంట్ ను ఆదేశించారు. సాధారణ ప్రసవాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తప్పనిసరి అయితేనే సిజేరియన్ చేయాలని వైద్య బృందానికి సూచించారు. కరీంనగర్ మాత శిశు సంరక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. గర్భిణీలు, పిల్లల వార్డును సందర్శించి వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇక్కడి సమావేశ మందిరంలో గైనకాలజిస్టులు, అనస్తీసియా, పిల్లల వైద్యులు, రేడియాలజిస్టులు తదితరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎక్కువ సంఖ్యలో సాధారణ ప్రసవాలు జరగడం విశేషమని అన్నారు. ఆదిలాబాద్ తర్వాత జిల్లాలోని పిహెచ్సిల్లో ప్రసవాల సంఖ్య ఎక్కువగా ఉందని తెలిపారు. అదేవిధంగా మాత శిశు సంరక్షణ కేంద్రంలో డెలివరీల సంఖ్య ఎక్కువగా ఉందని తెలిపారు. అయితే సాధ్యమైన మేర సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గర్భిణికి ముందు నుంచే సాధారణ ప్రసవం ఆవశ్యకతను ఏఎన్ఎం, ఆశా వర్కర్ల ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించాలని తెలిపారు. శుక్రవారం సభలకు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది హాజరై సాధారణ ప్రసవం ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రతి గర్భిణీకి టీఫా స్కాన్ తప్పనిసరి అని తెలిపారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మరొక టీఫా మిషన్ తెప్పించేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతా శిశు కేంద్రంలో అవసరమైన వైద్య పరికరాల జాబితా సమర్పించాలని, వాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఆర్ఎంవో నవీనా, ప్రోగ్రాం అధికారి సనా, వివిధ విభాగాలకు చెందిన వైద్యాధికారులు పాల్గొన్నారు.

## సుల్తానాబాద్ పట్టణాన్ని అభివృద్ధి చేసి చూపుతాం

### ఎమ్మెల్యే విజయ రమణారావు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** కాంగ్రెస్ పార్టీపై ప్రజల కు ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇచ్చిన మాట ప్రకారం సుల్తానాబాద్ పట్టణాన్ని అభివృద్ధి చేసి చెబుదామని పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు అన్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సరళిని ఎమ్మెల్యే విజయ రమణారావు శివపల్లి గ్రామంలోని తన నివాసంలో పార్టీ అభ్యర్థులు, నాయకులతో కలిసి సమీక్షించారు. శుక్రవారం జరిగే కౌంటింగ్ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు కార్యకర్తలకు తీసుకునే జాగ్రత్తలు, పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ మున్సిపల్ లోని 15 వార్డులను కాంగ్రెస్ కైవసం చేసుకుని మున్సిపల్‌పై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తుందని పేర్కొన్నారు. దాదాపు 20 రోజులుగా పార్టీ విజయం కోసం అహర్నిశలు కష్టపడి కృషి చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ఇన్చార్జులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీని ఆదరించిన ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రానున్న రోజుల్లోనూ సుల్తానాబాద్ పట్టణ అభివృద్ధి ధ్యేయంగా పని చేసి మరింతగా ప్రజల మన్నలను పొందుతామని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మినిపల ప్రకాష్ రావు, ఓదెల ఆలయ చైర్మన్ చికట్ల మోండన్న, ఉట్ల వర ప్రసాద్, సాయిరి మహేందర్, డాక్టర్ రమేష్ వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, కౌన్సిలర్ అభ్యర్థులు సర్పంచ్‌లు, ఎన్నికల ఇంచార్జులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## గెలుపెవరిదో..?

### ఎక్కడ చూసినా ఇదే చర్చ..
### ప్లస్, మైనస్‌లపై విశ్లేషణలు

**ప్రజాపక్షం/కరీంనగర్:** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఓటు.. బ్యాలెట్ లో నిక్షిప్తమైంది. అభ్యర్థులంతా ఎక్కడ ప్లస్.. ఎక్కడ మైనస్.. అంటూ లెక్కల్లో నిమగ్నమయ్యారు. సర్వేలు, ఏజెంట్ల నుంచి వచ్చిన సమాచారంతో గెలుపోటములను తమదైన శైలిలో విశ్లేషించుకుంటున్నారు. మరో వైపు ఓటర్లు సైతం ఫలితాలపై ఆసక్తి గా చర్చించుకుంటున్నారు. ఏ గల్లీలో చూసినా.. ఏ ఇద్దరు ఒకచోట చేరినా ఇదే చర్చ నడుస్తోంది. చాయ్ హోటళ్ల వద్ద నేడు వెల్లడయ్యే ఫలితాలపైనే చర్చలు.. ఎవరు గెలుస్తారు.. ఏ పార్టీకి మెజారిటీ వస్తుంది.. అంటూ తమ అంచనాలను విశ్లేషించుకుంటున్నారు.

**ఓటర్లకు చేరిందా.. లేదా...**

బరిలో నిలిచిన అభ్యర్థులు ఓటర్ల కోసం అందించిన తాయిలాలు పూర్తిస్థాయిలో వారికి చేరాయా..వారి మనసు మనం గెలుచుకోగలిగామా..ఓటు మనకే పడిందా.. ఎక్కడైనా తేడా వచ్చిందా అనే ఆలోచనలో నిమగ్నమయ్యా రు.

**సర్వేలపైనే సర్వత్రా చర్చ...**

పోలింగ్ ముగిసిన వెంటనే బయటికి వచ్చిన పలు సర్వేలు ఇప్పటికే సోషల్ మీడియాను ముంచెత్తాయి. వీటిని ఎవరికి అనుకూలంగా వారు తమ అనుచర గణంతో వాట్సాప్, ఫేస్‌బుక్ ల్లో పోస్ట్ చేయించారు. ఓటర్ దేవుడు తమనే అనుగ్రహించాడంటూ కొందరు ఇప్పటికే సంబరాలకు సిద్ధమవుతున్నారు. సర్వేల నేపథ్యంలో ఆయా పార్టీలు సైతం తమ అభ్యర్థులను శిబిరాలకు తరలించే పనిలో నిమగ్నమయ్యాయి. రిజల్ట్స్ వెలువడిన వెంటనే తమ ప్రణాళికలు పకడ్బందీగా అమలు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. కరీంనగర్ కార్పొరేషన్ ఈసారి ఏ పార్టీ కూడా మ్యాజిక్ ఫిగర్ చేరుకోదు అనే సర్వేల నేపథ్యంలో రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారింది. కరీంనగర్ కార్పోరేషన్ లోని 66 స్థానాల్లో బిజేపి, కాంగ్రెస్, బీఆర్ఎస్, సిపిఐ, ఎంఐఎం, పార్వర్డ్ బ్లాక్ పార్టీతో పాటు స్వతంత్రులు పోటీలో ఉన్నారు. ప్రధాన పార్టీలు మ్యాజిక్ ఫగర్ కు చేరుకోక పోతే ఇతర పార్టీల పైన ఆధారపడాల్సి వస్తుంది.

**ఎవరి ధీమా వారిదే...**

కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం.. జిల్లా కేంద్రం పైనే పూర్తిస్థాయి ఫోకస్ పెంచడంతో ఈసారి మెజార్టీ సీట్లు సాధిస్తామని ఆ పార్టీ చెబుతుంది. మరో వైపు హస్తం పార్టీ కూడా కార్పొరేషన్ పై జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేస్తుండగా, స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల సారథ్యంలో గట్టి పోటీ ఇచ్చామని తామే కీలకంగా మారనున్నట్లుగా బీఆర్ఎస్లో చర్చ నడుస్తుంది. ఒకవేళ మ్యాజిక్ ఫిగర్ కు ప్రధాన పార్టీలు దూరంగా ఉంటే ఎంఐఎం తో పాటు ఇతర పార్టీలు, ఇండిపెండెంట్లు కీలకంగా మారే అవకాశం కనిపిస్తుంది. ఏది ఏమైనా ఈ ఉత్కంఠకు తెరపడాలంటే మరి కొన్ని గంటలు ఆగాల్సిందే.

# పకడ్బందీగా మున్సిపల్ కౌంటింగ్ ఏర్పాట్లు

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దీపక్

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొరకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో బజార్ ఏరియాలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోగల చెన్నూర్ పట్టణంలో గల అటవీశాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్‌కెసిఓఎ క్లబ్‌లో, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల కౌంటింగ్ కొరకు అదనపు సిబ్బందితో కలిపి 66 మంది మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 132 మంది కౌంటింగ్ సహాయకులు, బెల్లంపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 19 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 37 మంది కౌంటింగ్ సహాయకులు, చెన్నూర్ మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి పది మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 20 మంది కౌంటింగ్ సహాయకులు, క్యాతనపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 24 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 48 మంది కౌంటింగ్ సహాయకులు, లక్షెట్టిపేట మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 9 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 18 మంది కౌంటింగ్ సహాయకులను రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించడం జరిగింధని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ బెల్లంపల్లి మునిసిపాలిటీకి



సం బంధించి 34 వార్డులకు గాను 17 ఏర్పాటు చేసి రెండు రౌండ్లలలో పూర్తి చేయడం జరుగుతుందన్నారు. చెన్నూర్ మున్సిపాలిటీకి సంబంధించి 18 వార్డులకు 9 ఏర్పాటు చేసి రెండు రౌండ్లలో పూర్తి చేయ డం జరుగుతుందని, లక్షెట్టిపేట మునిసిపాలిటీకి సంబ ంధించి 15 వార్డులకు గాను 8 ఏర్పాటు చేసి రెండు రౌండ్లలో, క్యాతనపల్లి మున్సిపాలిటికి సంబంధించి 22 వార్డులకు 22 ఏర్పాటు చేసి ఒక వేయి ఓట్ల చోప్పున రె ండు రౌండ్లలో పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. మంచిర్యాల నగరపాలక సంస్థకు సంబంధించి 60 వార్డులకు గాను 60 ఏర్పాటు చేసి రౌండ్‌కి వెయి ఓ ట్ల చొప్పున లెక్కించడం జరుగుతుందని తెలిపారు. ప్రశాంత వాతావరణలో సజావుగా సాగేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## ఎన్నికల కౌంటింగ్‌లో ఆర్వోల పాత్ర కీలకం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం మెదక్ :** మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రయలో ఆర్వోలు, సూపర్వైజర్లు, అసిస్టెంట్ సూపర్వైజర్లు, మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్ ఎన్నికల అధికారులకు సూచించారు. గురువారం వెస్లీ పాఠశాలలోని మున్సిపల్ ఎన్నికల స్ట్రాంగ్ రూమును,కౌంటింగ్ హాలును జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, డిఎస్పీ ప్రసన్నకుమార్, ఆర్డీవో రమాదేవితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ కు పోలీస్ మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఓట్ల లెక్కింపు రౌండ్ల వారీగా, వారీగా ప్లెక్సీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెదక్ తహసిల్దార్ లక్ష్మ ణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి ఆర్వోలు సూపరైజర్లు అసిస్టెంట్ సూపర్వైజర్లు పాల్గోన్నారు.

## కౌంటింగ్ సిబ్బందికి ఏర్పాటైన శిక్షణా తరగతుల సందర్శన

జిల్లా ఎన్నికల అధికారి,
కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో రిటర్నింగ్ అధికారులకు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయ సూపర్‌వైజర్లకు గురువారం ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను కలెక్టర్ సందర్శించి ఓట్లలెక్కింపు ప్రక్రియను నిర్వహించాల్సిన విధానంపై కీలక సూచనలు చేశారు. అదేవిధంగా బోధన్‌లోని విజయ మేరీ హైస్కూల్‌లో కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను సైతం కలెక్టర్ సందర్శించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ భావోద్వేగాలతో ముడిపడి ఉన్నందున ఎంతో జాగ్రత్తతో బాధ్యతాయుతంగా కౌంటింగ్ విధులు నిర్వహించాలని కలెక్టర్ హితవు పలికారు. ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లతో పాటు సపోర్టింగ్ స్టాఫ్‌ను నియమించామన్నారు. ఆయా మున్సిపాలిటీ పరిధిలో పోలైన ఓట్లను రౌండ్ల వారిగా లెక్కించేందుకు వీలుగా రాష్ట్ర ఎ న్నికల సంఘం ఆదేశానుసారం అదనపు సిబ్బందిని సైతం రిజర్వులో ఉంచామన్నారు. ఉదయం 7 గంటలలోగా కౌంటింగ్ సెంటర్ల వద్దకు రావలని కలెక్టర్ సూచించారు. తాము జారీ చేసిన ఎంట్రీ పాసులతో పాటు ఏదైనా గుర్తింపు కార్డును వెంటతెచ్చుకోవాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పాసు కలిగిన ఉన్న వారినే కౌంటింగ్ సెంటర్‌లోకి అనుమతించటం జరుగుతుందన్నారు.అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు.సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీఓ రాజేంద్రకుమార్, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్ కుమార్, బోధన్ మున్సిపల్ కమీషనర్ జాదవ్‌కృష్ణ ఉన్నారు.




## కౌంటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు

**ప్రజాపక్షం మెదక్ :** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా చివరి అంకమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.జిల్లాలో నాలుగు చోట్ల ఓట్ల లెక్కింపు కేంద్రాలను సిద్ధం చేసింది. జిల్లాలోని మెదక్, రామయంపేట్, నర్సాపూర్, తూప్రాన్ మున్సిపాలటీలల్లో 74 వార్డులకు ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. నాలుగు మున్సిపాలిటీలో 286 మంది అభ్యర్ధులు పోటీ చేస్తున్నారు. జిలాలో మొత్తం 69823 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మెదక్ మున్సిపాలిటీలో 31 వార్డులకు 112 మంది అభ్యర్ధులు ఎన్నికలల్లో పోటీ చేశారు. నర్సాపూర్ మున్సిపాలిటీలో 15 వార్డులకు 63 మంది అభ్యర్ధులు పోటీలో ఉన్నారు. తూప్రాన్ మున్సిపాలిటీలో 16 వార్డులకు 64 మంది అభ్యర్ధులు బరిలో ఉన్నారు. రామయంపేట్ మున్సిపాలిటీలో 12 వార్డులకు 48 మంది అభ్యర్ధులు ఎన్నికలల్లో పోటీ చేశారు. 74 వార్డులకు సంబంధించిన అభ్యర్ధుల భ్యవితవ్యం నేడే తెలనుంది. మెదక్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం నాలుగు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి ప్రక్రియ ప్రారంభించి ఫలితాలను సాయంత్రం వరకు వెల్లడించనున్నారు. మెదక్ మున్సిపాలిటీకి 31 వార్డులకు సంబంధించి జిల్లా కేంద్రంలోని వెస్లీ జూనియర్ కళశాలలో ఓట్ల లెక్కింపు కోసం కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. నర్సాపూర్ మున్సిపాలిటీలో ఉన్న 15 వార్డుల ఓట్ల లెక్కింపుకు బి.వి.ఆర్ ఐ.టి కాలేజ్ లో ఏర్పాటు చేశారు. అలాగే తూప్రాన్ మున్సిపాలిటీ 16 వార్డుల ఓట్ల లెక్కింపు కోసం నోబెల్ ఫార్మా కాలేజీ లింగారెడ్డిపల్లి లో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. రామయంపేట్ మున్సిపల్ 12 వార్డులకు సంబందించి ఎంపీడీవో కార్యాలయంలో కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పోలీస్ యాంత్రంగం గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.




## ఖానాపూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ..

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్క కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసిన డిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్యే వెడ్మ జొజ్జు పటేల్.ఖానాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని,ఎనిమిది నుండి తొమ్మిది స్థానాలు గెలుస్తుందని,టిఆర్ఎస్ బిజెపి పార్టీల ఎన్ని అవంతరాలు చేసిన కార్యకర్తలను ఎంత బెదిరించిన కాం గ్రెస్ పార్టీ తమ శక్తివంతం లేకుండా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేశారని, ప్రతిపక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నిన అధికారం కాంగ్రెస్ పార్టీదేనాని,గెలుపు పై నమ్మకం లేకనే ప్రతిపక్షాలు క్యాంపు రాజకీయాలు చేస్తున్నాయని ఎలాంటి భయం లే కుండా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు రమేష్,అనిష్కన్,అమానుల ఖాన్, రాజేశ్వర్,నేత శ్యాం,గంగనర్సయ్య,లక్ష్మి పతి,లక్ష్మ ణ్, పాల్గొన్నారు.



## నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

ఎఐటియుసి,టియుసిఐ ఆద్వర్యంలో జిల్లా కేంద్రంలో భారీ కార్మిక ప్రదర్శన ..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను కార్మిక వర్గానికి మరణశాస నం లాంటిది అని తక్షణమే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మెలో భా గంగా జిల్లా కేంద్రంలో టి.యు.సి.ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ భవన్లో సదుస్సు ఏర్పాటుచేసి,మంచిర్యాల్ చౌరస్తా వరకు ర్యాలీ జరిగింది.ఈ సందర్భంగా టి.యు.సి.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.రాజన్న,ఏఐటీయూసీ ఎస్.ఎన్ రెడ్డి మాట్లాడుతూ కాంటాక్ట్ వర్కర్స్ పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని వారికి 26వేల రూపాయలు ఇవ్వాలని ఔ ట్సోర్సింగ్ కాంట్రాక్టు వర్కర్స్ కార్మికులను రెగ్యులేషన్ చేయాలని ఎనిమిది గంటల పని దినాన్ని కొనసాగించాలని,కార్మికులకు భద్రత సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలు కార్మిక చట్టాలు లేని దేశంగా మార్చాలని కార్మికుల్ని నిరాయుధులను చేసి పెట్టుబడుదారులు పారిశ్రామికవేతలకు కార్పొరేట్లకు బంగారు పళ్లెములు పెట్టి బహుమాన ఇచ్చేందుకు సిద్ధమన్న సిద్ధమైందని వా రు తెలిపారు.పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడానితీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.టియుసిఐ జిల్లా కోశాధికారి ఎండి గఫూర్,పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి కట్ట లక్ష్మి ,టి.యు.సి.ఐ జిల్లా నాయకులు గంగామణి,భూషణ్,గంగన్న,రాజేందర్, ఫెరోజ్,లక్ష్మి ,ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు పద్మ కుమారి ,ఎస్ఎన్‌రెడ్డి,భూఖ్య రమేష్,సంజీవ్, పాల్గొన్నారు.




## మూడంచెల భద్రత ఏర్పాటు : ఎస్‌పి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత ప్రశాంతంగా,పారదర్శకంగా పూ ర్తి చేసేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని రకాల కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేసింది.ఈ మేరకు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,ఐపీఎస్ కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతా చర్యలను స్వ యంగా పర్యవేక్షించి,అధికారులకు కీలక ఆదేశా లు జారీ చేశారు.మున్సిపల్ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో మూడంచెల భద్రతను() ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.కేంద్రం లోపలికి కేవలం ఎన్నికల కమిషన్ జారీ చేసిన అనుమతి పత్రాలు కలిగిన సిబ్బందిని,అభ్యర్థులను వారి ఏజెంట్లను మాత్రమే తనిఖీ చేసిన తర్వాత అనుమతిస్తామని ఆమె స్పష్టం చేశారు.ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కౌంటింగ్ కేంద్రం వైపు వచ్చే దారుల్లో బారికేడింగ్‌ను ఏర్పాటు చేయడంతో పా టు,వాహనాల నిలుపుదల కోసం ప్రత్యేక పా ర్కిం గ్ స్థలాలను కేటాయించారు.ప్రజలకు ,వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముం దస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్పి వివరించారు.ఈ సందర్భంగా భద్రతా విధుల్లో ఉన్న సిబ్బందికి,అధికారులకు విధివిధానాలపై ఆమె దిశానిర్దేశం చేశారు.బందోబస్తులో భాగంగా అదనపు బలగాలను,గస్తీ బృందాలను నిరంతరం పర్యవేక్షించేలా మోహరించారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీతో పాటు బైం సా ఏఎస్పీ రాజేష్ మీనా ,నిర్మల్ ఏఎస్పీ సాయి కిరణ్,పలువురు ఇన్స్పెక్టర్లు,ఆర్.ఐ లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్లతో కార్మిక హక్కులు నిర్వీర్యం

ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రకాష్‌రావు

**ప్రజాఫక్షం /సంగారెడ్డి :** ప్రజల కష్టారితమైన దేశ సంపదను కార్పోరేట్ శక్తులను మోడి ప్రభుత్వం దార దత్తం చేస్తోందని.,దేశవ్యాప్తి సార్వత్రిక సమ్మెతో మోడీ ప్రభుత్వం కళ్లు తెరవాలని ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు వీర్లప్రకాష్‌రావు అన్నారు. సంగారెడ్డి లో సమ్మె సందర్భంగా బారీ బైక్‌ర్యాలీసభ,.. కార్మికుల ఆటా,పాట ,వంటవార్పు లేబర్ కోడ్లతో కార్మిక హక్కులు హత్య చేయబడతాయని ,హైర్ అండ్ ఫైర్ తో శ్రమ దోపిడికి చట్టబద్ధత కల్పించడమే తప్ప మరొకటి కాదని వీర్లప్రకాష్‌రావు అన్నారు. గురువారం సంగారెడ్డి లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వీర్లప్రకాష్‌రావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఆడ్డుకోవడానికి కార్మికులంతా ఏకం కావాలన్నారు. కార్మికుడి కడుపు ,ఆకలి, హక్కుల పోరాటంలో పాల్గొనని బిఎంఎస్ కార్మిక వ్యతిరేక అన్నారు. ఇప్పటి వరకు ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికులను మరింతగా దోచుకునే విధంగా లేబర్ కోడ్లు రూపొందించాలన్నారు. లేబర్ కోడ్ల ద్వారా వేతనాల నిర్ణయంలో ఉన్న త్రైపాక్షిక విధానాన్ని రద్దు చేసి ఒకే దేశం ,ఒకే వేతనం పేరుతో రోజుకు రూ. 176 కనీస వేతనం నిర్ణయిచడం ద్వారా కార్మికుల ఆదాయం తగ్గె పరిస్థితి ఏర్పడిందని అలాగే పని గంటలను 8 నుంచి 12కు పెంచి ఓవర్‌టైంకు అదనపు వేతనం చెల్లించకుండా చేస్తున్నారని ట్రేడ్ యూనియన్ నమోదు నిబందనలను కఠినతరం చేసి,కార్మికల సంఘటిత శక్తి ని దెబ్బతీస్తున్నయని పరిశ్రమల లేఆఫ్ ,లాకౌట్ మూసివేతలకు సంబందించిన నిబందనలను సడలించి యజమానులకు అనుకూలంగా మార్చారని ఈఎస్ఐ ,పిఎఫ్, బోనస్, వంటి హక్కులను కాంట్రాక్ట్ కార్మికుల నుంచి క్రమంగ తొలగించే విధంగా కోడ్లు రూపొదించారని అనేక రాష్ట్రాల్లో ఉన్న కార్మిక సంక్షేమ బోర్డులను రద్దు చేసి కార్మికుల విద్య ,వైద్యం, వివాహ, ప్రసూతి సహాయాలను నిలిపిచేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ,వ్యవసాయ చట్టాలను రద్దు చేసినట్లు ప్రకటించనప్పటికి దోడ్డి దారిగా అమలు చేస్తున్నారని రైతుకు గిట్టుబాటు ధర లేకుండా ఎరువులు ,పురుగుమందులు విత్తనాలు ధరలు పెంచి రైతులకు మోసం చేస్తుందని ఉపాది హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడంతో గ్రామీణ పేదలకు ఉపాది భరోసా లేకుండా పోయిందని లేబర్ కోడ్ల ద్వారా తనిఖీ వ్యవస్థను నీర్వీర్యం చేయడంతో గ్రామీణ పేదలకు ఉపాది భరోసా లేకుండా పోయిందని లేబర్ కోడ్ల ద్వారా తనిఖీ వ్యవస్థను నిర్వీర్యం చేసి కార్మికులకు శిక్ష అనే విధానాన్ని అమలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. సామాన్య ప్రజలను విస్మరించి కేవలం సంపన్నుల ప్రయోజనాల కోసమే కేంద్రం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు.




## ప్రజా సంక్షేమమే.. లక్ష్యంగా పని

కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. గురువారం బెల్లంపల్లి మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి ఆయన సందర్శించి డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలును పరిశీలించారు. అనంతరం బజార్ ఏరియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించి 13వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. లెక్కింపులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. రామ్ నగర్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## రైతులపై ఎలుగుబంటి దాడి

ఒకరు మృతి,ఎనిమిది మందికి గాయాలు..

**ప్రజాపక్షం/బోథ్ :** తెలంగాణమహారాష్ట్ర సరిహద్దు ప్రాం తంలోని నాందేడ్ జిల్లా కిన్వట్ తా లూకా దయ్యాల దన్నూర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు 10.02.2026 రాత్రి 10 ను ంచి 11 గంటల సమయంలో మొక్క జొన్న పం టకు నీరు అందించేందుకు పొలానికి వెళ్లారు. అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న దయ్యాల దన్నూర్ గ్రామంలో సర్వే నం.89 వ్యవసాయభూమిలో ఎలుగుబంటి బలరాం జాదవ్‌పై దాడి చేసింది.అదే గ్రామానికి చెందిన మరో 8 మంది రైతును కాపాడటానికి వెళ్ళిన సమయం లో అందరిపై దాడి చేసింది.నలుగురు తీవ్రంగా గాయపడగా వారిలో ముగ్గురిని నాందేడ్ లోని ప్రభుత్వ ఆసుపత్రిలో,ఒకరిని సంబాజీ నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు.మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని సరిహద్దు ప్రాంతంలోని ప్రజలు అప్రమత్త ంగా ఉండాలని,అటవీ ప్రాంతానికి వెళ్ళవద్ద ని,అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న గ్రామాల ఏదైనా ప్రమాదం అనిపిస్తే పోలీసుల దృష్టికి తీ సుకురావాలి సి.ఐ.గురు స్వామి తెలిపారు.

## కౌంటింగ్‌కు మూడు అంచెల భద్రత

ఎస్‌పి నితిక పంత్



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపును ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ మూడు అంచెల భద్రతను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్‌పి నితిక పంత్ తెలిపారు. గురువారం ఆసిఫాబాద్ లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కాగజ్ నగర్ లోని డిఎవి పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సిసి టివి కెమెరాల పనితీరు, స్ట్రాంగ్ రూమ్ భద్రతను తనిఖీ చేశారు. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో 163 బిఎన్ఎస్ఎస్ అమల్లో ఉంటుందని, అనుమతి లేని వ్యక్తులను లోపలికి రానివ్వబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులు, ఏజెంట్లు, విధుల్లో ఉన్న సిబ్బంది తప్ప మరెవరూ కేంద్రాల వద్ద గుమికూడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నిరంతర నిఘా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి వాహిదుద్దీన్, ఇన్స్పెక్టర్లు ప్రేమ్ కుమార్, బాలాజీ వరప్రసాద్, సతీష్, మున్సిపల్ కమిషనర్ గజానంద్ పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలి

సిపిఐ సీనియర్ నాయకుడు బి.గోవర్ధన్




**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండల కేంద్రంలో సిపిఐ,ఎఐటియూసి ఆధ్వర్యంలో కార్మికల సమస్యల పరిష్కారం కోసం గురువారం ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ బోథ్ బస్‌స్టాండ్ నుంచి ప్రారంభమై ఎం.ఆర్.ఓ కార్యాలయం వరకు కొనసాగింది.కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేకంగా తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు నినాదాలు చేశారు.ఎం.ఆర్.ఓ కార్యాలయం లో అధికారులకు వినతిపత్రం అందజేశారు లేబర్ కోడ్స్ వల్ల కార్మికుల హక్కులు తీవ్రం గా దెబ్బతింటాయని,ఇపిఎఫ్ పెన్షన్ 7500కు పెం చాలి,కార్మికులకు అందరికీ ఆసరా పెన్షన్ అందించాలని అన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షనమే అమోదించకపోతే భవిష్యత్తులో ఉద్యమాలను మరింత ఉధృత చేస్తామని హెచ్చరించారు. సిపిఐ,ఎఐటియూసి.అంగన్వాడి.హమాలీ యూనియన్ల నాయకులు,కార్యకర్తలు,భారీగా పాల్గొన్నారు.

## మున్సిపల్ కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ డేవిడ్ సిబ్బందిని ఆదేశించారు. కాగజ్ నగర్ మున్సిపాలిటీలో శుక్రవారం జరగనున్న కౌంటింగ్ నేపథ్యంలో గురువారం రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది అంతా సమన్వయంతో వ్యవహరిస్తూ ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా లెక్కింపు పూర్తి చేయాలని సూచించారు. ఎలక్షన్ మాస్టర్ ట్రైనర్ ఎంఎ ఆసిఫ్ కౌంటింగ్ విధానం, పాటించాల్సిన నిబంధనలపై సిబ్బందికి సవివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచరాం

నిందితుడికి 20 సంత్సరాల కఠిన కారాగార శిక్ష

స్పెషల్ పోక్స్ కోర్టు జడ్జి కె. జయంతి

**ప్రజాఫక్షం /సంగారెడ్డి :** జిల్లాలోని వట్‌పల్లి పోలీస్ స్టేషన్ క్రైమ్ నం 04/2019 సెక్షన్లు 366(ఎ) 376,పోక్స్ చట్టం 2012 లోని సెక్షన్లు 5,6 ఈ కేసులో నిందితుడు వడ్డెరాజు అలియాస్ బీమం గొడ్డెన్ల రాజు, తండ్రి వీరయ్య, (28) వృత్తి ట్రాక్టర్ డ్రైవర్ చిట్కుల్ గ్రామం పటాన్‌చెరు మండలం మైనర్ బాలికను ఆపహరించి అత్యాచారం చేసిన కేసులో పూర్వపరాలు విన్న స్పెషల్ పోక్సో కోర్టు కె. జయంతి నిందితుడు చేసిన నేరం నిరూపితమైనందున ఐపిసి సెక్షన్ 376(2) (n)366(A)506 పోక్స్ చట్టంలోని సెక్షన్ 5(1) 6 ప్రకారం దోషిగా నిర్ధారించి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 10వేలు జరిమాన విధిస్తూ తీర్పు నిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఒక సంవత్సర ం సాదారణ కారాగార శిక్ష అనుభవించవలసి ఉంటుందని తీర్పు ఇచ్చారు. కేసు విచారణలో బాగంగా కృషి చేసిన అధికారులు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. సురేందర్ రెడ్డి, దర్యాప్తు అధికారి ఎ మోహన్ రెడ్డి, ఎస్ఐ వట్‌పల్లి పోలీస్ స్టేషన్ తదుపరి దర్యాప్తు అధికారి పి. శ్రీదర్‌రెడ్డి, అప్పటి డిఎస్పీ సంగారెడ్డి, ప్రస్తుతం ఎస్‌హెచ్ఓగా ఎస్ లవకుమార్, ఎస్ఐ వట్‌పల్లి పోలీస్ స్టేషన్ భరోసా లీగల్ టీమ్ కోర్ట్ డ్యూటీ అధికారి బి. బాస్కర్, స్పెషల్ పోక్స్ కోర్టు లైజనింగ్ అదికారి బి.శంకర్ హెడ్ కానిస్టేబుల్ జిల్లా లైజనింగ్ అధికారి కె. సత్యనారాయణ ఎస్ఐ లను ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

ఏడు ఓవర్లకే... 'శత'క్కొట్టిన భారత్!

# నమీబియాపై ఇషాన్ తుఫాన్




పొట్టి ప్రపంచకప్‌లో ఇషాన్ కిషన్(61) తుఫాన్ ఇన్నింగ్స్‌తో ప్రేక్షకులను అలరించాడు. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఆకాశమే హద్దుగా నమీబియా బౌలర్లపై చెలరేగిన ఈ ఓపెనర్ మెరుపు అర్ధశతకం సాధించాడు. పవర్ ప్లే చివరి ఓవర్లో వరుసగా.. 6, 6, 6, 6, 4తో ఊచకోతకు తెగబడిన ఈ లెఫ్ట్ హ్యాండర్ 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇషాన్ విధ్వంసంతో 6 ఓవర్లకే 86 పరుగులు చేసిన భారత్.. ఆ తర్వాతి ఓవర్లోనే వందకు చేరింది. భీకర ఫామ్‌లో ఉన్న ఇషాన్ కిషన్ తానెంత ప్రమాదకరమో మరోసారి నిరూపించాడు. గురువారం రెండో లీగ్ మ్యాచ్‌లో నమీబియా బౌలర్లను బెంబేలెత్తించి 20 బంతుల్లోనే అర్ధశతకం బాదేశాడు. ఓపెనర్ సంజూ శాంసన్(22) రెండో ఓవర్లోనే వెనుదిరిగాక.. గేర్ మార్చిని ఇషాన్ పూనకం వచ్చినట్టే ఆడాడు. దొరికిన బంతిని దొరికినట్టు బౌండరీ పంపిన అతడు.. ఆరో ఓవర్లో మరింత రెచ్చిపోయాడు. స్మిట్‌కు చుక్కలు చూపిస్తూ.. వరుసగా 6, 6, 6, 6 తో ఫిఫ్టీ సాధించాడు. ఆ తర్వాతి ఓవర్లోనూ ఇషాన్, తిలక్ వర్మ(23 నాటౌట్) చెరొక ఫోర్ కొట్టగా స్కోర్ వంద దాటింది. ఎడాపెడా దంచేస్తున్న ఇషాన్‌ను ప్రత్యర్థి కెప్టెన్ ఎరాస్మస్ వెనక్కి పంపి బ్రేకులు వేశాడు. ప్రస్తుతం తిలక్ జతగా సూర్యకుమార్ యాదవ్(12 నాటౌట్) ఆడుతున్నాడు. 10 ఓవర్లకు స్కోర్.. 120–2.

## అరంగేట్రంలోనే సంచలనం..

### అనామక జట్టు చేతిలో చిత్తైన నేపాల్..!




పొట్టి ప్రపంచకప్‌లో సంచలనం నమోదైంది. చిన్న జట్టు ఇటలీ అరంగేట్రంలోనే 'మాతో జాగ్రత్త' అనే హెచ్చరికలు పంపుతూ.. బోణీ కొట్టింది. గత మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌ను వణికించిన నేపాల్‌పై జయభేరి మోగించింది. ఓపెనర్ల విధ్వంసంతో 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఉఫ్‌మని ఊదేసి.. 'మేము చెలరేగితే ఇలా ఉంటది' అని చాటింది. ఊహించని ఓటమితో నేపాల్ షాక్‌లో కూరుకుపోయింది. సంచలనాలకు నెలవైన టీ20 ప్రపంచకప్‌లో ఇటలీ చరిత్ర లిఖించింది. అనామక జట్టుగా మెగాటోర్నీలో అడుగుపెట్టి.. తొలి విజయంతో అందరినీ ఆశ్చర్యపరిచింది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో గురువారం ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన ఇటలీ.. గ్రూప్ సీలోని నేపాల్‌కు చెక్ పెట్టింది. మొదట కృష్ణన్ కలుగమగే(3–18), బెన్ మనేటి (2–9)ల విజృంభణతో ప్రత్యర్థిని 123కే ఆలౌట్ చేసిన యూరోపియన్ జట్టు.. ఛేదనలోనూ రఫ్ఫాడించింది. లక్ష్యం చిన్నది కావడంతో.. ఓపెనర్లు జస్టిన్ మొస్కా(60 నాటౌట్), ఆంథోని మొస్కా (62 నాటౌట్)లు విరుచుకుపడ్డారు. నేపాల్ బౌలర్లకు దడ పుట్టించిన ఈ సోదరులు బౌండరీలతో చెలరేగగా.. చూస్తుండగానే లక్ష్యం కరిగిపోయింది. తద్వారా పొట్టి వరల్డ్‌కప్‌లో అత్యధిక భాగస్వామ్యం (124 నాటౌట్) నెలకొల్పిన సోదర ద్వయంగా వీరు గుర్తింపు సాధించారు. నిరుడు వెస్టిండీస్‌పై టీ20 సిరీస్ విజయంతో వార్తల్లో నిలిచిన నేపాల్ ప్రపంచకప్‌లో పెద్ద జట్లకు షాకిస్తుందనుకుంటే సీన్ రివర్సైంది. డేంజరస్ రోహిత్ పౌడెల్(23), దీపేంద్ర సింగ్ ఐరీ(17), గుల్సన్ జా(3)లను ఔట్ చేసి నేపాల్‌ను తక్కువకే కట్టడి చేసిన కలుగమగె 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు.

## 105 రన్స్ తేడాతో శ్రీలంక విజయం




**ఐపల్లెకెలి:** సిసి టీ20 ప్రపంచకప్ 2026లో శ్రీలంక జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. గ్రూప్‌బీలో భాగంగా పల్లెకెలి వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 105 పరుగుల తేడాతో ఒమన్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో శ్రీలంక పూర్తి ఆధిపత్యం చెలాయించగా.. ఒమన్ తేలిపోయింది. కనీస పోటీనివ్వలేకపోయింది. ఈ విజయంతో గ్రూప్‌బీ నుంచి సూపర్ 8 అవకాశాలను మెరుగుపర్చుకోగా.. ఒమన్ ఇంటిబాట పట్టేందుకు సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 225 పరుగులు చేసింది. కుశాల్ మెండీస్(45 బంతుల్లో 7 ఫోర్లతో 61), పవన్ రత్నాయక(28 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 60), డసన్ షనక(20 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 50) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఒమన్ బౌలర్లలో జితెన్ రమణంది(2/41) రెండు వికెట్లు తీయగా.. జయ్ ఒడెడ్రా, సుఫ్యాన్ మెహ్మూద్ చెరో వికెట్ తీసారు. అనంతరం ఒమన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 120 పరుగులు చేయగలిగింది. మహమ్మద్ నదీమ్(56 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 53 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. శ్రీలంక బౌలర్లలో దుష్మంత్ చమీరా(2/19), మహీష్ తీక్షణ(2/11) రెండేసి వికెట్లు తీయగా.. దునిత్ వెల్లలేగే, దుషన్ హేమంత, కామిందు మెండీస్ తలో వికెట్ తీసారు. ఈ గెలుపుతో శ్రీలంక గ్రూప్‌బీలో టాపర్‌గా కొనసాగుతోంది. ఆస్ట్రేలియా రెండో స్థానంలో ఉండగా... జింబాబ్వే మూడో స్థానంలో ఉంది. రెండు మ్యాచ్‌లకు రెండు ఓడిన ఐర్లాండ్, ఒమన్ సూపర్ 8 రేసు నుంచి తప్పుకుంది.

## పోటీ కోసం జీకే

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- మంగళయాన్‌ను ప్రయోగించిన దేశం ఏది?
  భారతదేశం
- మంగళ గ్రహానికి తొలి ప్రయత్నంలోనే చేరిన దేశం ఏది?
  భారతదేశం
- భారతదేశ అతి పాత విశ్వవిద్యాలయం ఏది?
  నలంద విశ్వవిద్యాలయం
- వేదాలు ఏ భాషలో ఉన్నాయి?
  సంస్కృతం
- రామాయణ రచయిత ఎవరు?
  వాల్మీకి
- మహాభారత రచయిత ఎవరు?
  వ్యాస మహర్షి
- గీతను ఎవరు ఉపదేశించారు?
  శ్రీకృష్ణుడు
- భారతదేశ జాతీయ పండుగలు ఎన్ని?
  మూడు
- స్వాతంత్ర్య దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు?
  ఆగస్టు 15
- గణతంత్ర దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు?
  జనవరి 26
- గాంధీ జయంతి ఎప్పుడు?
  అక్టోబర్ 2
- భారతదేశ పితామహుడు ఎవరు?
  మహాత్మా గాంధీ
- నీటిని శుద్ధి చేసే ప్రక్రియ ఏమిటి?
  ఫిల్ట్రేషన్
- మన శరీరంలో అతిపెద్ద అవయవం ఏది?
  చర్మం
- రక్తాన్ని శుద్ధి చేసే అవయవం ఏది?
  మూత్రపిండాలు
- హృదయ స్పందనను కొలిచే పరికరం ఏది?
  స్టెతస్కోప్
- ఆక్సిజన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
  జోసెఫ్ ప్రీస్ట్లీ
- ప్రపంచంలో అతి పెద్ద ఎడారి ఏది?
  సహారా ఎడారి
- భూమి ఆకారం ఎలా ఉంటుంది?
  జియోయిడ్
- భూమి భ్రమణం వల్ల ఏర్పడేది ఏమిటి?
  పగలు – రాత్రి
- భూమి పరిభ్రమణం వల్ల ఏర్పడేది ఏమిటి?
  ఋతువులు
- భూమిపై అత్యధికంగా కనిపించే వాయువు ఏది?
  నైట్రోజన్
- భారతదేశ జాతీయ నినాదం ఏమిటి?
  సత్యమేవ జయతే
- భారత జాతీయ చిహ్నం ఏది?
  అశోక స్తంభం
- అశోక చక్రంలో ఎన్ని అంచులు ఉన్నాయి?
  24
- భారత జెండాలో ఎన్ని రంగులు ఉన్నాయి?
  మూడు
- భారత జెండా రూపకర్త ఎవరు?
  పింగళి వెంకయ్య
- ప్రపంచంలో అతి వేగవంతమైన జంతువు ఏది?
  చీతా (చిరుతపులి)
- ప్రపంచంలో అతి పెద్ద జంతువు ఏది?
  నీలి తిమింగలం (బ్లూ వేల్)
- ప్రపంచంలో అతి పొడవైన జంతువు ఏది?
  జిరాఫీ
- తేనెటీగలు తయారు చేసే ఆహారం ఏమిటి?
  తేనె
- పట్టు దేని నుంచి వస్తుంది?
  పట్టుపురుగు
- భారతదేశ తొలి మెట్రో రైలు ఎక్కడ ప్రారంభమైంది?
  కోల్‌కతా
- ప్రపంచంలో అతి పొడవైన రైల్వే ప్లాట్‌ఫాం ఎక్కడ ఉంది?
  గోరఖ్‌పూర్
- భారతదేశంలో అతి రద్దీగల రైల్వే స్టేషన్ ఏది?
  హౌరా
- విమానాశ్రయాన్ని మొదటిసారిగా నిర్మించిన దేశం ఏది?
  ఫ్రాన్స్
- విమానం ఆవిష్కర్తలు ఎవరు?
  రైట్ బ్రదర్స్ (విల్బర్, ఆర్విల్లే)
- భారతదేశంలో అత్యధిక టీ ఉత్పత్తి చేసే రాష్ట్రం ఏది?
  అస్సాం
- భారతదేశంలో కాఫీ ఎక్కువగా పండే రాష్ట్రం ఏది?
  కర్ణాటక
- పత్తి పంటను వెండి పంట అని ఎందుకు అంటారు?
  అధిక ఆర్థిక విలువ కారణంగా
- భారతదేశంలో హరిత విప్లవానికి నాయకత్వం వహించిన వ్యక్తి ఎవరు?
  ఎం.ఎస్. స్వామినాథన్
- తెల్ల బంగారం అని ఏ పంటను అంటారు?
  పత్తి
- ప్రపంచంలో అతి ఎక్కువగా మాట్లాడే భాష ఏది?
  మాండరిన్ చైనీస్
- భారతదేశంలో అధికార భాష ఏది?
  హిందీ
- భారతదేశంలో అధికారికంగా గుర్తింపు పొందిన భాషలు ఎన్ని?
  22
- యునెస్కో పూర్తి రూపం ఏమిటి?
  ఐక్యరాజ్యసమితి విద్యా, శాస్త్ర, సాంస్కృతిక సంస్థ
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఎప్పుడు?
  జూన్ 5

## ప్రపంచంలో అతి పొడవైన రైల్వే ప్లాట్‌ఫాం ఎక్కడ ఉంది?








## 'ఫంకీ' నవ్వుల సందడి

విశ్వక్ సేన్, దర్శకుడు కె.వి. అనుదీప్ కలయికలో వస్తున్న చిత్రం 'ఫంకీ'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రంలో కయాదు లోహర్ కథానాయిక. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఒకరోజు ముందుగా ఫిబ్రవరి 13న థియేటర్లలో అడుగుపెడుతోన్న నేపథ్యంలో ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్‌ను నిర్వహించారు. కుటుంబ సమేతంగా చూడదగ్గ 'ఫంకీ' చిత్రం ప్రేక్షకులకు వినోదాల విందుని అందించి, ఘన విజయాన్ని సాధిస్తుందని నిర్మాత నాగవంశీ చెప్పారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ..'ముందుగా భీమ్స్ గురించి మాట్లాడాలి. మా సినిమాకు అద్భుతమైన సంగీతం అందించారు. మామూలుగా నా సినిమాలలో పాటలు బాగుంటాయి అంటారు. అయితే నా గత రెండు చిత్రాలలో పాటలు ఆశించిన స్థాయిలో మెప్పించలేదు.స్నేహితులు, కుటుంబం సభ్యులతో కలిసి సినిమా చూసి ఎంజాయ్ చేయండి. రెండు గంటలు ఎలా అయిపోయాయో కూడా తెలియనంతగా సినిమా మీకు వినోదాన్ని పంచుతుంది అన్నారు. కథానాయిక కయాదు లోహర్, దర్శకుడు అనుదీప్ కె.వి, నిర్మాత సూర్యదేవర నాగవంశీ పాల్గొన్నారు.

## తొలిసారి కెమెరా అనుభూతి

### 'మాటల్లో వర్ణించలేనిది' : చిరంజీవి



పునాదిరాళ్లు సినిమా కోసం జీవితంలో తొలిసారి కెమెరా ముందు నిలిచిన రోజు కలిగిన ఆనందం మాటల్లో వర్ణించలేనిదని మెగాస్టార్ చిరంజీవి వ్యాఖ్యానించారు. తన అద్భుత నటన, మెస్మరైజింగ్ డ్యాన్స్‌లు , పవర్‌ఫుల్ యాక్షన్‌తో కోట్లా ది అభిమానులు, ప్రేక్షకుల మనసు గెలుచుకున్న మెగాస్టార్ చిరంజీవి తన సినీ ప్రయాణంలోని అమూల్యమైన జ్ఞాపకాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు. దశాబ్దాలుగా అగ్ర కథానాయకుడిగా అలరిస్తున్న మెగాస్టార్ చిరంజీవి నటించిన తొలి సినిమా 'పునాదిరాళ్లు'. ఈ సినిమా కోసం మొదటిసారి కెమెరా ముందుకు వచ్చిన ప్రత్యేక సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ సోషల్ మీడియాలో ఒక స్పెషల్ పోస్ట్‌ను షేర్ చేశారు మెగాస్టార్. పునాదిరాళ్లు సినిమా కోసం జీవితంలో కెమెరా ముందు నిలిచిన తొలి రోజు. ఆ రోజు నాలో కలిగిన ఆత్రుత, ఆనందం, బాధ్యత, భావోద్వేగం మాటల్లో వర్ణించలేనిది. ఆ క్షణం ఇప్పటికీ నిన్న, మొన్న జరిగిందేమో అన్నట్టు అనిపిస్తుంది. ఒక అందమైన చందమామ కథ లాంటి అనుభూతి. ఈ ప్రత్యేక సందర్భంలో, నాకు ఆ తొలి అ వకాశం ఇచ్చిన ఆ చిత్ర దర్శ క, నిర్మాతలకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తె లియజేసుకుంటున్నాను. వారి నమ్మకం, ప్రోత్సాహంతో వచ్చిన అవకాశంతో నటనలో నా ప్రయాణానికి పునాదిరాళ్లు పడ్డాయి. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ నన్ను ఆదరిస్తూ, ఆశీర్వదిస్తున్న ప్రేక్షకులందరికీ నా కృతజ్ఞతలు అని చిరంజీవి పేర్కొన్నారు.

## 'మ్యూజికల్ లవ్ స్టోరీ ' ప్రీరిలీజ్




సామిత్ పోలాడి హీరోగా నటిస్తూ సాయి కే వెన్నంతో కలిసి దర్శకత్వం వహించిన చిత్రం నిలవే. శ్రేయాసి సేన్ నాయికగా పరిచయం అవుతుంది. హర్ష చెముడు, సుప్రియా ఐసోలా మరో జంటగా నటించారు. పీ ఓ వి ఆరట్స్ ప్రొడక్షన్స్ బ్యాన్ర రాజ్ అల్లాడ, గిరిధర్ రావు పోలాడి, సా యి కే వెన్నం నిర్మించారు. ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13 న విడుదలకాబోతుంది. ఈ సందర్భంగా మాదాపూర్‌లో ప్రీరిలీజ్ వే డుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాయని సునీత ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం సింగర్ సునీత మాట్లాడుతూ, ఈ మ ధ్య చాలా తక్కువ సినిమాల్లో చక్కటి భావోద్వేగాలు చూస్తుంటాం. అలా అన్నీ ఎమోషన్స్ చూపించేలా వున్న చిత్ర మే 'నిలవే'. కాలం మారినా ఇంటెన్స్ మ్యూజిక్ అలానే వుం టుంది. నేను ఇక్కడ వుండడానికి కారణం కూడా అదే. నిలవే అనేది అద్భుతమైన ఫొటోగ్రఫీ, దర్శకత్వం, తగిన నటీనటులు వున్న సినిమా ఇది. ఈ సినిమా చూశాను. అర్థవంతమైన సి నిమా ఇది. మ్యూజికల్ లవ్ స్టోరీ థియేటర్ లో ఆడేలా ప్రేక్షకు లు తీర్పు ఇస్తారని, క్లాసికల్ మూవీస్ సఖి, ఏ మాయే చేశావే తరహాలో మంచి ఫీల్ గుడ్ సినిమా అవుతుందని భావిస్తున్నా. ఇందులోని పాటలు బాగున్నాయని ఓసారి కీరవాణిగారిని వినమంటే ఆయన విని తనవంతు సపోర్ట్ ఇస్తానని ప్రమోషన్ చే యడం కూడా సినిమాపై పాజిటివ్ నెలకొంది. ఈ సందర్భంగా అందరికీ మరోసారి విషెస్ చెబుతున్నానని అన్నారు.మ్యూజిక్ డైరెక్టర్: కళ్యాణ్ నాయక్ మాట్లాడుతూ, చక్కటి ఫీలింగ్ తో కూ డిన లవ్ స్టోరీ లో సంగీతం కీలకం. చక్కటి సంగీతాన్ని సమకూర్చాను. మా సంగీతాన్ని మెచ్చుకుని కీరవాణిగారి దగ్గరకు చేరేలా చేసిన సునీత గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఇందులో 11 పాటలున్నా కథతో సాగేవే. వినసొంపుగా వుంటాయి. సంగీత ప్రేమకథా చిత్రాల్లో నిలవే చిత్రం కేజీఎఫ్ లాంటి సినిమా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ శ్రేయాసి సేన్, హీరో సామిత్ పోలాడి , చిత్ర దర్శకుడు సాయి కే వెన్నం, నిర్మాత రాజ్ అల్లాడ, నిర్మాత మాధురి, నటి సత్య శ్రీ, ఆర్ అండ్ ఎ ట్రావెల్స్ అనురాధా, ప్రవీణ కడియాల, ప్రొడ్యూసర్ గిరిధర్ రావు, నటుడు రూపేష్ పాల్గొన్నారు.

## 'హుషారు పిట్టలు' యూత్‌ఫుల్ చిత్రం

అన్ను, వాసవి గణేషన్ జంటగా రూపొందుతోన్న యూత్ఫుల్ ఎంటర్టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియెస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. కాగా ఈ చిత్రం టీజర్ను ప్రముఖ నిర్మాత డి.సురేష్బాబు విడుదల చేశారు. ప్రముఖ నిర్మాత డి. సురేష్ బాబు మాట్లాడుతూ '' నిర్మాత బెక్కం వేణుగోపాల్ ''హుషారు పిట్టలు' సినిమా గురించి చెప్పాడు. సినిమా చూడగానే వెరీ రియలిస్టిక్ యంగ్‌స్టార్స్ సినిమా అనిపించింది. నేటి యువతరం కనెక్ట్ అయ్యే సినిమా ఇది. సినిమాలో నటీనటులు అందరూ బాగా చేశారు. తప్పకుండా ఈ సినిమా అందరికి నచ్చుతుంది' అన్నారు. హీరో అన్ను మాట్లాడుతూ '' అందరం ఎంతో కష్టపడి పనిచేశాం. ఈ సినిమాలో మాసినపల్లి రవి పాత్ర చేశాను. టీజర్ లాగే సినిమా కూడా అందరికి నచ్చుతుంది. ఈ సినిమాతో హీరోగా పరిచయమైనందుకు సంతోషంగా ఉంది. తప్పకుండా హిట్ కొడతాం' అన్నారు. హీరోయిన్ వాసవి గణేషన్ మాట్లాడుతూ '' టీజర్‌కు మంచి సినిమా ఉంటుంది. నాకు తొలిసినిమా. నా పాత్ర తప్పకుండా అందరికి నచ్చుతుంది' అన్నారు. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ '' 16 సంవత్సరాలు కష్టపడి ఈ స్టేజ్కు వచ్చా ను. ఈ రోజు దర్శకుడిగా పరిచయం అవుతున్నందుకు ఆనందంగా ఉంది. నా దర్శకత్వంలో వచ్చిన సినిమాను సురేష్ ప్రొడక్షన్స్ అండ్ ఏషియన్ ఫిలింస్ వారు విడుదల చేయడం సంతోషంగా ఉంది అన్నారు.నిర్మాత బెక్కం వేణగోపాల్ మాట్లాడుతూ '' ఈ సినిమాను సైలెంట్గా కంప్లీట్ చేసి ఈ సినిమా నాకు చూపించారు. సినిమా చూడగానే నాకు చాలా బాగా నచ్చింది. సినిమా చూడగానే నాకు షాకింగ్గా అనిపించింది. ఫస్టాఫ్ యూత్ఫుల్ కంటెంట్‌తో వెళ్లిన సెకండాఫ్లో ఓ మెచ్యూర్డ్ కంటెంట్ ఉంది. ఇది డెఫినెండ్‌గా మంచి సినిమా. ఈ సినిమా ద్వారా యూత్‌కు, తల్లిదండ్రులకు దర్శకుడు ఏదో విషయం చెబుతున్నాడు. ఈసినిమా చూసిన తరువాత అందరూ రెస్పాన్సిబుల్గా ఫీలవుతారు. ఓ మంచి విషయాన్ని ఓ ఎంటర్టైన్మెంట్ వేలో ఈ సినిమాలో దర్శకుడు చెప్పాడు. ఆర్టిస్టులు కూడా ఎంతో నేచురాల్గా ఉంటుంది అన్నారు. నిర్మాత కె.వెంకట్ యాదవ్, చిన్ని చరణ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.






## 'గోదారి గట్టుపైన' సినిమా టీజర్ సూపర్

మేమ్ ఫేమస్ తో స్ట్రాంగ్ డెబ్యూ చేసిన న్యూ ఏజ్ యాక్టర్ సుమంత్ ప్రభాస్ 'గోదారి గట్టుపైన' సినిమాతో అలరించబోతున్నారు. ఈ చిత్రం రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ కు ఫస్ట్ వెంచర్. ఎం ఆర్ ప్రొడక్షన్స్ షార్ట్ ఫిల్మ్‌తో పాపులరైనా సుభాష్ చంద్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.నిధి ప్రదీప్ కథానాయికగా అరంగేట్రం చేస్తుండగా, జగపతి బాబు, రాజీవ్ కనకాల కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.ఈ సినిమా నుంచి హార్ట్ బ్రేక్ యాంథమ్ ఓ మై గాడ్ ఫిబ్రవరి 14న రిలీజ్ చేయబోతున్నారు. వాలెంటైన్ డే సెలబ్రేషన్ కి ఇది పర్ఫెక్ట్ ట్రీట్ గా ఉండబోతుంది. సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్, జగపతి బాబు, రాజీవ్ కనకాల, లైలా, దేవి ప్రసాద్, సుదర్శన్, రాజ్ కుమార్ కసిరెడ్డి, వైవా రాఘవ్, రోహిత్ కృష్ణ వర్మ తదితరులు నటిస్తున్నారు.

## నిఖిల్‌సిద్ధార 'స్వయంభు' టీజర్




నిఖిల్ సిద్ధార్థ 'స్వయంభు'తో తన కెరీర్‌లో బిగ్గెస్ట్ చాప్టర్‌లోకి అడుగు పెడుతున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్ పై భువన్, శ్రీకర్ నిర్మించిన భారీ పాన్‌వరల్ విజువల్ వండర్ ని ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. పవర్ ఫుల్ టీజర్తో ప్రమోషన్లను ప్రారంభించారు.టీజర్ 'సెంగోల్' కథతో ప్రారంభమవుతుంది. శ్రీరాముడికి పరమేశ్వరుడు అందించిన 'సెంగోల్'ను స్వాధీనం చేసుకునేందుకు జరిగే భీకర యుద్ధాలు కథకు బలమైన నేపథ్యాన్ని అందించాయి. రాజ్యాలు కూలిపోయినా సెంగోల్ మాత్రం అజేయంగా నిలుస్తుంది. ఇలాంటి కీలక సమయంలో ధర్మాన్ని తిరిగి స్థాపించడానికి ముందు కొచ్చే ఓ యోధుడి కథ చూపించడం అద్భుతంగా వుంది.దర్శకుడు భరత్ కృష్ణమాచారి, సెంగోల్ చరిత్రను ఆధారంగా తీసుకుని భారతీయ చరిత్రపౌరాణిక అంశాలను కలిపి 985 ఏడీ కాలాన్ని నేపథ్యంగా ఎంచుకోవడం అద్భుతంగా వుంది. ప్రతి ఫ్రేమ్లో ఆయన చూపించిన డీటైలింగ్, భారీ వరల్డ్‌బిల్డింగ్ ప్రత్యేకంగా కనిపిస్తుంది.నిఖిల్ సిద్ధార్థ ఫెరోషియస్ వారియర్ గా అదరగొట్టారు. యుద్ధ వీరుడిగా అద్భుతం అనిపించారు. టీజర్లో ఆయన చేసిన వార్ యాక్షన్ సన్నివేశాలు, స్టంట్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచాయి. సంయుక్త, నభా నటేష్ బలమైన మహిళా పాత్రల్లో కనిపించనున్నారు. సుబ్బరాజు, సునీల్ కీలక పాత్రల్లో కనిపించారు.ఆర్ట్ డైరెక్టర్లు ఎం. ప్రభాహరణ్, రవీంద్ర రాజ్యాలని అద్భుతంగా సృష్టించగా, కె.కె. సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ విజువల్స్ గ్రాండియర్ తీసుకొచ్చింది. రవి బస్రూర్ బ్యాగ్రౌండ్ స్కోర్ యాక్షన్ని మరింత ఎలివేట్ చేయగా హాలీవుడ్ స్థాయిలో వున్నాయి. విజయ్ కామిశెట్టి డైలాగ్స్, కింగ్ సొలమన్‌స్టంట్ శివ యాక్షన్ కొరియోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్ అన్ని కలసి సినిమాను ఇంటర్నేషనల్ యాక్షన్ నిలబెట్టేలా ఉన్నాయి. పీరియడ్ యాక్షన్ జానర్ను నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్లే మాగ్నమ్ ఓపస్గా ఇది నిలవనుంది. ఈ చిత్రం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, చైనీస్, స్పానిష్, అరబిక్ భాషల్లో పాన్‌వరల్ రిలీజ్కు సిద్ధమవుతోంది.టీజర్ లాంచ్ ఈవెంట్ లో హీరో నిఖిల్ మాట్లాడుతూ నేను రెండేళ్లు ఎవరికీ కనిపించలేదు. హ్యాపీ డేస్ వచ్చి 19 సంవత్సరాలు అవుతోంది. ఇన్నేళ్ల నా కెరీర్లో అప్ అండ్ డౌన్స్ ఉన్నాయి. కానీ అందరూ నాకు సపోర్ట్ చేశారు. 'కార్తికేయ 2' పాన్ ఇండియా విజయం తర్వాత దానికంటే అద్భుతమైన ప్రాజెక్ట్తో రావాలని ఇన్ని రోజులు ఆగాను. చాలా శ్రద్ధతో భయంతో అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ చేసిన సినిమా 'స్వయంభు'. ఈ సినిమా చూసిన తర్వాత నిఖిల్ మావాడు అని చెప్పడానికి మీరంతా చాలా హ్యాపీగా ఫీల్ అవుతారు. మంచి కథని బెస్ట్ టెక్నీషియన్స్ తో చే శాం. సెంథిల్ గారి ఫ్రేంలో కనిపిస్తానని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఆయన ఫ్రేమ్ లో నేను కనిపించడం చాలా ఆనందంగా ఉంది. అలాగే రవి గారు అద్భుతమైన మ్యూ జిక్ ఇచ్చారు. ఇంత మంచి టెక్నీషియన్స్ ఇచ్చిన మా మధు గారికి థాంక్యూ. ఈ సినిమా ఇంత అద్భుతంగా రావడానికి కారణం భువన్, డైరెక్టర్ భరత్. ఈ టీజర్ కేవలం ఇంట్రడక్షన్ మాత్రమే. కథలో చాలా మలుపులు ఉన్నాయి. ముందు ముందు వచ్చే కంటెంట్‌లో మ రింత రివిల్ చేస్తాము. త్రీడీలో చూసినప్పుడు నేనే షా క్ అయ్యాను అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ భ రత్ కృష్ణమాచారి , డిఓపి సెంథిల్ కుమార్ , హీరోయిన్ సంయుక్త, హీరోయిన్ నభా పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు భారీ ఆదాయం

రూ.6 కోట్ల పెట్టుబడి.... రూ.3కోట్ల లాభం
అభినందించిన మంత్రి సీతక్క



ప్రజాపక్షం/ములుగు:సమ్మక్క సారలమ్మ మహా జాతర 2026 సందర్భంగా ములుగు జిల్లాలో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లు భారీ ఆదాయాన్ని ఆర్జించాయి. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో జిల్లాలోని 10 మండలాలను కవర్ చేస్తూ మొత్తం 565 ఆదాయ యూనిట్లను ఎస్‌హెచ్‌జిల ద్వారా ఏర్పాటు చేయగా వారు జాతర సమయంలో రూ.3కోట్లకు పైగా ఆదాయాన్ని సంపాదించారు. మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తీసుకొని మేడారం జాతర ప్రాంగణంలో మహిళా సంఘాలకు అనుకూలమైన ప్రదేశాల్లో షాపులను కేటాయించారు. ములుగు జిల్లాలోని పది మండలాలకు చెందిన మహిళా సమాఖ్యల ద్వారా వివిధ రకాల వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేయించి మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గాలు కల్పించారు. మంత్రి సీతక్క స్వయంగా ఈ యూనిట్లను ప్రారంభించి వారి బిజినెస్‌కు విస్తృత ప్రచారం కల్పించారు. ప్రభుత్వ ప్రోత్సాహకం, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు కల్పించడంతో మహిళలు కూల్ డ్రింక్ సెంటర్లు, చికెన్ సెంటర్లు, ఇప్పపువ్వు లడ్డూ స్టాళ్లు, బ్యాంబూ చికెన్ క్యాంటిన్లు, స్నాక్స్ తదితర దుకాణాలను ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన స్టాళ్లు, ఇతర వ్యాపార కార్యకలాపాల ద్వారా మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సమర్థంగా వినియోగించుకొని ఆర్థికంగా లాభపడ్డారు. ఈ వ్యాపారాల కోసం రూ. 6కోట్ల పెట్టుబడిని బ్యాంకులు, జిల్లా మహిళా సమాఖ్యల ద్వారా సమకూర్చగా మొత్తం రూ.9.12 కోట్ల ఆదాయం లభించింది. పెట్టుబడి ఖర్చులు పోగా రూ.3కోట్లకు పైగా లాభం వచ్చింది. సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అమలవుతున్న ఇందిరా మహిళా శక్తి ఘన విజయానికి ఇది నిదర్శనమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం, మహిళా సంఘాల పట్టుదల, ఆడబిడ్డల శ్రమ ఫలితమని అభినందించారు. గ్రామీణ మహిళలు ఆర్థికంగా బలపడుతూ స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగుతున్న ఈ ప్రయాణం దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఆమె పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు దృఢమైన పునాది వేసిందని మంత్రి ప్రశంసించారు.

**చిన్నారిని ఆశీర్వదించిన మంత్రి సీతక్క**
మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యాంరావు బావమరిది షాపు సుధాకర్ కుమార్తె నూతన వస్త్ర పుష్పాలంకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క గురువారం హాజరై చిన్నారి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, మండల నాయకులు, పాల్గొన్నారు.



## ప్రజా వ్యతిరేక బిల్లులను విరమించుకోవాలి



ప్రజాపక్షం / నల్లబెల్లి: మోదీ ప్రభుత్వం తెచ్చిన కార్మిక ,రైతు వ్యతిరేక బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ వరంగల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి డిమాండ్ చేశారు . గురువారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా బస్టాండ్ ఆవరణలో కార్మికులతో కలిసి సిపిఐ ,సిపిఎం ,కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ ,నిరసన కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా చింతకింది కుమారస్వామి మాట్లాడుతూ మోది ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో పాటు రైతు వ్యతిరేక బిల్లులను విద్యుత్ నూతన ఒప్పందలను వెంటనే రద్దు చేయాలని కోరారు. గ్రామీణ ఉపాధిహామీ చట్టం పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తు అమెరిక అధ్యక్షుడు ట్రంపుకు దాసోహం చేస్తు దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెడుతున్నారని విమర్శించారు . ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కౌన్సిల్ సభ్యులు అక్కపెల్లి రమేష్ ,సిపిఎం మండల కార్యదర్శి ,కడియాల మనోహర్ ,వీరాచారి ,బోడిగె సమ్మయ్య ,ఎంసిపిఐ మండల కార్యదర్శి దామ సాంబయ్య ,కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తిని మహేష్ ,మాలోతు చరణ్‌సింగ్ ,అవాల సంపతరావు పరికి రత్నం ,సాగర్ ,సదానందం ,అల్లె సుభాష్ తదితరులు పాల్గొన్నారు .

## దేశవ్యాప్త సమ్మెలో జర్నలిస్టుల నిరసన



ప్రజాపక్షం/ఆత్మకూరు : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఆత్మకూరు మండల జర్నలిస్టులు సంపూర్ణ మద్దతు తెలపడంతో పాటు గురువారం మండల కేంద్రంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అక్రమంగా తీసుకొచ్చిన నాలుగు నల్ల చట్టాలు అన్ని రంగాల కార్మికులకు మరణశాసనం లాంటివని తీవ్రంగా ఆక్షేపించారు. నాలుగు లేబర్ కోడ్‌లలో జర్నలిస్టుల సంబంధిత హక్కులను హరించి, పాత్రికేయరంగాన్ని నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలి, అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ముదిగిరి ఓదెలు (ప్రజాపక్షం), సయ్యద్ వలి (నవ తెలంగాణ), వీర్ల సాగర్ (ఆంధ్ర ప్రభ), సముద్రాల సురేష్ (ఘంటారావం), వంగేటి ప్రభాకర్ (దిశ), అర్షం మధు (వార్త), పెరుమాండ్ల శ్రీనివాస్ (సూర్య), బోడ్డు రాజేందర్ (వాస్తవం), కందకట్ల రాము (మన ప్రగతి), తనుగుల సంపత్ (కాకతీయ), మద్దే వెంకటేశ్ (పీ.సి.డబ్లు)పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో నిషేధాజ్ఞల అమలు: కమిషనర్

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : నిన్నటి రోజున జరిగిన మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి రేపటి రోజున జనగామ, ఘన్పూర్, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట ప్రాంతాల్లో కౌంటింగ్ నిర్వహిస్తుండడంతో శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా కౌంటింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో బి.ఎన్.ఎస్. ఎస్ సి. ఆర్. పిసి 163 ప్రకారం ప్రజలు ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుంపులు గా చేరడం నిషేధించడం జరిగింది. ఈ నిషేధం రేపు ఉదయం 6గంటల నుండి మరుసటి రోజు అనగా 14తారీఖు ఉదయం 6 గంటల వరకు అమలులో వుంటుందని. ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ హెచ్చరించారు.

## మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధం



ప్రజాపక్షం/మహబూబాబాద్:మహబూబాబాద్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో (ఐదు) మున్సిపాలిటీల పరిధిలో జిల్లా యంత్రాంగం కౌంటింగ్ కోసం విస్తృత ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని (98) వార్డులు 98 కు గాను, 50మంది రిటర్నింగ్ అధికారులు, 50మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 122 మంది కౌటింగ్ సూపర్వైజర్స్, 239మంది కౌంటింగ్ అసిస్టెంట్స్ విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ (బాలికల) రెసిడెన్షియల్ స్కూల్,36 వార్డులు, 36 , తొర్రూరు పట్టణ కేంద్రంలో ఆర్యభట్ట హై స్కూల్,16 వార్డులు, 16 , మరిపెడ పట్టణ కేంద్రంలో సెంట్ అగస్టీన్ హై స్కూల్,15 వార్డులు, 15 , కేసముద్రం పట్టణ కేంద్రంలో ఏఎంసీ కేసముద్రం,16 వార్డులు, 16 , డోర్నకల్ పట్టణ కేంద్రంలో నిర్మల హై స్కూల్ రైల్వే హాస్పిటల్ లలో15 వార్డులు, 15 , మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. రెవెన్యూ డివిజనల్ అధికారులు, ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, సంబంధిత ఎన్నికల విభాగం సిబ్బంది అందుబాటులో ఉంటూ కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

## కౌంటింగ్ సెంటర్‌లో అదనపు కలెక్టర్ పరిశీలన

ప్రజాపక్షం/జనగామ :మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు శుక్రవారం జరగనున్న నేపధ్యంలో జిల్లా అధనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేషన్‌కుమార్ గురువారం జనగామలోని బిఇడి కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కౌంటింగ్ హాల్ ఏర్పాటు, టేబుల్ అమరికలు, సిసిటివి పర్యవేక్షణ, భద్రతా చర్యలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, తాగునీరు, శౌచాలయ సదుపాయాలు, విద్యుత్ సరఫరాతో పాటు ఇతర మౌళిక వసతులపై విపులంగా పరిశీలించి కౌంటింగ్ పక్రియను ఎన్నికల నియమావళి ప్రకారం పారదర్శకంగా ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వయించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంచాలని అధికారులు సూచించారు. ఈ సదర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ ఎన్నికలలో అత్యంత కీలక దశ, ప్రతి అంశంలో భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పారదర్శకత,సమయపాలనతో కౌంటింగ్ నిర్వయించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆర్‌డిఓ గోపిరాం, మున్సిపల్ కమీషనర్ మహేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

## 5 ఏళ్లలో నియోజకవర్గం రూపురేఖలు మారుస్తాం..

### మేయర్ సుధారాణితో పలు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని..



ప్రజాపక్షం/హనుమకొండ : వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని, ఐదేళ్ల కాలంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధిని చేసి చూపిస్తానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ఆయన నియోజకవర్గంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఇచ్చిన మాట ప్రకారం బీటీ రోడ్లు సహాఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇందులో భాగంగా 5వ డివిజన్ పరిధిలో రూ. 90 లక్షల వ్యయంతో మర్కాజీ స్కూల్ నుండి మంగలి వాగు బ్రిడ్జి వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అలాగే, 30వ డివిజన్ చిల్డ్రన్ పార్కులో రూ. 70 లక్షలతో చేపట్టనున్న మౌలిక వసతుల కల్పన పనులకు శంకుస్థాపనచేశారు.నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక అయిన తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గత 10 ఏళ్లలో నియోజకవర్గానికి రాని నిధులను ప్రభుత్వం నుంచి సాధించామని,ముఖ్యంగా వాటర్ సప్లై మెరుగుపరచడం కోసం రూ. 530 కోట్ల భారీ నిధులను మంజూరు చేయించాం. త్వరలోనే పశ్చిమ పరిధిలో నీటి ఇబ్బందులు లేకుండా చే స్తాం అని ఆయన స్పష్టం చేశారు. అనంతరం మే యర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో వారు ల వారీగా సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. క్వాలిటీతో కూడిన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కా ర్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు పోతుల శ్రీమన్నారాయణ,రావుల కోమల, డివిజన్ అధ్యక్షు లు స్రవంతి,రమేష్,నాయకులు ,మాజీ కార్పొరేటర్ మాధవి,గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ ము ఖ్య నాయకులు,స్థానిక కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఉత్సవాలకు పలువురు మంత్రులకు ఆహ్వానం



ప్రజాపక్షం/కాళేశ్వరం:జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో ఈ నెల 15న జరిగే మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు,ఆయన సతీమణి రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ దంపతులకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు కాళేశ్వరం ఆలయ వర్గాల ఆధ్వర్యంలోమహాశివ రాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికలు అందించి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మహేష్, అర్చకులు ఫణీంద్ర శర్మ, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న ఏడుగురు అరెస్టు

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పాటు హైదరాబాద్ నగరంలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఏడుగురు సభ్యుల ముఠాను సంగెం, సిసి ఎస్ పోలీసులు సంయుక్తంగా కలసి గురువారం అరెస్టు చేసారు. పట్టుబడిన వారిలో నలుగురు మైనర్లును వున్నారు. ఈ ముఠా నుండి పోలీసులు సుమారు 15లక్షల విలువ గల 15 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు అరెస్టు చేసిన వారిలో నలుగురు మైనర్‌నిందితులు కాగా, మరో ముగ్గురు నిందితులు దరాంగుల అంజీ, వయస్సు 21,హనుమకొండ, ఉర్సు సంతోష్, వయస్సు 27, జైదా రామక ష్ణ, వయస్సు 32,జమ్మికుంట, కరీంనగర్ జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.ఈ అరెస్టుకు సంబంధించి ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ వివరాలను వెల్లడిస్తూ, పట్టుబడిన ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో పాటు ఒకే ప్రాంతంలో నివాసం వుండటంతో, తరుచుగా కలుసుకునేవారు. దీనితో వీరి మధ్య స్నేహం కుదరటంతో నిందితులందరు వారికి వచ్చే అదాయంతో మద్యం సేవిస్తూ జల్సాలు చేసేవారు. దీనితో వారి అదాయం వారి జల్సాలకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నారు. ఇందుకోసం ఈ ముఠా పార్కుచేసి వున్న ద్విచక్ర వాహనాలను చోరీ చేసి వాటిని విక్రయించడం ద్వారా వచ్చే డబ్బుతో జల్సాలు చేయాలని అనుకున్నారు. దీనితో నిందితులందరు ఓ ముఠా ఏర్పడి వరంగల్ కమిషనరేట్ పరిధిలో పాటు, హైదారాబాద్ నగరంలో తాళం వేసి వున్న ద్విచక్ర వాహనాలను చోరీ చేసి హన్మకొండ పద్మాక్షమ్మ గుట్ట ప్రాంతంలో రహస్యంగా భద్ర పర్చేవారు. ఈ తరహాలో నిందితులు మొత్తం 15 చోరీలకు పాల్పడగా ఇందులో సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు చోరీలకు పాల్పడగా,సంగెం,హసన్‌పర్తి, మీల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు చోప్పున ఆరు చోరీలకు పాల్పడగా ,హన్మకొండ ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒకటి చోప్పున, హైదరాబాద్ మడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలను నిందితులు చోరీ చేసారు.ఈ నెల ఒకటవ తారీకున సంగెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆశాలపల్లి గ్రామంలో ఒక ద్విచక్ర వాహనాన్ని నిందితులు చోరీ చేయడంతో, ఈ చోరీపై వాహన యజమాని సంగెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు, అధికారుల అదేశాలతో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటుచేసి, దర్యాప్తు చేపట్టగా పోలీసులకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకొని నిందితులను గుర్తించిన పోలీసులు, ఈ రోజు ఉదయం గవిచర్ల గ్రామ గుండు సమ్మయ్య ఆలయం వద్ద ఎస్.ఐ వంశీ కృష్ణ అధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా చోరీ చేసిన రెండు వాహనాలపై ఆరుగురు నిందితులు ప్రయాణిస్తూండగా అనుమానంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నిందితులు పాల్పడిన చోరీలను పోలీస్‌ల ఎదుట అంగీకరించారు. నిందితులు ఇచ్చిన సమచారంతో పద్మాక్షి గుట్ట ప్రాంతంలో రహస్యంగా భద్రపర్చిన మిగితా ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితులను పట్టుకొని చోరికి గురైన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కబరిచిన మామునూరు ఏసిపి వెంకట్, పర్వతగిరి సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ రాజగోపాల్, సిసిఎస్ ఇన్స్‌స్పెక్టర్ రాఘవేందర్, సంగెం ఎస్.ఐ వంశీ క ష్ణ, ఏఏఓ సల్మాన్ పాషా, సంగెం హెడ్ కానిస్టేబుల్ సంతోష్, బాబు, కానిస్టేబుళ్ళు శ్రవణ్, యాకూబ్ పాషా, నవీన్, కార్తీక్ లను డిసిపి అభినందించారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె




ప్రజాపక్షం/నర్సంపేట : పట్టణంలో కార్మిక వర్గం భారీ ప్రదర్శన కార్మిక సంఘాలు దేశవ్యాప్త సమ్మె చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా నర్సంపేట పట్టణంలో బిఆర్‌టియూ,ఏఐఎఫ్‌టియూ(న్యూ), ఏఐటియూసి, సిఐటియూ, ఐఎఫ్‌టియూ, టియూసి సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ రోడ్డు కూడలి నుండి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం యాకూబ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐఎఫ్‌టియూ న్యూ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేష్, బిఆర్‌టియూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, ఏఐటియూసి జిల్లా కార్యదర్శి గుంపెల్లి మునీశ్వర్, హమాలీ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మి నారాయణ లు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల త్యాగాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాల సవరణ పేరుతో కార్పొరేట్, బహుళ జాతి యాజమాన్యాలకు ఉపయోగపడే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చారని, కనీస వేతనం అమలు చేయాలని, కార్మికుల హక్కుల రక్షణ కోసం ఉన్న చట్టాలను సవరణలు చేయడం సరికాదన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాలడుగుల రమేష్, ఆశాల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కలువాల లలిత, కార్యదర్శి సంధ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి కందికొండ రాజు, టియూసి నాయకులు రాజు, ఏఐటియూసి నాయకులు నాగులు, ఏఐఎఫ్‌టియూ నాయకులు మంద మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల లెక్కింపు ఏర్పాట్లు పూర్తి: కలెక్టర్



ప్రజాపక్షం/భూపాలపల్లి :జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న పురపాలక సంస్థల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రం లోని డా|| బిఆర్ అంబే ద్కర్ క్రీడా ప్రాంగణంలోని మిని ఫంక్షన్ హాలులో ఓట్లు లెక్కింపు ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్‌వైజర్లకు ప్రత్యేక శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ మాట్లాడుతూ, ప్రతి రౌండ్ లెక్కింపు పూర్తయ్యేసరికి ఫలితాలను సమగ్రంగా నమోదు చేసి, సంబంధిత అభ్యర్థుల ఏజెంట్లు సంతకాలు తీసుకోవాలని, తదుపరి పరిశీలకుల అనుమతితో విజేతలను ప్రకటించాలని అధికారులకు సూచించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. లెక్కింపు కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు తెలిపారు. గుర్తింపు కార్డు కలిగిన వ్యక్తులకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. సిబ్బంది ఉదయం 7 గంటల వరకు లెక్కింపు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సిసికెమెరాల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, స్పష్టం చేశారు. ఈ శిక్షణ సమావేశంలో ఎస్‌పి సంకీర్త్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్‌డిఒ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జోనా, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మానుకోట రాజకీయ పొత్తు మోసాన్ని ఎండ కట్టాం

### సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి



ప్రజాపక్షం/మహబూబాబాద్:మానుకోట కాంగ్రెస్ రాజకీయ పొత్తు మోసాన్ని ఎండకట్టామని, ప్రజా తీర్పును శిరసావహిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి స్పష్టం చేశారు. గురువారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయం వీరభవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11న జరిగిన మానుకోట మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ పార్టీని పొత్తు పేరుతో మోసం చేసి గొంతు కోసిన కాంగ్రెస్‌కు పట్టణ ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. ఎన్నికల్లో సిపిఐ పోటీ చేసిన 7 వార్డుల్లో 33 36 18 22 21 23 25 అన్ని విధాలా సహకరించిన ప్రజలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. పోటీ చేసిన ఏడు వార్డుల్లో ప్రజా తీర్పును శిరసావహిస్తామన్నారు. నిత్యం ప్రజల కోసమే ఉద్యమిస్తామని, ఎన్నికల కమిషన్ అధికారులు ఓటర్ స్లిప్పులు సక్రమంగా జరపలేదని, అలాగే ప్రలోభాలను అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. సిపిఐ పోటీ చేసిన ఏడు వార్డుల్లో గట్టి పోటీ ఇచ్చామని అన్నిచోట్ల గెలుస్తామని విజయసారథి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మోసానికి వ్యతిరేకంగా కొన్ని వార్డుల్లో టిఆర్ఎస్ తో అవగాహనతో ఓట్లను బదిలీ చేశామన్నారు. సిపిఐ మానుకోట పట్టణ ప్రజలకు అండగా ఉంటుందని, నిరంతరం ప్రజాసమస్యలపై ఉద్యమాలు చేస్తూనే ఉంటామని, పేదల పక్షాననిలుస్తామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ ని ఆదరించిన ప్రజలకు విజయసారథి ధన్యవాదాలు తెలిపారు ఈ సమావేశంలో సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, వీరవెల్లి రవి, బానోత్ లింగ్యా నాయక్, గారరవిచంద్ర బోస్ పాల్గొన్నారు.

## గెలుపుపై కాంగ్రెస్, బిఆర్ఎస్ ధీమా

### మున్సిపాలిటీలపై జెండా ఎగిరేది ఎవరిదో

### జనగామలో 30, స్టేషన్‌ఘనపూర్‌లో 18

ప్రజాపక్షం/జనగామ:మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగియగా బ్యాలెట్ బాక్స్‌ల్లో అభ్యర్థుల భవిత భద్రంగా ఉంది. శుక్రవారం ఓట్ల లెక్కింపు జరగనుంది. గెలుపుపై ఎవరికీ వారు లెక్కలు వేసుకుంటున్నారు. మున్సిపాల్టీలపై జెండా ఎగరవేసే విషయంలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లు ధీమాతో ఉన్నాయి. ఇక కౌంటింగ్ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జనగామ మున్సిపాల్టీ ఓట్ల లెక్కింపు ఏకశీల బిఇడి కళాశాలలో జరగనుండగా స్టేషన్‌ఘనపూర్ ఓట్ల లెక్కింపు రెసిడెన్సియల్ యూనియర్ కళాశాలలో జరగనుంది.

ఈ నెల 11న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరిగింది. జనగామలో రెండు మున్సిపాల్టీలు ఉండగా 80.66 శాతం పోలింగ్ జరిగింది. జనగామలో 30 వార్డులు 44 వేల 45 మంది ఓటర్లు ఉండా 34వేల 821 మంది ఓటు వేయడంతో 79.06 శాతం పోలింగ్ జరిగింది. స్టేషన్‌ఘనపూర్‌లో 18 వార్డులు 18550 మంది ఓటర్లు ఉండగా 15వేల 670 మంది ఓటు వేశారు. ఇక్కడ 84.47 శాతం పోలింగ్ జరిగింది. ఓట్ల లెక్కింపు శుక్రవారం జరగనుంది. జనగామ మున్సిపాల్టి ఓట్ల లెక్కింపు కోసం 30 బృందాలు ఏర్పాటు చేశారు.



అందులో ఒకరు కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్ కౌంటింగ్ సూపర్‌వైజర్లు ఉంటారు. మరో ఆరు బృందాలను రిజర్వ్‌డ్‌గా ఉంచారు. స్టేషన్‌ఘనపూర్‌లో 18 బృందాలు ఏర్పాటు చేయగా అందులో ఒకరు కౌంటింగ్ సూపర్ వైజర్‌గా ఉండనున్నారు. ఇద్దరు అసిస్టెంట్ కౌంటింగ్ సూపర్‌వైజర్లుగా ఉంటారు. జనగామలో 30 వార్డుల కోసం 30 ఏర్పాటు చేయగా స్టేషన్‌ఘనపూర్‌లో 18 వార్డుల కోసం 18 ఏర్పాటు చేశారు. ప్రతి టేపతి వద్ద ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్ ఉండనున్నారు.

**ఎవరి లెక్కలు వారివి**
పోలింగ్ అనంతరం గెలుపు ఓటములపై అభ్యర్థులు పార్టీలు లెక్కలు వేశాయి. జిల్లా కేంద్రమైన జనగామ మున్సిపాల్టీలో 30 వార్డులు ఉండగా 20 వార్డుల్లో తమదే గెలుపని కాంగ్రెస్ చెబుతుంది. తప్పక 18 వార్డుల్లో గెలిచి గులాబి జెండా ఎగరేస్తామని ఎమ్మెల్యే పల్లా తెలిపారు. అయితే పోలింగ్ సరళిమాత్రం రెండు పార్టీల మధ్య టఫ్‌ఫైట్ ఉన్నట్లుగా చెబుతున్నాయి. ఒకరిద్దరు స్వతంత్రులు, రెండు కమ్యూనిస్టులు, రెండు బిజెపి గెలిచే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్, బిజెపి మధ్య టఫ్‌ఫైట్ జరిగితే ఛైర్మన్ ఎన్నికల ఉత్కంఠంగా మారే అవకాశాలు కూడా లేకపోలేదు. ఇక స్వతంత్రులు కీలకం అవుతారన్న చర్చ కూడా జరుగుతుంది. ఇద్దరు స్వతంత్రులు గెలిచే అవకాశాలు ఉన్నట్లు పోలింగ్ సరళి ద్వారా తెలుస్తుండడంతో వారికి ఇరు పార్టీలు బ్యారం పెట్టినట్లు సమాచారం.

**కౌంటింగ్‌కు సర్వం సిద్ధం**
ఇక కౌంటింగ్‌కు సర్వం సిద్ధమైంది. జనగామ, స్టేషన్‌ఘనపూర్ మున్సిపాల్టీల ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకే ప్రారంభం కానుంది. స్ట్రాంగ్ రూమ్‌లను అబ్యర్థుల ఎజెంట్ల సమక్షంలోనే తెరవనున్నారు. ఆ తరువాత ఒక్కొక బ్యాలెట్ బాక్స్‌ను తీసుకెళ్లి లెక్కిస్తారు. అయితే ఒకొక వార్డులో రెండు, మూడు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఒక బ్యాలెట్ బాక్స్ ఓట్లను కట్టలు కట్టి లెక్కించిన తరువాత మరో బ్యాలెట్ బాక్స్ తీసుకొచ్చి లెక్కిస్తారు. ఇలా ఒక్కొక వార్డుకు ఒకొక కేటాయించి లెక్కిస్తారు. ఓట్ల లెక్కింపు జరిగే ప్రాంతాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. సిసి కెమెరాల పర్యవేక్షణలోనే ఓట్ల లెక్కింపు జరగనుంది. ఓట్ల లెక్కింపు సందర్భంగా ప్రతి అభ్యర్థికి ఒక ఎజెంట్‌ను కూడా పాస్‌లు జారీ చేశారు.

# కార్మికశక్తిని తాకట్టు పెట్టేందుకే లేబర్ కోడ్స్

మోదీ పాలనలో హక్కుల హననం

కార్మిక, రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల నేతల హెచ్చరిక

ఖమ్మంలో ప్రదర్శన





**ప్రజాపక్షం/ ఖమ్మం :** దేశంలోని కార్మిక శక్తిని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌ను అమల్లోకి తీసుకువచ్చిందని అఖిలపక్ష, కార్మిక, రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్స్‌తో పాటు విద్యుత్, విత్తన సవరణ బిల్లులు, విబిజిరాంజి చట్టం కూడా దేశ ప్రజల పాలిట శాపంగా మారాయని, వాటిని తక్షణం రద్దు చేయాలని నేతలు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం ఖమ్మంలోని పెవిలియన్ మైదానం నుంచి జెడ్పి సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు, బ్యాంకు ఉద్యోగ సంఘాలు, సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతు సంఘాలు సంపూర్ణ మద్దతునిచ్చాయి. పెవిలియన్ మైదానంలో వివిధ కార్మిక సంఘాల అధ్యక్షులు గాదె లక్ష్మినారాయణ, నరాల నరేష్‌నాయుడు, కళ్యాణం వెంకటేశ్వరరావు, కె. శ్రీనివాస్, వెంకన్న, ఎండివై పాషా అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, కాంగ్రెస్ నాయకుడు నాగండ్ల దీపక్ చౌదరి, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు ఎస్‌కె ఖాసీం, గుండాల కృష్ణ తదితరులు ప్రసంగించారు. బ్రిటిష్ పాలన కాలంలో సైతం కార్మికులు పోరాడి కార్మిక చట్టాలను, హక్కులను సాధించుకున్నారని దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులను మోదీ ప్రభుత్వం రద్దు చేస్తుందని ఆరోపించారు. 50 కోట్ల కార్మిక హక్కులను ఒక శాతం జనాభా కలిగిన కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చారని ఆయన తెలిపారు. ఏ ప్రభుత్వం ఇంతవరకు కార్మికులకు అనుకూల చట్టాలు చేయలేదని కార్మికుల పోరాట ఫలితంగానే పాలకులు చట్టాలు తీసుకువచ్చారని వారు తెలిపారు. ఇప్పటికే ప్రైవేటీకరణ వేగం పెంచిన మోదీ ప్రభుత్వం యావత్ దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే క్రమంలోనే 29 కార్మిక చట్టాలను మార్చారన్నారు. మోదీ తీసుకువచ్చిన చట్టాలలో సంక్షేమం, హక్కులు లేకపోగా ఆ చట్టాలకు సంక్షేమ చట్టాలని పేరుపెట్టడం నేతి బీరకాయలో నేతి చందమేనన్నారు. తక్షణమే లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత చట్టాలను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెకు వచ్చిన స్పందన చూసిన తర్వాతనైనా తమ నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం మార్చుకోవాలన్నారు. లేని పక్షంలో తగిన ఫలితాన్ని అనుభవించక తప్పదని వారు హెచ్చరించారు. ఈ ప్రదర్శనలో వివిధ సంఘాల నేతలు కొండపర్తి గోవిందరావు, శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్, దొండపాటి రమేష్, వై. విక్రం, తోట రామాంజనేయులు, రావి శివరామ కృష్ణ, మోహన్‌రావు, పిల్లి రమేష్, జాకీరుద్దీన్, పోటు కళావతి, పగడాల మల్లేష్, విష్ణువర్ధన్, భూక్యా శ్రీను, సంగయ్య, పాల్వంచ కృష్ణ, రాజేష్, రవి, సైదా, మెరుగు సత్యనారాయణ, పొన్నం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి నిర్వాకం.. లబోదిబోమంటున్న ఓటర్లు



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మున్సిపల్ ఎన్నికల్లో 10 వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి వ్యక్తికి కౌంటింగ్ జరగకుండానే ఓడిపోతున్నామని భయంతో పంపిణీ చేసిన నగదు రూ.2500, బహుమతిగా ఇచ్చిన కుక్కర్ ఇతర వస్తువులు వెంటనే ఇవ్వాలని అభ్యర్థి ముఖ్య అనుచరులు ఓటర్లను బెదిరిస్తూ ఇవ్వాలని అసభ్య పదజాలాలతో దూషిస్తుండటంతో 10 వార్డులోని ఓటర్లు కుక్కర్లు నగదు ఇతర బహుమతులు తీసుకువచ్చి అల్లూరి సీతారామరాజు నగర్ రోడ్డుపై పెట్టి ఆందోళనకు దిగిన సంఘటన గురువారం మున్సిపాల్టీ పరిధిలో జరిగింది. మేము మిమ్మల్ని ఇవ్వమని అడిగామా మీరు వచ్చి మా ఇండ్ల చుట్టూ తిరిగి ప్రాధేయపడి బ్రతిమాలి ఇచ్చారు అని ఓటర్లు తమదైన శైలిలో జవాబు ఇచ్చారు. ఈ విధంగా ఉంటుందని కౌంటింగ్ జరగక ముందే మాపై ఆరోపణలు చేయటం బాధ కలిగిస్తుందని ఓటర్లు వాపోతున్నారు. వాస్తవంగా అక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓట్లు పడలేదని అభ్యర్థి అతని అనచరులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఎన్నికల నిబంధనలు చట్టాలు ఈ సంఘటనపై ఏమి చేస్తాయో వేచి చూడాల్సిందే.

## దేశ వ్యాప్త సమ్మె విజయవంతం

సింగరేణిలో మద్దతు తెలిపిన కార్మిక వర్గం



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** సత్తుపల్లి జె.వి.ఆర్ ఓసి , కిష్టారం ఓసి , జె.వి.ఆర్ సి.హెచ్.పి లో సింగరేణి ఉద్యోగులందరూ ఐఎన్‌టియుసి సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్, సింగరేణిలో ఉన్న జాతీయ సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బొగ్గు బ్లాక్‌లను కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు తెలంగాణ రాష్ట్రానికి బంగారంగా ఉన్నటువంటి సింగరేణి సంస్థను కాపాడుకోవాలని స్వచ్ఛందంగా ఉద్యోగులు విధులకు హాజరుకాకుండా సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మెతో కేంద్రానికి గుణపాఠం రావాలని సత్తుపల్లి సింగరేణి ఐక్య కార్మిక సంఘాల జెఎసి నాయకులు తీగల క్రాంతికుమార్, కోటి, సముద్రాల సుధాకర్, దండు ఆదినారాయ , ఆంజనేయులు, చంద్రశేఖర్, సంపత్, శరత్ అన్నారు. కార్మిక చట్టాలను లేబర్ కోడ్ లు గా మార్చి పారిశ్రామిక ప్రగతిని దెబ్బతీయడానికి ఉద్యోగుల హక్కులను కాలరాయడానికి కేంద్రం నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఐఎన్‌టియుసి నాయకులు రామారావు, నాగేశ్వరరావు, బాలాజీ, ఎఐటియూసి నాయకులు సూర్య ప్రకాష్, నరసింహారావు, భరణి, కిషోర్ , ప్రసాద్ , రఘువీర్ , పి.పి రాజు , సంపత్ , కార్తీక్ ఇతర యూనియన్ నాయకులు , కార్యకర్తలు , ఉద్యోగులు పాల్గొన్నారు.

## నేడు ఖమ్మం రీజియన్‌లో మేధో మథనం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, ఖమ్మం రీజియన్ అభివృద్ధిపై నేడు మేధోమథన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఖమ్మం నూతన బస్టాండ్‌లో నిర్వహించే మేధోమథన కార్యక్రమంలో ఖమ్మం రీజియన్‌లో గల అధికారులతో కలిసి సంస్థ అభివృద్ధి దిశగా తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించనున్నామన్నారు. మేధోమథన కార్యక్రమంలో ముఖ్యంగా ఆదాయ వనరుల పెంపు, సామగ్రి, సిబ్బంది, నిర్వహణకు సంబంధించిన ఖర్చుల తగ్గింపు, ఆపరేషన్లలో లోపాలను తగ్గించి సమర్థత పెంపు, నిర్ధారక వ్యయ నియంత్రణ, ఆదాయ లీకేజీల నివారణ, ఆటోమేషన్, ఆవిష్కరణలు, యాంత్రీకరణ అవకాశాల అన్వేషణ వంటి అంశాలపై చర్చించనున్నామన్నారు. డిపో మేనేజర్లు, ట్రాఫిక్, మెయింటినెన్స్ సూపర్‌వైజర్లు, ఎడిసిలు, ఇతర విభాగాధిపతులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు తెలిపి సంస్థ ఆర్థికస్థితి మెరుగుదలకు సహకరించాలని ఆర్‌ఎం తెలిపారు.

## గౌడ సంఘ భవనానికి రూ. 5 కోట్లు మంజూరు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం గౌడ సంఘ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.5కోట్లు నిధులు మంజూరు చేసినట్లు మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ తెలిపారు. గురువారం వీడియోస్ కాలనీలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో తెలంగాణ గౌడ సంఘం, గోపా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తదితరులు మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రమైన రఘునాథపాలెం వద్ద తెలంగాణ ప్రభుత్వం గతంలో 29 కుంటల భూమిని గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కేటాయించడం జరిగిందన్నారు. అట్టి భూమిలో గౌడ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ఇప్పుడు ప్రభుత్వం ఐదు కోట్లు నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ చేసిందన్నారు. నిధుల విడుదలకు కృషి చేసిన గౌడ సంఘానికి, సహకరించిన మంత్రులకు, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సమావేశంలో గోపా జిల్లా అధ్యక్షులు డా॥ బొల్లికొండ శ్రీనివాసరావు, వడ్డెబోయిన నర్సింహారావు, తెలంగాణ గౌడ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమరగాని వెంకన్న, నెహ్రూ, రుద్రగాని ఉపేందర్, మార్కం లింగయ్య, డా॥ నారగాని రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తీర్థాల జాతరకు స్పెషల్ బస్సులు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని తీర్థాల కూడలి జాతరకు టిజిఎస్‌ఆర్‌టిసి ఖమ్మం డిపో ఆధ్వర్యంలో స్పెషల్ బస్సులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శివప్రసాద్ గురువారం తెలిపారు. ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 14న శనివారం సాయంత్రం నుంచి ఖమ్మం పాతబస్టాండ్, కాల్వొడ్డు నయాబజార్ స్కూల్ వద్ద నుంచి 25 ప్రత్యేక బస్సులు నడపడనున్నట్లు ఆయన తెలిపారు. ఈ బస్సులు మొత్తం 200 ట్రిప్పులు తిరుగుతాయన్నారు. ఈ బస్సులన్నీ కామంచికల్ మీదుగా తీర్థాల శివాలయం వరకు భక్తులను తీసుకెళ్తాయన్నారు. జాతరకు భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని అం చనా తో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏ ర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఛార్జీ పెద్దలకు రూ. 30, పిల్లలకు రూ. 20 మాత్రమే అన్నారు. భక్తులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్టిసి బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించాలని డిపో మేనేజర్ శివప్రసాద్ కో రారు.

## కార్పొరేషన్ ఓటర్లు మన పక్షానే నిలిచారు

ఓట్ల లెక్కింపు సమయంలో అప్రమత్తంగా ఉండాలి

కార్పొరేషన్ అభ్యర్థులు, ఏజెంట్లకు

దిశా నిర్దేశం చేసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కార్పొరేషన్ ఎన్నికల్లో ఓటర్లు మన పక్షానే నిలిచారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం స్థానిక శేషగిరి భవన్ సిపిఐ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ ఎన్నికల లెక్కింపు ప్రక్రియ సందర్భంగా పోటీచేసిన అభ్యర్థులతో పాటు కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కౌంటింగ్‌లో పూర్తి స్థాయి ఫలితాలు వెలువడేంత వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. డిక్లరేషన్ ఫామ్‌లు అందుకున్న తర్వాతే కౌంటింగ్ కేంద్రం నుండి బయటకు రావాలని, ఎటువంటి అనుమానాలు ఉన్నా వెంటనే రీకౌంటింగ్ కోరాలని సూచించారు. కార్పొరేషన్ వ్యాప్తంగా సిపిఐ అభ్యర్థులే గెలవబోతున్నారని అన్నారు. కౌంటింగ్‌కు సంబంధించి అనుబోస్ కాలేజీలో అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారని, కౌంటింగ్ విషయంలో అనుసరించాల్సిన విధి విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూనంనేని వివరించారు. అనంతరం సిపిఐ జి ల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా మాట్లాడుతూ అభ్యర్థితో పాటు ఏజెంట్ సమయానికి కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని, బ్యాలెట్ బాక్సుల ప్రధాన సీల్ సరిగా ఉందా లేదా అనే విషయాన్ని సరిచూసుకోవాలని చెప్పారు. అభ్యర్థితో పాటు కౌంటింగ్ ఏజెంట్లు చాలా అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఇదే అని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, ఫయూమ్ దాదా, ధస్రు, విశంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, నాగుల్ మీరా, కేశవులు, మనిగడప వెంకటేశ్వర్లు, పద్మ, పద్మజ, భూక్యా శ్రీను, అన్నారపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మున్సిపాల్టీల్లో 163 బిఎన్ఎస్ అమలు

సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతి లేదు

లెక్కింపు కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు

ఎస్‌పి రోహిత్ రాజ్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఎన్నికల లెక్కింపు సందర్భంగా కౌటింగ్ కేంద్రాల వద్ద శుక్రవారం గట్టి పోలీస్ బందోబస్తుతో పాటు 163 బిఎన్ఎస్ చట్టం అమల్లో ఉంటుందని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం సభలు, సమావేశాలు, ర్యాలీలకు ఎలాంటి అనుమతి లేదని, డిజేల వినియోగం, బాణా సంచా కాల్చడం వంటివి కూడా నిషేధం అన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట బందోబస్తు ఉంటుందని, ఓట్ల లెక్కింపు పరిసర ప్రాంతాలు డాగ్ స్క్వాడ్, బాబు స్క్వాడ్స్ నిరంతర తనిఖీలు ఉంటాయని చెప్పారు. నిషేధిత వస్తువులు కౌటింగ్ సెంటర్లలోనికి తీసుకురాకూడదని, తనిఖీలు చేసే పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్నికల అధికారులు జారీ చేసే గుర్తింపు కార్డులు ఉన్న వారు మాత్రమే లెక్కింపు కేంద్రంలోకి అనుమతి ఉంటుందని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి..

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు

చంద్ర నరేంద్ర కుమార్



**ప్రజాపక్షం/జూలూరుపాడు :** దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం సిపిఐ జులూరుపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు చంద్ర నరేంద్ర కుమార్ మాట్లాడుతూ అధికారంలో ఉన్నటువంటి నరేంద్ర మోదీ బిజెపి ప్రభుత్వం కార్మికుల శ్రమను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కంకణం కట్టుకున్నదని దానిలో భాగంగానే ముందు తరాల కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను సవరించి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చింది అన్నారు. వేతనాల కోడ్ ను 2019 లో, పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ 2020 సెప్టెంబర్ లో ప్రతిపక్ష పార్టీల ఎంపిలందరూ వీటిని వ్యతిరేకిస్తూ పార్లమెంటును బైకాట్ చేసిన సందర్భంలో, దేశం మొత్తం కరోనా కష్టకాలంలో ఉండగా పార్లమెంటులో ఆమోదింప చేసుకున్నారని అన్నారు. దేశ ప్రజల, కార్మికుల సంక్షేమం కంటే, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలే వీరికి ముఖ్యమన్నారు. ఈ ఐదు సంవత్సరాల కాలంలో జరిగిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెల ఫలితంగా అమలుకు పూనుకోని కేంద్ర ప్రభుత్వం 2025 నవంబర్ లో నోటిఫై చేసి, 2026, ఏప్రిల్ నుండి అమలుకు సిద్ధమవుతుందన్నారు. ఈ లేబర్ కోడ్ లు అమలు అయితే కార్మిక హక్కులు కాలరాయబడతాయి అన్నారు. వీటిని తిప్పకొట్టవలసిన బాధ్యత కార్మిక వర్గంపై ఉందన్నారు. లేకపోతే కార్పొరేట్ శక్తులకు కార్మిక వర్గం కట్టు బానిసలుగా తయారయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ఎస్‌కె. నాగుల్ మీరా, ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె చాంద్ పాషా, ఎల్లంకి మధు, కంచర్ల రాఘవేంద్రరావు, నిమ్మటూరి లచ్చయ్య , పత్తిపాటి మహేష్ బరగడ రమేష్ గార్లపాటి బద్రి ఎస్కె బుడెన్ పాషా పసుపులేటి పవన్, ఎస్‌కె అన్వర్, వంశీ, వెంకటేష్, సురేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెకు పెన్షనర్ల సంఘం మద్దతు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** సార్వత్రిక సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సమ్మెకు సంఘీభావంగా గురువారం పెన్షనర్ల సంఘం కృషి భవన్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. దేశ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపే విత్తన బిల్లును, విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులు చేస్తున్న ఆందోళనకు తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దమాళ్ల సత్యనారాయణ, కొల్లికొండ శరత్‌బాబు, ఊడుగు వెంకటేశ్వర్లు, ప్రసాదరావు, నాగప్రసాద్, సుధాకర్, హుస్సేన్, రామారావు, అశోక్, వెంకటేశ్వర్లు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

## ఏ ఒక్కరితోనో తెలంగాణ రాలేదు

ఉద్యమకారుల సంక్షేమం కోసం

టిజెఎస్ కట్టుబడి ఉంది

ప్రొఫెసర్. యం.కోదండరామ్




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ రాష్ట్రం ఏ ఒక్కరితోనో రాలేదని, అమరువీరుల త్యాగాల వలన సాధించుకున్నామని తెలంగాణ జనసమితి వ్యవస్థాపకులు ప్రొ.యం.కోదండరామ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం పాలేరు డివిజన్ స్థాయి సదస్సు జిల్లా నాయకులు మాదాసు శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం అనేక మంది అమరులైయ్యారని, ఆయన తెలిపారు. ఏ ఒక్కరి వలన తెలంగాణ వచ్చిందంటే అది పొరపాటని అన్నారు. అటువం టి ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వాలని కోరా రు. ప్రభుత్వం ఉద్యమకారులపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం టిజెఎస్ కట్టుబడి ఉందని అన్నారు. రాష్ట్రం అంతా ఎరువుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఎరువుల. సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్ రావు, పల్లె వినయ్ కుమార్, కె.రవి, మాదాసు శ్రీనివాసరావు, బెల్లంకొండ నాగేశ్వరరావు, తీగ రాములు, రవీందర్ నాయక్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఓట్ల లెక్కింపునకు పటిష్ఠ ఏర్పాట్లు

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** కల్లూరు డివిజన్‌లో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా మూడు అంచెల భద్రతా వ్యవస్థను అమలు చేసినట్లు ఎసిపి వసుంధర యాదవ్ గురువారం తెలిపారు. అన్ని కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 24×7 పోలీసు నిఘా ఏర్పాటు చేశారు. కౌంటింగ్ హాళ్లలో అనధికార వస్తువులకు నిషేధం విధించడంతో పాటు, చెల్లుబాటు అయ్యే ఐడీ ఉన్నవారికే ప్రవేశం ఉంటుందని స్పష్టం చేశారు. ట్రాఫిక్ మళ్లింపులు, ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేయగా, నియమావళి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు శుక్రవారం చేపట్టనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏదులాపురం, వైరా, మధిర, కల్లూరు, సత్తుపల్లి, అశ్వారావుపేట, ఇల్లందు మున్సిపాలిటీలతో పాటు కొత్తగూడెంతో పాటు కొత్తగూడెం కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు జరగనుంది. ఉదయం ఎనిమిది గంటల నుంచి లెక్కింపు ప్రారంభిస్తారు. తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కించి ఆ తర్వాత మిగిలిన ఓట్లను కట్టలు కట్టి లెక్కింపు ప్రారంభిస్తారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో నాలుగు రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగనుండగా మిగిలిన అన్ని మున్సిపాలిటీలలో రెండు రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఏదులాపురంలో 37,435, వైరాలో 20,668, సత్తుపల్లిలో 22,434, కల్లూరులో 16,428, మధిర 20,078 ఓట్లు పోలయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేటలో 12,849 ఓట్లు పోల్ కాగా ఇల్లందులో 23,121 ఓట్లు, కొత్తగూడెం కార్పొరేషన్‌లో 100453 ఓట్లు పోలయ్యాయి. పోలైన ఓట్లను కట్టలుగా కట్టి తర్వాత లెక్కిస్తారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల లెక్కింపు అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో, ఇల్లందు మున్సిపల్ ఓట్ల లెక్కింపు సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో, అశ్వారావుపేట మున్సిపల్ ఓట్ల లెక్కింపు వ్యవసాయ కళాశాలలో చేపట్టనున్నారు. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి ఓట్ల లెక్కింపు జ్యోతి నిలయం పాఠశాలలో, వైరా మున్సిపల్ ఓట్ల లెక్కింపు పశు గణాభివృద్ధి శాఖ కార్యాలయం, ఏదులాపురం ఓట్ల లెక్కింపు ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో, మధిర మున్సిపల్ ఓట్ల లెక్కింపు పాలిటెక్నిక్ కళాశాలలో, కల్లూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓట్ల లెక్కింపు జరగనుంది.

**బరిలో నిలిచిన అభ్యర్థులు :**

ఏదులాపురం మున్సిపాలిటీలో 32 వార్డులకు గాను ఒక వార్డు ఏకగ్రీవం కాగా 31 వార్డులకు 108 మంది, వైరా 20 వార్డులకు 80 మంది, సత్తుపల్లిలో 23 వార్డులకు 84 మంది, కల్లూరులో 20 వార్డులకు 71 మంది, మధిరలో 22 వార్డులకు 70 మంది బరిలో నిలిచారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో 60 వార్డులకు గాను 354 మంది, ఇల్లందులో 24 వార్డులకు 107 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా అశ్వారావుపేటలో 22 వార్డులకు 68 మంది పోటీలో ఉన్నారు.

**పటిష్ట భద్రత : కలెక్టర్**

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. లెక్కింపు ఏజెంట్లకు ప్రత్యేక ద్వారాన్ని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా లెక్కింపు ఏర్పాట్లపై ఆయన అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెక్కింపు కేంద్రాల్లో మెస్ ఏర్పాట్లు చేశామని అధికారులకు, లెక్కింపు ఏజెంట్లకు, రాకపోకలకు ప్రత్యేక ద్వారాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వంద శాతం వెబ్ కాస్టింగ్ చేస్తున్నట్లు ప్రతి ఓటింగ్ కేంద్రంలో రూట్‌మ్యాపు బోర్డు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. లెక్కింపు గదుల్లో లెక్కింపు సిబ్బంది, అభ్యర్థులు, లెక్కింపు ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుందని వీరందరికీ పాసులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో లెక్కింపు ప్రారంభమవుతుందని నిబంధనల ప్రకారం లెక్కింపు జరుగుతుందన్నారు. లెక్కింపు తర్వాత తిరస్కరించబడిన బ్యాలెట్లను సీజ్ చేసి స్ట్రాంగ్ రూముకు తరలించాలన్నారు. ఖమ్మం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో రెండు రౌండ్లలో లెక్కింపు పూర్తయ్యేలా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మొత్తం ప్రక్రియను వీడియోగ్రఫీ చేయనున్నట్లు తెలిపిన కలెక్టర్ విధుల్లో నిర్లక్ష్యానికి తావివ్వవద్దని సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆయన సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
శుక్రవారం
13-02-2026
www.prajapaksham.in

‘ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, కార్మిక, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను నిరసిస్తూ దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఎఐటియుసితో సహా జాతీయ కార్మిక సంఘాలు పాల్గొని నిరసన వ్యక్తం చేశాయి. కేంద్ర , రాష్ట్ర ఉద్యోగుల ఫెడరేషన్లు, అసోసియేషన్లు, రైతు సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు నిర్వహించారు. ’

రీల్

## కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాల్సిందే

# నినదించిన కార్మిక లోకం


ఖమ్మం...


శ్రీరాంపూర్...


సూర్యాపేట..కోదాడ..


నిజామాబాద్...

**ప్రజాపక్షం/ఖమ్మం :** నాలుగు లేబర్ కోడ్‌లతో పాటు విద్యుత్, విత్తన సవరణ బిల్లులు, విబిజీ రాంజీ చట్టాలను రద్దు చేయాలని కార్మిక వర్గం నిర్వహించిన సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. సమ్మెలో భాగంగా సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తుల చేతిలో మోడీ బందీ అయ్యారని ఆరోపించారు. ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు యూసుఫ్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న హక్కులను మోదీ ప్రభుత్వం హరిస్తుందన్నా ఆరోపించారు. కార్యక్రమంలో ఎఐకెఎస్ నాయకులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, ఎఐటియుసి నాయకులు శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్, గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్ :** కార్మిక రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, బికెఎంయు రాష్ట్ర అధ్యక్షుడు వెంకట రాములు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా వరంగల్ రైల్వే స్టేషన్ నుండి చౌరస్తా వరకు మహా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ భాష్మియా, ఎఐటియూసి నాయకులు దండు లక్ష్మణ్, ఎండి యాకూబ్, సతీష్, జన్ను ప్రకాష్, ఇనుముల శ్రీనివాస్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్, తెలంగాణ జర్నలిస్టుల వర్కింగ్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

**భూపాలపల్లి :** నరేంద్ర మోడీ ప్రభుత్వం నాలుగు కార్మిక వ్యతిరేక కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో భూపాలపల్లి ఏరియాలోని అన్ని మైన్స్, డిపార్ట్మెంట్, వర్క్ షాప్, ఏరియా హాస్పిటల్ అన్ని విభాగాల్లో సమ్మె నిర్వహించారు. సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమంలో నాయలు మోటపలుకుల రమేష్, జి.సుధాకర్‌రెడ్డి, ఆసిఫ్ పాషా, జి.శ్రీనివాస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

**తొర్రూరు :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు, కార్మిక చట్టాలను రద్దు చేయాలని తొర్రూరు డివిజన్ కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించిన బస్టాండ్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ తీరుపై నినాదాలు చేస్తూ రాస్తారోకో చేపట్టారు. సిపిఐ రాష్ట్ర నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షుడు ఓమ బిక్షపతి, సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఘనపురం లక్ష్మణ్, సహాయ కార్యదర్శి పేరబోయిన కిరణ్, పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, మండల రైతు సంఘం నాయకులు కోటగిరి యాకాంతం, యువజన నాయకులు కోటగిరి కృష్ణ, తండా సురేశ్, బంగారి శ్రీను, వాసు, గద్దెల వెంకటయ్య, మహమ్మద్ షరీఫ్, పుల్లయ్య, లింగాచారి, శ్రీను, వేణు, బంగారు శ్రీనివాస్, శ్రీరామ్ పుల్లయ్య, గద్దల వెంకటయ్య, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ :** సార్వత్రిక సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలోని గీతా భవన్ చౌరస్తా నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు నిరసన ప్రదర్శన అనంతరం పిఎఫ్ ఆఫీస్ రోడ్డులో సభ జరిగింది. ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న యాదవ్ అధ్యక్షతన జరిగిన సభలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి సమ్మయ్య, వివిధ యూనియన్ల నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసా కార్మిక సంఘం నాయకులు బి.అశోక్, రైతు సంఘం నాయకులు పొన్నగంటి కేదారి, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రీజియన్ కార్యదర్శి కాళిదాసు నాయకులు కొమురయ్య, రైల్వే అమాలి యూనియన్ కాసెట్టి లక్ష్మయ్య, దాసరి ప్రభాకర్, సివిల్ సప్లై అమాలి యూనియన్ రాజేందర్, సంపత్ యాదవ్,ఉల్లిగడ్డ అమాలి యూనియన్ రాజు పాల్గొన్నారు.

**జగిత్యాల :** కేంద్రం ప్రభుత్వం తీసుకవచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాలు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ముఖ్రం తదితరులు పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డిపేట :** కేంద్ర కార్మిక సంఘాల పిలుపునిచ్చిన సార్వత్రిక సమ్మెకు సిపిఐ మద్దతు ఇస్తుందని రాష్ట్ర నాయకులు గుంటి వేణు, రాజన్న సిరిసిల్ల జిల్లా మిడ్ డే మీల్స్ జిల్లా కార్యదర్శి మీసం లక్ష్మణ్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ ఎంఇఒ కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. చీకట్ల సత్తెవ్వ, నాగేశ్వరి, రాజేశ్వరి, కొమరవ్వ, లత, వెంకటేష్, మహేష్, రాజు, లావణ్య, భాగ్య,మంజుల, లక్ష్మి పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ :** సార్వత్రిక సమ్మెలో భాగంగా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సమ్మెలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు డి.సుధాకర్, పిడుగు శంకర్, చల్లూరి నగేష్‌తో పాటు పెద్ద ఎత్తున వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**శ్రీరాంపూర్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాల సమ్మెలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులపై కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో నిరసనలు, ధర్నాలు నిర్వహించారు. అనంతరం శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద మహాధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్‌టియుసి జనరల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, టిబిజికెఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, ఎస్కె బాజీ సైదా తదితరులు పాల్గొన్నారు.

**భువనగిరిరూరల్ :** కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎండి ఇమ్రాన్ డిమాండ్ చేశారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మెలో భాగంగా భువనగిరిలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, సామల శోభన్ బాబు, సామల భాస్కర్, పిన్నం జగన్, గౌరవంతల శ్రీనివాస్, ఎర్ర బాబు, రవి, కుమార స్వామి, అరుణ్, జహంగీర్, మైసయ్య, కరీం, నాయక్, కరుణాకర్, వెంకటేష్, మల్లేశం, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

**కోదాడ:** కార్మికుల సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఎఐటియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియు సంఘాల ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె సందర్భంగా బస్టాండ్ సెంటర్ నుండి రంగా థియేటర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ముల్కలపల్లి రాములు, ఎఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఉదయగిరి మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘాల జిల్లా నాయకులు దొడ్డా వెంకటయ్య, వెంకటేశ్వరరావు, ఎస్‌కె లతీఫ్, మిట్టగణపుల ముత్యాలు, రవి, పోతురాజు సత్యనారాయణ, శ్రీనివాస్, ప్రసాద్, వెంకటేష్, తిరపయ్య, కొండలు, నాగయ్య, సైదాకుమార్, విద్యాచారి, సైదులు, గోప్రా నాయక్, జాని, మోసిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**సిద్దిపేట :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ డిమాండ్ సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి యేడల వనేశ్, నాయకులు కర్నాల చంద్రం, బిక్షపతి, కనకరాజు, నర్సింలు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

**నల్లగొండ :** నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎఐటియుసి, సిఐటియు, ఐఎన్‌టియుసి, బిఆర్‌టియు, ఐఎఫ్‌టియు సంయుక్త ఆధ్వర్యంలో సుభాష్ విగ్రహం నుంచి పెద్దగడియారం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించి అనంతరం సభ చేపట్టారు. సభలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, సిఐటియూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, ఐఎన్‌టియూసి జిల్లా అధ్యక్షులు అంబటి సోమయ్య, బిఆర్‌టియూ జిల్లా అధ్యక్షులు గుర్రం వెంకటరెడ్డి, ఐఎఫ్‌టియూ జిల్లా కార్యదర్శి బొమ్మిడి నగేష్, ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు నందం, ఎంప్లాయిస్ యూనియన్ నల్లగొండ డివిజన్ కార్యదర్శి ఎన్ఆర్.సి రాజు, మిషన్ భగీరథ జిల్లా కార్యదర్శి ఎండి జానీ పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** జిల్లా కేంద్రంలో అంబేద్కర్ స్తూపం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య, రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెలుతురు సదానందం తదితరులు పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్ :** కార్మిక సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేసి ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్.శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రవీందర్, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు శంకర్‌గౌడ్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, సువర్ణ వరలక్ష్మి, ఐకెపివిఓఎల సంఘం జిల్లా అధ్యక్షురాలు కవిత, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు జస్వంత్, అంగన్‌వాడి యూనియన్ నాయకురాలు అలివేలమ్మ, వెంకటమ్మ, యాదమ్మ, కృష్ణవేణి, ఎఐటియుసి నాయకులు బొల్లెద్దులశ్రీనివాసులు, రాధాకృష్ణ, ఎస్‌కె ఖాజామైనుద్దిన్, గొర్లసత్యం, యాదయ్య, రాజు, శివకృష్ణ, వాడాలబాలపీరు పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్ :** కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర నాయకులు వివిఎస్ బోస్ డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు కల్లూరి జయచంద్ర ఆధ్వర్యంలో జిహెచ్‌ఎంసి కార్మికులతో ర్యాలీ నిర్వహించారు.

**జనగామ :** నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జనగామ జిల్లా వ్యాప్తంగా ఎఐటియుసి, సిఐటియు, ఎల్ఐసి ఆధ్వర్యంలో ఐసిఈయు ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వయించి నిరసన తెలిపారు. ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు మోటే శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆది సాయన్న, చొప్పరి సోమయ్య, నాయకులు చామకూర యాకూబ్, చెల్లోజు మల్లేష్, గొలకొండ నాగరాజు, గుండెలి రాజు, సొప్పరి సోమయ్య, రావుల సదానందం, బానోతు బిచ్చ, కాసాని మల్లయ్య, దయా నాగేష్, చామకూర తిరుమలేష్, సానిక బిక్షపతి, బుడిగ వీరస్వామి, తిప్పరబోయిన సిద్దులు, మెరుగు అంజనేయులు పాల్గొన్నారు.

**నిర్మల్ :** సమ్మెలో భాగంగా మున్సిపల్, సివిల్ సప్లయ్, భవన నిర్మాణ కార్మికులు భారీ నిరసన చేపట్టారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడారు.

**నిజామాబాద్ అర్బన్ :** నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. ఎఐటియుసి కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా నిజామాబాద్ జిల్లాలో ఎఐటియుసి ఆధ్వర్యంలో నిజామాబాద్, డిచ్‌పల్లి, ఇందల్వాయి, భీమ్‌గల్, బాల్కొండ, మోర్తాడ్, కోటగిరి, వర్ని, నవీపేట్, ఏర్గట్ల, సాలూరు, జక్రాన్‌పల్లి, ఆలూరు, సిరికొండ, ధర్పల్లి, మోపాల్, తదితర మండలాల్లో సమ్మె విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో టి.చక్రపాణి, అనిల్, ఫిరోజ్ అలీ, రాధాకుమార్, ఇమ్రాన్, బాజన్న, కైసర్, సాయిలత, ఉమా, వెంకటేశ్‌పాల్గొన్నారు.

**రంగారెడ్డి:** కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు అన్నారు. సార్వత్రిక సమ్మె రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో నాయకులు జే ఆనంద్‌గౌడ్, కన్నెగారి విజయ ఆనంద్‌గౌడ్ ,కార్యాలయ కార్యదర్శి జి సత్యం, సదానందగౌడ్, సయ్యద్ కాజా, పాండు సలీం సాబీర్ హుస్సేన్ జ్యోతి వాణి పుష్ప ఊర్మిళ బుజ్జి శారద తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ...


నిర్మల్...


రంగారెడ్డి...



యాదాద్రి భువనగిరి...


మేడ్చల్..ఘట్‌కేసర్


జగిత్యాల...


జనగాం...


కరీంనగర్...


ఆసిఫాబాద్...


సిద్దిపేట...


ఎల్లారెడ్డిపేట...


నాగర్‌కర్నూల్...


పెద్దపల్లి...


భూపాలపల్లి...


మహబూబాబాద్..తొర్రూర్


వరంగల్...

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com